PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 262 | విజయవాడ, శనివారం 27 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 27 April 2024 | Rs

ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే...

మోడీకి గడ్డు కాలమే!

- ఈసారి మతం కార్డు పనిచేయదు
- ఇసి పనితీరు బాగోలేదు
- 'డెక్కన్ హెరాల్డ్' ఇంటర్వ్యూలో ఏచూరి

7

2025 నుంచి ఏడాదికి

రెండుసార్లు బోర్డు ఎగ్జామ్స్!

న్యూఢిల్లీ : 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఏడాదికి రెండు సార్లు బోర్డు ఎగ్జామ్స్ నిర్వహించడానికి విధివిధానాలు రూపొందించాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)ను కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ కోరింది. సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే యోచనను విరమించుకున్నట్లు తెలిపింది. ఏడాది రెండు సార్లు బోర్డు ఎగ్జామ్స్‌పై వచ్చే నెలలో పాఠశాల ప్రిన్సిపాల్స్‌తో కేంద్ర మంత్రిత్వ శాఖ, సిబిఎస్ఇ సమావేశాలు జరపనున్నాయి. ఇంటర్మీడియేట్ షెడ్యూల్‌పై ప్రభావం చూపకుండా మరో సెట్ బోర్డు ఎగ్జామ్స్ నిర్వహించే విధంగా అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించడానికి సిబిఎస్ఇ ప్రస్తుతం విధివిధానాలను రూపొందించే పనిలో ఉంది. గత ఏడాది కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించిన నూతన కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఎఫ్) ప్రకారం విద్యార్థులు మంచి పనితీరు కనబర్చడానికి, ఉత్తమ స్కోర్‌ను నిలబెట్టుకునే అవకాశాలు పొందడానికి తగిన సమయం, ఎంపిక ఉండేలా బోర్డు పరీక్షలు ఏటా రెండుస్లారు నిర్వహించనున్నారు.

పెండింగ్‌లో 'ఆమంచి' నామినేషన్

- తెనాలిలో ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

నామినేషన్ల పరిశీలన సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల ఉత్కంఠనెలకొంది. బాపట్ల జిల్లా చీరాలలో మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఆమంచికి చెందిన రొయ్యల చెరువులకు రూ.కోట్లలో విద్యుత్ బకాయిలు ఉన్నాయంటూ ఒక జర్నలిస్టు చేసిన ఫిర్యాదుపై రిటర్నింగ్ అధికారి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు సమర్పించేందుకు ఆమంచికి నేటి (శనివారం) ఉదయం పది గంటల వరకు సమయం ఇచ్చారు. ఆ తరువాత తుదినిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసిన ఇద్దరి అభ్యర్థుల ను తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీ తొలుత షేక్ బషీర్‌కు, ఆ తర్వాత డాక్టర్ చందు సాంబశివుడుకు బి-ఫారం ఇచ్చింది. రాష్ట్రంలో ఓటు లేకపోవడంతో బషీర్ నామినేషన్‌ను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ ప్రకటించారు. బషీర్‌కు ఇచ్చిన బి-ఫారాన్ని రద్దు చేయకుండా డాక్టర్ చందు సాంబశివుడుకు కాంగ్రెస్ పార్టీ మరో బి-ఫారం ఇవ్వడం, అఫిడవిట్లో తప్పులు ఉండడంతో సాంబశివుడు నామినేషన్‌ను కూడా తిరస్కరించినట్లు ఆర్ఒ తెలిపారు.

కొన్ని చోట్ల ఉత్కంఠ

నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన నామినేషన్లో ఆస్తులు, అప్పుల వివరాలు సరిగ్గా పేర్కొనకపోవడంతో ఆయన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తొలుత పక్కన పెట్టారు.

దీంతో ఉత్కంఠ నెలకొంది. బుగ్గన తరపున న్యాయవాదులు ఆ వివరాలు సరి చేయడంతో నామినేషన్‌ను ఆమోదిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కృష్ణా జిల్లా గుడివాడలో నూ ఇదే పరిస్థితి నెలకొంది. వైసిపి అభ్యర్థి మిగతా 2లో

రెండో విడతలో 63 శాతం

- త్రిపురలో మళ్లీ రిగ్గింగ్
- అత్యధిక శాతం పోలింగ్ అక్కడే
- యుపిలో అత్యల్పం
- నాలుగు గ్రామాల్లో ఎన్నికలను బహిష్కరించిన జనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : గురువారం రెండో విడత పోలింగ్ చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. కడపటి వార్తలందేసరికి 63శాతం ఓట్లు పోలయ్యాయి. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 88 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించారు. త్రిపురలో మొదటి విడతలో మాదిరిగానే భారీగా రిగ్గింగ్ చోటు చేసుకుంది. అక్కడ గరిష్టంగా 79.46 శాతం పోలింగ్ నమోదవగా, కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో కనిష్టంగా 54.85 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. అస్సాంలో 70.66 శాతం, బీహార్‌లో 55.08 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 72.13 శాతం, జమ్మూకాశ్మీర్‌లో 71.91 శాతం, రాజస్థాన్‌లో 64.07, కర్ణాటకలో 63.90 శాతం, కేరళలో 65.91 శాతం, మధ్యప్రదేశ్‌లో 54.42 శాతం, మహారాష్ట్రలో 57.83, మణిపూర్‌లో 77.32 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 71.84 శాతం పోలింగ్ నమోదైంది. తుది వివరాలు వస్తే ఈ పోలింగ్ శాతాలు పెరగవచ్చని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియాల్సి వుంది. అయితే, అప్పటికే క్యూలో ఉన్న వారికి కూడా ఓటు వేసే వీలు ఎన్నికల కమిషన్ కల్పించింది. మూడో విడత పోలింగ్ మే 7న జరగనుంది. చివరి విడత జూన్ 1న జరుగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. కేరళ, పశ్చిమ బెంగాల్‌ల్లో కొన్ని బూత్‌ల్లో ఇవిఎంలతో సమస్యలు, బోగస్ ఓటింగ్‌లు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. ఉత్తరప్రదేశ్‌లోని మథుర, రాజస్థాన్‌లోని బాన్స్‌వారా(ప్రధాని మోడీ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించింది ఇక్కడే) మహారాష్ట్రలోని పర్భని ప్రాంతాలకు చెందిన నాలుగు గ్రామాల ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. త్రిపురలోని బ్రూ ఓటర్లు మొదటిసారిగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో రౌండ్‌లో 102మంది మహిళలతో సహా 1202 మంది అభ్యర్థులు బరిలో వున్నారు. రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి చంద్రశేఖర్, హేమమాలిని, శశి థరూర్, అరుణ్ గోయెల్ వంటి హేమాహేమీలు ఈసారి పోటీలో వున్నారు. మధ్యప్రదేశ్‌లోని మిగతా 7లో

ఎండలు మండుతుండటంతో గొడుగులు వేసుకొను అస్సాంలోని దర్రాంగ్ జిల్లా గస్థరి గ్రామంలో పోలింగ్ స్టేషన్ బయట క్యూలో నిలబడిన ఓటర్లు

'ఫ్రై' డే

జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగ మండుతుండటంతో రాష్ట్రంలో అనేక జిల్లాల్లో 43 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం పల్నాడు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, ప్రకాశం, సత్యసాయి, విజయనగరం, కడప జిల్లాల్లో సరాసరి 43 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 41 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచాయి. శనివారం దాదాపు 247 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాష్ట్రంలో వడగాల్పులు పెరుగుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వడ దెబ్బకు గురైన వారికి వెనువెంటనే చికిత్స అందించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇవిఎంలకే సుప్రీం ఓటు!

- వివి ప్యాట్‌లపై పిటిషన్ల తిరస్కృతి
- పేపర్ బ్యాలెట్‌కు కూడా నో

లోపలి పేజీలో..

గంగవరం పోర్టు సమస్యల పరిష్కారానికి చర్యలు

అదానీ పోర్టు యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులతో సమస్యల పరిష్కారం కోసం విశాఖ జిల్లా యంత్రాంగం, పోలీసు కమిషనర్ సమక్షంలో చర్చలు జరపాలని గంగవరం అదానీ పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 30కు వాయిదా వేస్తూ జస్టిస్ ఎన్ జయసూర్య శుక్రవారం ఆదేశాలిచ్చారు. నిర్వాసిత కార్మికుల సమ్మె నేపథ్యంలో అదానీ గంగవరం పోర్టు నుంచి విశాఖ స్టీల్ ప్లాంటుకు బొగ్గు సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఆదేశాలివ్వాలంటూ విశాఖ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె వెంకట దుర్గాప్రసాద్ పిటిషన్ దాఖలు చేశారు. వివాద పరిష్కారానికి ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. స్థానికంగా ఉన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు తీసుకున్న చర్యలను వివరించాలంది. కేసుల నమోదు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది.

ఫారమ్-12 సమర్పణకు ఆఖరు తేదీ మే 1

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ వారి పోస్టల్ బ్యాలెట్ (ఫారమ్ నెంబరు 12)ను సమర్పించే తేదీని మే ఒకటి వరకు పొడిగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవంగా ఈ ఫారమ్-12ను సమర్పించేందుకు ఆఖరు తేదీ ఈ నెల 22గా గతంలో ఇచ్చిన ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. తదనంతరం ఆ తేదీని ఈ నెల 25 వరకు పొడిగించారు. అయితే సచివాలయ ఉద్యోగ సంఘాలు, ఇతర ఉద్యోగ సంఘాలు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఈ తేదీని మళ్లీ పెంచాలంటూ ఎన్నికల ప్రధానాధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారమ్-12ను సమర్పించే సమయాన్ని పొడిగిస్తూ ఉత్వర్వులిచ్చారు. పోస్టల్ బ్యాలెట్ గడువు పెంచాలని ఎపి జెఎసి, ఎపి జెఎసి అమరావతితోపాటు పలు ఉద్యోగ సంఘాలు ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో ప్రభుత్వం గడువును పెంచుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నికల విధుల్లోకి అంగన్‌వాడీ, కాంట్రాక్టు ఉద్యోగులు

అంగన్‌వాడీ, కాంట్రాక్టు ఉద్యోగులను ఎన్నికల విధుల్లోకి తీసుకోవాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పోలింగ్ విధుల్లో సిబ్బంది కొరత దృష్ట్యా అంగన్‌వాడీ, కాంట్రాక్టు ఉద్యోగులను ఒపిఒలుగా నియమించాలని శుక్రవారం ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

41ఎ నోటీస్ కోసం రూ.50 వేలు లంచం

- ఎసిబి వలలో ఏలూరు త్రీటౌన్ సిఐ, కానిస్టేబుళ్లు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

41ఎ నోటీస్ కోసం రూ.50 వేలు లంచం డిమాండ్ చేసిన సంఘటనలో ఏలూరు మూడో పట్టణ సిఐ యు.వెంకటేశ్వరరావు, ఇద్దరు కానిస్టేబుళ్లను ఎసిబి అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎసిబి డిఎస్‌పి సుబ్బరాజు వెల్లడించారు. ఆయన వివరాల మేరకు..పలువురికి ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిన రైల్వే శాఖలో ట్రాక్ మెయింటినెన్స్ విభాగంలో పనిచేస్తున్న విక్టర్‌బాబుపై ఏలూరు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో 41ఎ నోటీస్ ఇచ్చేందుకు విక్టర్‌బాబు నుంచి సిఐ వెంకటేశ్వరరావు రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ నగదును ఆయన నేరుగా కాకుండా కానిస్టేబుల్ రాజేంద్ర, ఇస్సాక్‌ల ద్వారా అందించాలని విక్టర్‌బాబుకు ఫోన్‌లో తెలిపారు. విక్టర్‌బాబు ఈ విషయాన్ని రికార్డ్ చేసి అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి రూ.50 వేల నగదును మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కానిస్టేబుల్ ఇస్సాక్‌కు విక్టర్‌బాబు ఇస్తున్న సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి ఇస్సాక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో సిఐ వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ రాజేంద్ర పాత్ర ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. సిఐని, ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్టు చేసి రాజమండ్రి ఎసిబి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎసిబి డిఎస్‌పి సుబ్బరాజు తెలిపారు.

ఆ ఆడియో ఫేక్

- ఇసికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు నారా భువనేశ్వరి దళితులను తిట్టినట్లు వైసిపి సోషల్ మీడియా ఫేక్ ఆడియోను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోందని టిడిపి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సచివాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఓటర్లను ప్రభావితం చేసేలా దిగజారుడు ప్రచారాలు చేస్తున్న వారిని కనిపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫైక్ వార్తలు సృష్టించి వాటిని ప్రచారం చేయడంలో సజ్జల భార్గవ్ రెడ్డినే మూలం అని ఆరోపించారు.

పేదల భూములు లాక్కునేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

పేదల భూములు లాక్కునేందుకే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని జగన్ తీసుకొచ్చారని దేవినేని ఉమామహేశ్వరరావు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆరోపించారు.

ప్రచార వాహనాలు ప్రారంభం

'ఎన్‌రైజ్ ఎపి క్యాంపెయిన్' పేరుతో ఎన్నికల ప్రచార వాహనాలను ఎన్‌ఆర్‌ఐ టిడిపి విభాగం ప్రారంభించింది. టిడిపి కార్యాలయంలో ఆ విభాగం అధ్యక్షులు వేమూరు రవి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. 4 రీజియన్‌లలో 25 పార్లమెంట్లు, 175 నియోజకవర్గాల్లో క్యాంపెయిన్ ఉంటుందని రవి తెలిపారు.

19 నియోజకవర్గాలకు జనసేన ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరేసి చొప్పున ఎన్నికల పరిశీలకులను ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నియమించారు. వీరంతా ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకోవడంతోపాటు పార్టీ గెలుపు కోసం కృషి చేయాల్సి ఉంటుందని తెలిపారు.

కొండంత అప్పు

- కుంగుతున్న కుటుంబాలు
- గరిష్టస్థాయికి చేరిన రుణభారం



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా సాధారణ కుటుంబాలు అప్పుల కుప్పలుగా మారుతున్నాయి. కొండంత రుణభారం సగటు మనిషిని కుంగతీస్తోంది. కుటుంబాల రుణభారం గరిష్టస్థాయికి చేరింది. రిజర్వుబ్యాంకు విడుదల చేసిన తాజా గణాంకాలను విశ్లేషించి మార్కెటింగ్ వ్యవహారాల అధ్యయన సంస్థ 'మోతీలాల్ ఓస్వాల్' చేసిన విశ్లేషణ ప్రకారం 2023- 24 మూడవ త్రైమాసికంలో (క్యూ3) భారతదేశ కుటుంబ అప్పులు స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. జిడిపిలో 39.1శాతానికి కుటుంబ అప్పులు చేరినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ స్థాయిలో కుటుంబాల రుణాలు నమోదుకావడం గతంలో ఎన్నడూ లేదని ఆ సంస్థ తెలిపింది. రానున్న రోజుల్లో కుటుంబ రుణభారం మరింత పెరిగి 39.1శాతానికి చేరుకుంటుందని కూడా ఈ సంస్థ అంచనా వేసింది. ఇది 2020 - 21 నాలుగవ త్రైమాసికంలో (క్యూ4)లో నమోదైన గరిష్ట స్థాయి రుణాలు 38.6 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఈ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం గత ఏడాదితో పోల్చుకుంటే (ఇయర్ టు ఇయర్ ప్రాతిపదికన) 2023-24 మూడవ త్రైమాసికంలో కుటంబాల అప్పు 16.5శాతానికి పెరిగింది. గృహేతర రుణంలోఈ వృద్ధి ఎక్కువగా కనపడుతోందని ఈ సంస్థ విశ్లేషించింది. గృహరుణాలు 2023- 24 మూడవ త్రైమాసికంలో కేవలం ఏడాదికి 6.1 శాతం పెరిగాయి. జిడిపిలో ఇది 15 ఏళ్ల కనిష్టస్థాయికి తగ్గింది. అనేక తక్కువ- ఆదాయ కుటుంబాలు కరోనా మహమ్మారి బారిన పడి తప్పనిసరిగా రుణాలు తీసుకోవలసి రావడంతో 2020- 21 చివరినాటికి కుటుంబ అప్పులు భారీగా పెరిగాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు కుటుంబ అప్పులు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డేటా ప్రకారం.. 2021- 22 లో 7.2 శాతం నుండి 2022- 23 లో కుటుంబాల నికర ఆర్థిక పొదుపులు దాదాపు ఐదు దశాబ్దాల కనిష్ట స్థాయికి పడిపోయిందని సెప్టెంబర్ 19, 2023లో ఎఫ్‌ఇ నివేదిక ప్రకటించింది.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన డొక్కా

టిడిపిలో చేరిన డొక్కా మాణిక్య వరప్రసాద్

- వైసిపికి రాజీనామా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ తన పదవికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. 2021లో టిడిపిలో ఎమ్మెల్సీ పదవిలో ఉన్న ఆయన ఆ పదవికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. తరువాత ఇదే ఎమ్మెల్సీ పదవికి ఆయన తిరిగి ఎన్నికయ్యారు. 2023 మార్చితో ఎమ్మెల్సీ పదవీకాలం ముగిసింది. 2022 సెప్టెంబరులో తాడికొండ నియోజక వర్గానికి అదనపు సమన్వయకర్తగా నియమించి రెండు నెలలకే తొలగించారు. ఆ తరువాత సిఎం జగన్ ఆయన్ను దూరం పెడుతూ వచ్చారు. పార్టీలో తనకు గుర్తింపు లేదని కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సిఎం జగన్‌ను మాణిక్య వరప్రసాద్ కలిసి.. తాడికొండ, ప్రత్తిపాడులో వైసిపి అభ్యర్థుల కోసం కృషి చేయాలని ఎన్నికల తరువాత తగిన ప్రాతినిధ్యం ఇస్తానని జగన్ చెప్పారు. ఇందుకు సంతృప్తి చెందని మాణిక్య వరప్రసాద్ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.

పాఠ్యపుస్తక ముఖచిత్రాల మార్పు

- ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠ్యపుస్తకాల ముఖచిత్రాలు వచ్చే విద్యాసంవత్సరంలో మారనున్నాయని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. 1,2 తరగతుల మినహా అన్ని తరగతులు మారనున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తరగతుల పుస్తకాల ముఖచిత్రాలు సులభంగా గుర్తించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అన్ని తరగతుల పుస్తకాలు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ద్విభాషా పాఠ్యపుస్తకాల రూపంలో ఉన్న సైన్స్, సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకాలను కథలుగా చదవడం ద్వారా సంబంధిత సబ్జెక్టులపై మరింత అవగాహన పెరగడం, ఆంగ్ల భాషా నైపుణ్యాలు సైతం మరింత మెరుగుపడతాయని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పుల ద్వారా విద్యార్థులను గ్లోబల్ సిటిజన్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి: కమిషనర్ సురేష్

న్యాయపరమైన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ చెప్పారు. కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్, శిక్షణ బేసిక్స్ ఆఫ్ లా, చట్టపరమైన కేసులను అధిగమించడంపై ఎస్‌ఓపి రూపకల్పన, నైపుణ్యాలు పరిజ్ఞానాన్ని పెంపొందించే అంశంపై పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. పాఠశాల విద్యకు సంబంధించి చట్టపరమైన అంశాలను అధిగమించడానికి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

టెన్త్ విద్యార్థులతో కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ఎంవిఎస్ స్కూల్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. గుంటూరు పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్కూల్‌లో శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్ఎస్ భారవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ, స్కూల్ చైర్మన్ కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంవిఎస్ కోటేశ్వరరావు ఆశయంతో ఆంధ్రా యూనివర్సిటీ, ఇతర దాతల సహకారంతో నాణ్యమైన విద్యను అందిస్తూ, మొదటి బ్యాచ్‌లోనే అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. పదో తరగతి తర్వాత ఉన్న విద్యావకాశాలు అందిపుచ్చుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు రాసిన 13 మంది విద్యార్థులు జె అమృత, 576, కె రేవతి 565, సిహెచ్ ధనశ్రావ్య 557, వి.ఇమ్మాయినియేల్ 548, షేక్ అఫ్రిది 531, కె సహస్ర 530 మార్కులు సాధించిన వారికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు నగదు బహుమతి ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఎంవిఎస్ కోటేశ్వరరావు భార్య ఎం అమ్మణి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు కె వనలక్ష్మి, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం ఉపేంద్ర, ఎయుఎఎస్‌డి కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, అజయ్‌కుమార్, రిటైర్డ్ డిఇఒ రఘుకుమార్, ప్రిన్సిపల్ ఎన్ తాండవకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ దివ్య, వియ్ ఆర్ విత్‌యు ట్రస్ట్ చైర్మన్ అయ్యప్ప, ఎఎన్‌యు రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్ పిచ్చయ్య, సిపిఎం నగర్ కార్యదర్శి కె నళినీకాంత్ ప్రసంగించారు.

వైసిపి పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- సినీ నటుడు బాలకృష్ణ

ప్రజాశక్తి-గుడ్లూరు (నెల్లూరు జిల్లా)

గుడ్లూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం నెల్లూరు జిల్లా గుడ్లూరులో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ విధానాలపై పలు విమర్శలు చేశారు. మద్యపాన నిషేధం అంటూ కల్తీ మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా ప్రజలపై భారాలు మోపారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేశాడని అన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు టిడిపిని గెలిపించాలని కోరారు. కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును, నెల్లూరు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పెండింగ్‌లో ఆమంచి నామినేషన్

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన నామినేషన్లో ఆస్తులు, అప్పుల వివరాలు సరిగ్గా పేర్కొనకపోవడంతో ఆయన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తొలుత పక్కన పెట్టారు. సాయంత్రంలోపు వివరాలు పూర్తిగా పేర్కొనాలని సమయం ఇచ్చారు. బుగ్గన తరపున న్యాయవాదులు ఆ వివరాలు సరి చేయడంతో నామినేషన్‌ను ఆమోదిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

కృష్ణా జిల్లా గుడివాడలో వైసిపి అభ్యర్థి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) ప్రభుత్వానికి చెందిన గుడివాడ పాత మున్సిపల్ కార్యాలయాన్ని ఉపయోగించుకున్నట్టు అఫిడవిట్‌లో చూపలేదని టిడిపి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ అభ్యంతరాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ తిరస్కరించి ఆయన నామినేషన్‌ను ఆమోదించారు. విశాఖ జిల్లా పెందుర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.అదీప్‌రాజు నామినేషన్ పత్రాల్లో తప్పులు ఉన్నాయని ఆర్‌ఓ శేష శైలజకు టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో, నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ పరిశీలించి అఫిడవిట్‌లో ఒక చోట టిక్ లేదని, తేదీ కూడా వేయలేదని గుర్తించి నామినేషన్‌ను తొలుత పెండింగ్‌లో పెట్టారు. ఆ సమాచారాన్ని అదీప్‌రాజుకు తెలియజేశారు. వాటిని అదీప్‌రాజ్ పూర్తి చేయడంతో నామినేషన్‌ను ఆర్‌ఓ ఆమోదించారు.

దళిత మహిళ విడదల రజిని కిడ్నాప్

- హైకోర్టులో పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరు పశ్చిమ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఈ నెల 25న నామినేషన్ వేసేందుకు ప్రయత్నించిన ఏసుభక్తనగర్‌కు చెందిన విడదల రజిని అనే ఎస్‌సి మహిళ ఆచూకీ తెలియడం లేదంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. రజినిని అభ్యర్థిగా బలపరుస్తూ సంతకం చేసిన (ప్రపోజర్) వ్యక్తి, గుంటూరుకు చెందిన పఠాన్ అస్మతుల్లా పిటిషన్ దాఖలు చేశారు. అధికార పార్టీ రాజకీయ ఒత్తిడితో పోలీసులు రజినిని వేధింపులకు గురిచేస్తున్నారని, కిడ్నాప్ చేశారని, రజినితోపాటు ఆమె భర్త అనురాగరావును కోర్టులో హాజరుపరిచేలా ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యాన్ని సోమవారం విచారిస్తామని జస్టిస్ యు దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం ప్రకటించింది.

పది కిలోల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి- యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పోలీసులు పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. నగదు, నగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాటికి ఎలాంటి పత్రాలూ చూపకపోవడంతో సీజ్ చేశారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో సుమారు రూ.6 కోట్ల విలువైన 10 కిలోల బంగారం పట్టుబడింది.

వ్యాన్‌లో బంగారాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని డెంకాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బంగారానికి సంబంధించి బిల్లులను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఇంత పెద్ద ఎత్తున బంగారం తరలిస్తున్నప్పుడు అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయనగరానికి ఆర్డర్లపై బంగారం షాపులకు అందజేసేందుకు బంగారాన్ని వ్యానులో తరలిస్తున్నట్లు సమాచారం. భోగాపురం వద్ద ఓ కారులో లక్ష రూపాయల నగదు పట్టుబడింది. పూసపాటిరేగ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ కారును పోలీసులు తనిఖీ చేయగా నగదు పట్టుబడింది. ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద ఓ వ్యానులో రూ.1.30 లక్షల నగదు పట్టుబడినట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. గుంటూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రైల్వే జోన్‌పై పీయూష్ గోయల్‌వి అబద్ధాలు : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



విశాఖ రైల్వే జోన్ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చెబుతున్నవన్నీ అబద్ధాలని, ఏమీ తెలియని అమాయకుడిలా ఆయన మాట్లాడుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీయూష్ గోయల్ రైల్వే మంత్రిగా ఉండి కూడా రైల్వే జోన్ ఎందుకు ఇవ్వలేదో తెలపాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. రైల్వే జోన్ కోసం వైసిపి ప్రభుత్వం 52 ఎకరాల భూమి కేటాయించిందని, అడ్డంకులన్నీ తొలగించి రైల్వే జోన్ కోసం భూములు అప్పగించామని చెప్పారు. రాష్ట్రంలో తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి చిన్న అవినీతి కూడా జరగలేదని బొత్స చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు రికార్డు స్థాయిలో వచ్చాయని, పరీక్షల నిర్వహణ సజావుగా సాగిందని తెలిపారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులంతా బాధ్యతగా పనిచేశారన్నారు. రెండు, మూడు రోజుల్లో వైసిపి మేనిఫెస్టో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో విజయం సాధించే పార్టీ ఏదైనా వైసిపిపై ఆధారపడి పని చేసే విధంగా ఉండాలని తానూ కోరుకుంటున్నానని తెలిపారు. అలా వస్తే రాష్ట్రానికి రావాల్సిన మరిన్ని ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర సమస్యలపై ఆలోచించడంలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిజెపి హయాంలోనే ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో అతిపెద్ద అవినీతి జరిగిందని బొత్స తెలిపారు.

సామాజిక న్యాయం ఇండియా బ్లాక్‌తోనే సాధ్యం

- పీయూష్ గోయల్ వ్యాఖ్యలకు సిపిఎం ఖండన
- ఆ వ్యాఖ్యలపై టిడిపి స్పందించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక న్యాయం ఇండియా బ్లాక్‌తోనే సాధ్యమని, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ముస్లిం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని ప్రకటించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక న్యాయం ఇండియా బ్లాక్‌తోనే సాధ్యమని తెలిపారు. ఒకసారి రిజర్వేషన్లు ఏ వర్గానికి ఎత్తేసినా ఆ తర్వాత వరుసలో దళిత, ఆదివాసీ, మహిళ, వికలాంగులకు కూడా రిజర్వేషన్లు లేకుండా చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై ఎన్‌డిఎ భాగస్వామ్యంలో ఉన్న తెలుగుదేశం పార్టీ, జనసేన తమ వైఖరి ఏమిటో బహిరంగంగా ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో ఆ రెండు పార్టీలు కూడా బిజెపి అభిప్రాయంలో ఉన్నట్లుగానే భావించాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్లు కాపాడుకోవడం ఇండియా బ్లాక్ పార్టీలతోనే సాధ్యమని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కొనసాగుతున్న పరిశీలన

- 3,637 అనుమతి, 1524 తిరస్కరణ
- నలుగురు విత్‌డ్రా
- మొత్తం 6,001 నామినేషన్లు
- 12:15 గంటల తరువాత కొనసాగుతున్న పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నామినేషన్ల పరిశీలన కొనసాగుతోంది. 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు 6,001 నామినేషన్లు దాఖలు చేయగా, శుక్రవారం రాత్రి 12:15 గంటల సమయానికి 3,637 నామినేషన్లను అంగీకరించారు. 1524 నామినేషన్లను తిరస్కరించారు. నలుగురు విత్‌డ్రా అయ్యారు. తాడిపత్రి, డోన్, మాచర్ల వంటి నియోజకవర్గాల్లో పరిశీలన సమయంలో స్వల్ప వాగ్వాదాలు పరస్పర అభ్యంతరాలు రావడంతో అక్కడ పరిశీలన కొద్దిసేపు నిలిపేశారు. అనంతరం కొనసాగించారు. తిరస్కరించిన నామినేషన్లలో ఎక్కువగా ఇండిపెండెంట్లు ప్రధాన పార్టీ అభ్యర్థులకు డమ్మీలుగా వేసినవే ఎక్కువగా ఉన్నాయి. విత్‌డ్రా చేసుకున్న నామినేషన్లలో ముగ్గురు అమలాపురం నియోజకవర్గం నుండి ఉండగా, ఒకరు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం నుండి విత్‌డ్రా చేసుకున్నారు.

పార్లమెంటు నియోజకవర్గాల్లో 705 అనుమతి

25 పార్లమెంటు నియోజకవర్గాలకు 1,103 నామినేషన్లు దాఖలవగా, 705 అంగీకరించారు. 280 దరఖాస్తులను తిరస్కరించారు. రాత్రి వరకూ పరిశీలన కొనసాగుతోంది.

ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేసేందుకు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1170వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్‌ఎండి విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, రామన్న మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూడటం మోడీ ప్రభుత్వానికి తగదన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా హైకోర్టులో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోర్టు కేసు వేసి తాను పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న సుమారు గంటసేపు వాదనలు వినిపించిన తర్వాత హైకోర్టు స్టీల్‌ప్లాంట్ భూముల అమ్మకాలకు వ్యతిరేకంగా స్టే విధించిందని తెలిపారు. ఉక్కు రక్షణ కోసం తన వంతు ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఆస్తులపై ఎవరు ఎలాంటి కుట్రలకు పాల్పడినా సహించేది లేదన్నారు.

తక్షణ పోలీసు సేవల కోసం

- " సమర్థ్ "మొబైల్ యాప్
- సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు "సమర్థ్" యాప్ (సెక్యూరిటీ అరేంజ్‌మెంట్ మ్యాపింగ్ అనాలిసిస్ రెస్పాన్స్ ట్రాకింగ్ హబ్) ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం సిఇఓను కలిసి తమ జిల్లాలో ఉపయోగిస్తున్న "సమర్థ్" మొబైల్‌యాప్ పనితీరు గురించి వివరించారు. తమ జిల్లా ఐటికోర్ విభాగం రూపొందించిన ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా ఈనెల 22 నుంచి తమ జిల్లాలో ఉపయోగిస్తూ సత్ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. యాప్ పనితీరును ఆయన వివరించారు. అనంతరం మాట్లాడిన సిఇఓ రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, సెక్టార్ ఆఫీసర్లు కూడా ఈ యాప్‌ను వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

షర్మిల వ్యాఖ్యలు తగవు

- అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో చేర్చాలని తాను పిటిషన్ వేయడం వల్లే ఎఫ్‌ఐఆర్ అయ్యిందని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాట్లాడటం తగదని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ షర్మిల తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా మాట్లాడినందునే తాను ఎఎజిగా కాకుండా సాధారణ అడ్వకేట్‌గా సంజాయిషీ ఇచ్చేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశానని తెలిపారు. ఆమె వాస్తవాలు తెలుసుకోకుండా తనపై అసత్య ఆరోపణలు చేశారని విమర్శించారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్రావు, టిడిపి సీనియర్ నాయకులు ఎర్రం నాయుడు లేఖ రాయడంతో హైకోర్టు ఆదేశాలమేరకు 2011 ఆగస్ట్ 17న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారని ఆయన అన్నారు.

కూటమి చార్జ్‌షీట్ అబద్దాల పుట్ట

- వైసిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక తెలుగుదేశం, బిజెపి, జనసేనల కూటమి అబద్దాలు, అసత్యాలతో చార్జ్‌షీట్‌ను విడుదల చేసిందని మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం మొదటి నుండి హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తోందని అన్నారు.వైసిపి అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో దళితుల భూములు ఎక్కువగా కబ్జాకు గురయ్యాయని, దాడులు కూడా ఎక్కువగా జరిగాయని తెలిపారు.

రాష్ట్రంలో కులం, మతం, రాజకీయాలతో సంబంధంలేకుండా అందరికీ సంక్షేమపథకాలను అందించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మరని ఎపి మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. రాష్ట్రంలో ఇన్నేళ్లు బిసిలను రాజకీయంగా ఓటుబ్యాంక్‌కు పరిమితం చేసిన తెలుగుదేశం పార్టీకి బిసిల గురించి మాట్లాడే అర్హత లేదని వైసిపి గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి అన్నారు.

టిడిపికి యనమల కృష్ణుడు రాజీనామా

నేడు సిఎం సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - కోటనందూరు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో టిడిపికి భారీ షాక్ తగిలింది. టిడిపి సభ్యత్వానికి, రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి పదవికి యనమల కృష్ణుడు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం తునిలో తన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. తన సోదరుడు యనమల రామకృష్ణుడు మోసం చేశారని ఆరోపించారు. తుని నియోజకవర్గంలో రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయామని, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తనకు సీటు ఇస్తే గెలిచేవాడినని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను కాదని తన కుమార్తె దివ్యకు యనమల రామకృష్ణుడు సీటు ఇప్పించారని విమర్శించారు. తనకు ఎమ్మెల్సీ పదవి ఇప్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, తనను కాదని యనమల రామకృష్ణుడు ఎమ్మెల్సీ పదవి, అతని అల్లుడికి నామినేటెడ్ పదవి ఇప్పేలా చంద్రబాబుతో ఒప్పందం చేసుకుని తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తాడేపల్లిలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు పోలనాటి శేషగిరి, లెక్కల భాస్కర్, డెబ్బ శీను ఉన్నారు.

యనమల కృష్ణుడు

ఐపిఒకు స్విగ్గీ..!

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. ఇందుకోసం తాజాగా సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించిందని సమాచారం. ఇందుకోసం కాన్ఫిడెన్షియల్ మార్గాన్ని స్విగ్గీ ఎంచుకోవడం ద్వారా ఆ సంస్థ ఐపిఒకు సంబంధించిన వివరాలేవీ బయటికి రావు. దీనికి సెబీ అనుమతిస్తే 18 నెలల్లో ఎప్పుడైనా ఐపిఒకు రావడానికి వీలుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.10,400 కోట్ల వరకు సమీకరించాలని స్విగ్గీ భావిస్తోందని సమాచారం.

ఉంగుటూరులో సిపిఎం గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గొల్లు కృష్ణ ప్రచారం

పార్వతీపురంలో ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స

సిపిఎం ముమ్మర ప్రచారం

- ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎం అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారంలో భాగంగా గత పాలకుల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. వాడవాడలా తిరుగుతూ ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపిని, ఆ పార్టీకి మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలకు ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని నిడమర్రు, బేతపూడి, కురగల్లులో నియోజకవర్గ అభ్యర్థి శివశంకరరావు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. రాజధాని, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, రైతులు, అనేక సమస్యలపై సిపిఎం చేసిన పోరాటాలను చెప్పి తమను బలపర్చాలని కోరారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. తాడేపల్లి పట్టణంలోని ఇప్పటం ఆస్పత్రి, ఉండవల్లి, ఇప్పటంలో జొన్నా శివశంకరరావు గెలుపు కోరుతూ సిపిఎం నేతలు ప్రచారం నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం మండలం బందలుప్పి, పులుగుమ్మి, జమ్మిడివలస గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చి అడవులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. జిఓ నెంబర్ 3 ద్వారా దక్కాల్సిన ఉద్యోగాలను దక్కకుండా చేసి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఉపాధి లేక గిరిజన యువత వలస పోతున్నారని, గిరిజన గ్రామాల్లో వైద్యం అందని ద్రాక్షగా మారిందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు గిరిజన భూములను అదానికి హైడ్రో ఎలక్ట్రికల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం కట్టబెడుతున్నారని అన్నారు. హక్కులు సాధించుకోవడానికి, గిరిజన ప్రాంతాన్ని రక్షించుకోవడానికి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ పరిధిలోని 36వ వార్డు డ్రైవర్స్ కాలనీ, వావిలి నగర్, గోపి నగర్, రాధానగర్, గురుప్రహ్మ కాలనీల్లో పాణ్యం అభ్యర్థి గౌస్‌దేశాయ్ ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి విస్మరించి కబ్జాలు, దౌర్జన్యాల ద్వారా ఆస్తులను పెంచుకుంటున్న వారిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. 21వ వార్డు పార్థసారథి నగర్, పాణ్యం, గడివేముల మండలాల్లో గౌస్‌దేశాయ్‌ని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశాయి. నెల్లూరు 49, 50వ డివిజన్లలో ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి నిరంకుశ పాలన సాగిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపికి మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను బలపరచాలని కోరారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలోని తరిగొప్పుల, మానికొండ, నందమూరు, వేంపాడు, చాగంటిపాడు, బొకినాల గ్రామాల్లో సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతోన్మాద బిజెపిని గద్దె దించాలని, బిజెపికి మద్దతు తెలుపుతున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదిక నాయకత్వంలో ప్రజా పరిపాలన వస్తుందని ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ 27, 36 డివిజన్లలో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. అల్లూరి సీతారామరాజు బ్రిడ్జి నుంచి ప్రారంభమైన ప్రచారం డిమార్ట్ ఏరియా తదితర ప్రాంతాల్లో సాగింది. విజయవాడ అభివృద్ధి కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

పథకాల డిజైన్లకు ప్రత్యేక నమూనాలు

- ఇఎన్‌సి, సిఇలకు ఆర్థికశాఖ దిశానిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలోని పలు శాఖల ద్వారా నిర్వహిస్తున్న పథకాల డిజైన్లకు ప్రత్యేక నమూనాలను రూపొందించాలని ఆర్థికశాఖ దిశా నిర్దేశం చేసింది. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందిస్తున్నట్లు పేర్కొంది. రెండు రోజుల క్రితం కీలక శాఖల్లోని ఇంజనీరింగ్ విభాగాల ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, చీఫ్ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్షలో పథకాలకు డిజైన్లు తయారు చేసే సమయంలో ఆధునిక విధానాలను అనుసరించాలని స్పష్టం చేసింది.

ఈ విధానాల ద్వారా ప్రాజెక్టు అంచనాలను క్రమబద్ధంగా ఖరారు చేయడంతోపాటు, అందులో మానవ వనరులను తక్కువగా వినియోగించుకునేందుకు కూడా అవకాశం ఉంటుందని ఆర్థికశాఖ అధికారులు వివరించారు. అలాగే కీలక శాఖలైన నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖ, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ప్రజారోగ్యం శాఖల్లో ఇంజనీరింగ్ అంశాల్లో నైపుణ్యం ఉన్న అధికారులను గుర్తించి వారికి సాఫ్ట్‌వేర్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కూడా నిర్ణయించారు. వారి సాయంతోనే సాఫ్ట్‌వేర్‌ను మరింత అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించారు.

క్వాలిటీ కంట్రోల్‌పైనా

చేస్తున్న పనుల్లో క్వాలిటీ కంట్రోల్‌పైనా ఆర్థికశాఖ నుంచి సూచనలు వెళ్లాయి. థర్డ్ పార్టీ తనిఖీలు చేయిస్తూ స్పష్టమైన ధృవీకరణ పత్రాలు అందించేలా చూడాలని నిర్దేశించారు. ప్రధానంగా పది లక్షల రూపాయల్లోపు పనుల నిర్వహణపై దృష్టిసారించాలని పేర్కొంది.

చంద్రబాబు,పవన్‌లపై చర్యలు తీసుకోవాలి

- వైసిపి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మనోహర్ రెడ్డి, పార్టీ గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తిలు రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. చంద్రబాబునాయుడు,పవన్ కల్యాణ్‌లు ఈనెల 24వతేదీన నెల్లిమర్లలోను, ఈనెల 25న రాజంపేట, రైల్వేకోడూరులలో జరిగిన ఎన్నికల ప్రచారాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలపై వ్యక్తిగతంగా అనుచితవ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సిఎంఎ ఫౌండేషన్‌లో 'శ్రీమేధ'కు మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-గుంటూరు

కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ (సిఎంఎ) ఫౌండేషన్ ర్యాంకుల జాబితాలో గుంటూరులోని శ్రీమేధ విద్యార్థి అన్నా సాయివెంకట ధీరజ్ ఆలిండియ ఫస్ట్‌ర్యాంకు సాధించినట్లు ఆ సంస్థ ఛైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. ధీరజ్‌కు సుల్తాన్‌చాంద్ మెమోరియల్ బుక్‌ప్రైజ్‌తో పాటు, ర్యాంక్ సర్టిఫికెట్‌ను మే 23న ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కోల్‌కత్తాలో నిర్వహించే కాన్వకేషన్‌లో అందచేస్తారని తెలిపారు. తమ సంస్థ అందించే ఇంటర్ ఎంఇసి ప్రోగ్రామ్ ద్వారా ఏకకాలంలో సిఎ, సిఎంఎ ఫౌండేషన్ కోచింగ్ పొందిన ధీరజ్ ఇంటర్‌లో 979 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచారని తెలిపారు. డిసెంబర్-2023 సిఎంఎ ఫౌండేషన్ పరీక్షల్లో 340 మార్కులతో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ధీరజ్‌కు అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి మెమోంటో అందజేసి అభినందించారు.

ధీరజ్‌ను అభినందిస్తున్న నందకిషోర్, శ్రీలక్ష్మి

ఇళ్ల వద్దకే పింఛను

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సామాజిక పెన్షన్‌లను మే ఒకటిన ఇళ్ల వద్దనే పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా వున్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్ద పంపిణీ చేయడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. చాలా మంది వృద్ధులు అస్వస్థతకు గురిగాక, కొంతమంది మృతిచెందారని పేర్కొన్నారు. సిబ్బంది కొరత, నగదు లేదనే కారణాలతో ఆలస్యం చేయకుండా, ఒకటో తేదీనే సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయించాలని కోరారు.

ఎర్రకాలువలో మునిగి ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెంటౌన్

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలో విషాదం చోటు చేసుకుంది. వేగవరం సమీపంలో ఎర్ర కాలువలో శుక్రవారం సాయంకాలం స్నానానికి దిగి ఇద్దరు మహిళలు, ఒక బాలుడు నీట మునిగి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. జీలుగుమిల్లి మండలం దిబ్బగూడేనికి చెందిన షేక్ మౌలాలి కూలి పనులు చేస్తూ అప్పుడప్పుడు చేపలు పట్టుకునేందుకు ఎర్రకాల్వకు వెళ్తుండేవారు. చేపల వేట కోసం మౌలాలితో పాటు ఆయన భార్య షేక్ మహిషాద్ (24), ఆమె సోదరుడు ఆషాద్ (14), హైదరాబాద్‌కు చెందిన ఆమె సోదరి రేష్మ (25) వెళ్లారు. చేపలు పట్టేందుకు తెప్పపై మౌలాలి ఎర్రకాల్వలోకి వెళ్లగా ఈ ముగ్గురు స్నానం చేసేందుకు కాల్వలోకి దిగారు. ఈ క్రమంలో గుంతలో చిక్కుకుని ఊపిరాడక మృతి చెందారు. గమనించిన మౌలాలి అక్కడకు చేరుకుని వారిని రక్షించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు.

సంస్కృత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

స్నాతకోత్సవ సభలో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి జిల్లా)

సంస్కృత వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ కోరారు. తిరుపతిలోని సంస్కృత వర్సిటీ మూడోస్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. 580 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఇందులో 67 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. సంస్కృత పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడం, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారా సంస్కృత వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థలను తోసిపుచ్చే వలసవాద ఆలోచనా విధానం వల్ల ప్రధాన స్రవంతి విద్యలో సంస్కృత ఏకీకరణకు ఆటంకం ఏర్పడిందన్నారు. పురాతన రాతప్రతుల సంరక్షణ కోసం డిజిటల్ టెక్నాలజీ విభాగంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ఏ భాష అయినా సమాజం వినియోగించి, సాహిత్యం కూర్చినప్పుడే మనుగడ సాగుతుందన్నారు. పరివర్తనకు సంస్కృతం మార్గమని, అమూల్యమైన వారసత్వానికి విద్యార్థులు రాయబారులుగా మారాలని కోరారు. విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఎన్.గోపాలస్వామి స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ కోర్సుల్లో ఉపాధి పొందిన 580 మంది విద్యార్థులకు వైస్‌ఛాన్సలర్ ఉపస్థాపనం చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ఛాన్సలర్ గోపాలస్వామి, యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కె.సాంబశివమూర్తి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లవద్ద మహిళలకు ప్రత్యేక సదుపాయాలు

- సిఇఒకు మహిళా కమిషన్ ఛైర్మన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లలో మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ గజ్జల వెంకటలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాను కలిసి వినతిపత్రం సమర్పించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లా పోలింగ్ బూత్‌లలో మహిళలకు ముఖ్యంగా బాలింతలు, గర్భిణులు, వృద్ధులకు 2024లో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించేందుకు అనుమతించాలని సిఇఒకు విజ్ఞప్తి చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, చిన్న పిల్లలతో వచ్చే బాలింతలు, గర్భిణులకు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేకంగా ఫీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. అత్యవసర వైద్యసేవలతోపాటు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మహిళలకు విధిగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సిఇఒకు వెంకటలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank (A Government of India Undertaking) సిండికేట్ Syndicate

ఎఆర్‌ఎమ్ శాఖ, గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ కార్యాలయం భవనం, రైల్ నిలయం ప్రక్కన, సికింద్రాబాద్-500026. ఫోన్: 040-27725260, 27725259

సవరణ

డైరెక్టర్లు మరియు హామీదారులు ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న మెసెర్స్.చైతన్య వరుణ్ గిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కి సంబంధించి ఈ వార్తా పత్రికలో 26.04.2024న ప్రచురించబడిన మా అమ్మకం నోటీసుకు సూచన. ఈ నోటీసులో రిఫ్.నం. **7700/2752/158/CHV/2024/DNR/SN Date: 24/02/2024** కి బదులుగా రిఫ్.నం. **7700/2752/158/CHV/2024/DNR/SN Date: 24/04/2024** అని చదవాలి. మిగతావన్నీ మారవు.

ప్రదేశం : హైదరాబాద్ | సం/- అధీకృత అధికారి
తేది : 27.04.2024 | కెనరా బ్యాంక్

TMB Tamilnad Mercantile Bank Ltd Be a step ahead in life
CIN: L65110TN1921PLC001908

తమిళ్‌నాడు మర్కెంటైల్ బ్యాంక్ లిమిటెడ్
గొల్లపూడి బ్రాంచి:
3-2, దాత కళ్యాణ మండం రోడ్, గొల్లపూడి, కృష్ణా జిల్లా-521225.
ఫోన్: 0866-2410003. ఇ-మెయిల్: gollapudi@tmbank.in

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1) చూడండి) (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **తమిళ్‌నాడు మర్కెంటైల్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 16.02.2024 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, రుణగ్రహీత/ తాకట్టుదారు/ హామీదారు: **శ్రీ మంద్రు విజయ్ కుమార్, తండ్రి మంద్రు భాస్కర్ రావు,** ఫ్లాట్ నం.207, గ్రీన్ అవెన్యూ, ఎన్ఆర్ఐ స్కూల్ దగ్గర, అనిల్ క్యాస్టిల్ ఎదురుగా, గొల్లపూడి, కృష్ణా జిల్లా-521225 మరియు మరో చిరునామా: ఫ్లాట్ నం.101, ధరణి టవర్స్, బ్లాక్-ఎ, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా-521241. **2) శ్రీమతి మంద్రు అరుణ, మంద్రు విజయ్ కుమార్,** ఫ్లాట్ నం.207, గ్రీన్ అవెన్యూ, ఎన్ఆర్ఐ స్కూల్ దగ్గర, అనిల్ క్యాస్టిల్ ఎదురుగా, గొల్లపూడి, కృష్ణా జిల్లా-521225 మరియు మరో చిరునామా: ఫ్లాట్ నం.101, ధరణి టవర్స్, బ్లాక్-ఎ, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా-521241. అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి **60 రోజుల్లోగా** నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **13.02.2024** నాటికి గాను **రూ.19,37,146.73 (క్యాష్ క్రెడిట్-9,23,950/- + టర్మ్‌లోన్- రూ.10,13,196.73 పై.లు) (రూపాయలు పందొమ్మిది లక్షల ముప్పై ఏడు వేల నూటా నలభై ఆరు మరియు డెబ్బై మూడు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీత/ హామీదారులు/ తాకట్టుదారులు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత, హామీదారు, తాకట్టుదారు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క రూల్ (8)తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, క్రింది సంతకందారు ఇందు దిగువ వివరించిన ఆస్తిని **25.04.2024న స్వాధీనంచేసుకున్నారు.**

సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత/ హామీదారు/ తాకట్టుదారులు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారులు, తాకట్టుదారులు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **తమిళ్‌నాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్, గొల్లపూడి శాఖకు 31.03.2024** నాటికి గల మొత్తాలు **రూ.18,01,714.73 పై.లు (క్యాష్ క్రెడిట్-7,75,530/- + టర్మ్‌లోన్- రూ.10,26,184.73 పై.లు)** లను దానిపై తగిన వడ్డీ మరియు ఇతర వ్యయాలతోసహా చెల్లించుటకు లోబడి ఉంటుంది.

స్థిరాస్తుల వివరణ

శ్రీ మంద్రు విజయ్ కుమార్, తండ్రి మంద్రు భాస్కర్ రావు పేరున ఉన్న ఇస్కపల్లి గ్రామం, గరువు రోడ్, మందురువారి స్ట్రీట్, రేపల్లె టౌన్, గుంటూరు-522265 వద్ద సర్వే నం.47/1, వార్డు నం.15, బ్లాక్ నం.35, డోర్ నం.9-35-36 వద్దగల 1490.90 చ.అ.లు (గ్రౌండ్ ఫ్లోర్-745.45చ.అ.లు + మొదటి అంతస్తు-745.45చ.అ.లు) విస్తీర్ణంతో ఆర్.సి.సి.భవనముతో 145.20చ.గ.ల విస్తీర్ణంతో ల్యాండ్ మొత్తం. **ఆస్తి పత్రం నం.2582/2017 సైటు విస్తీర్ణం 115.60చ.గ.లుకు సరిహద్దులు: సరిహద్దుల దిశలు: ఉత్తరం:** ఎం. లజానస్ ఆస్తి, **దక్షిణం:** ఎం. విజయ్ కుమార్ ఆస్తి, **తూర్పు:** కె. జోసెఫ్ ల్యాండ్, **పడమర:** మున్సిపల్ రోడ్. **ఆస్తి పత్రం నం.2581/2017 సైటు విస్తీర్ణం 29.60చ.గ.లకు సరిహద్దులు: సరిహద్దుల దిశలు: ఉత్తరం:** ఎం. విజయ్ కుమార్ ఆస్తి, **దక్షిణం:** మున్సిపల్ రోడ్, **తూర్పు:** కె. జోసెఫ్ ల్యాండ్, **పడమర:** మున్సిపల్ రోడ్.

తేది: 25.04.2024, | సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: గొల్లపూడి | తమిళ్‌నాడ్ మర్కెంటైల్ బ్యాంక్ లిమిటెడ్ (గొల్లపూడి బ్రాంచి తరఫున)

ADITYA BIRLA CAPITAL PROTECTING INVESTING FINANCING ADVISING

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం:- ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్-362266
శాఖ చిరునామా:- జి కార్పొరేషన్ టెక్ పార్క్, 8వ అంతస్తు, కసర వాడవలి, గోడ్‌బందర్ రోడ్డు, థానె, ఎమ్‌హెచ్-400601

డిమాండ్ నోటీసు
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, రూల్ 3(1) కింద)
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, ఖ/ం 13(2) నోటీసు యొక్క ప్రత్యామ్నాయం సర్వీస్

మీరు క్రింద పేర్కొన్న రుణగ్రహీత షెడ్యూల్ పేర్కొన్న ఆస్తిని తనఖా పెట్టడం ద్వారా రుణం పొందారు ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎబిహెచ్ఎఫ్ఎల్) నుండి వారు పొందిన క్రెడిట్ సదుపాయాన్ని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయినందున దిగువ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వబడింది. మరియు వారి ఖాతాలను ఆర్‌బిఐ కంపెనీ పుస్తకాలలో మార్గదర్శకాల ప్రకారం నాన్-పర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడింది. ఆ తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం (**SARFAESI** యాక్ట్)లోని సెక్షన్ 13(2) క్రింద ఎబిహెచ్ఎఫ్ఎల్ డిమాండ్ నోటీసును జారీ చేసింది. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చివరిగా తెలిసిన చిరునామాకు తద్వారా పైన పేర్కొన్న మొత్తం మరియు యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చు, ఛార్జీలు మొదలైన వాటిపై కాంట్రాక్టు రేటుతో మరింత వడ్డీతో పాటు మొత్తం బకాయిని తిరిగి చెల్లించమని వారిని కోరడమైనదని డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, (**SARFAESI** యాక్ట్) లోని రూల్ 3 ప్రకారం డిమాండ్ నోటీసు ప్రచురణ ద్వారా కూడా అందించబడుతోంది.

క్ర.సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత మరియు హామీదారులు/సహ హామీదారుల పేరు మరియు చిరునామా మరియు లోన్ ఎకౌంట్ నం.	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం/తేది నాటికి
1	1. నంబూరి మధుసూధనరావు, ఫ్లాట్ నం.411, 3వ అంతస్తు, రిషి వ్యాలీ హోమ్స్, బి-బ్లాక్, డో.నం.4/1బి, డో.నం.25-16-85, జిటి రోడ్డు, నగరంపాలెం, టొబాకో బోర్డు ఎదురు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. 2. లక్ష్మి నంబూరి, ఫ్లాట్ నం.411, 3వ అంతస్తు, రిషి వ్యాలీ హోమ్స్, బి-బ్లాక్, డో.నం.4/1బి, డో.నం.25-16-85, జిటి రోడ్డు, నగరంపాలెం, టొబాకో బోర్డు ఎదురు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. 3 మెసెర్స్. వెంకట సాయి రైస్ అండ్ జనరల్ మర్చంట్, ఫ్లాట్ నం.411, 3వ అంతస్తు, రిషి వ్యాలీ హోమ్స్, బి-బ్లాక్, డో.నం.4/1బి, డో.నం.25-16-85, జిటి రోడ్డు, నగరంపాలెం, టొబాకో బోర్డు ఎదురు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. 4. నంబూరి మధుసూదనరావు, డో.నం.21-13-12, 1వ అంతస్తు, గోపువారి వీధి, చౌట్రా, శాంతి ఆర్చిట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. 5. లక్ష్మీ నంబూరి, డో.నం.21-13-12, 1వ అంతసు, గోపు వారి వీధి, చౌత్ర, శాంతి ఆర్చిట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. 6. లక్ష్మీ నంబూరి, డో.నం.21-13-12, 1వ అంతస్తు, గోపు వారి వీధి, చౌట్ర, శాంతి ఆర్చిట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. 7. నంబూరి మధుసూధనరావు, కేరాఫ్ వెంకట సాయి రైస్ అండ్ జనరల్ మర్చంట్ డో.నం.23/10/4/ఎ, మెయిన్ బజార్, బ్రోకర్స్ బజార్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. 8. మెసెర్స్. వెంకట సాయి రైస్ అండ్ జనరల్ మర్చంట్, డో.నం.23/10/4/ఎ, మెయిన్ బజార్, బ్రోకర్స్ బజార్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. లోన్ ఎకౌంట్ నం.: **LNVIJLAP-09200073282, LNVIJPNO-12180016426,LNVIJPNO-12180016430**	09.04.2024	23.04.2024	రూ.24,00,202.09/- (ఇరవై నాలుగు లక్షల రెండు వందల రెండు రూపాయల తొమ్మిది పైసలు మాత్రమే) 22.04.2024 వరకు బాకీ ఉన్న ప్రిన్సిపల్, బకాయిలు (పెరిగిన ఛార్జీలతో సహా) మరియు వడ్డీ.

స్థిరాస్తి యొక్క వివరణ: ఆంధ్రప్రదేశ్-522004, గుంటూరు, "రిషి వ్యాలీ హోమ్స్" యొక్క ప్రతిపాదిత మూడవ అంతస్తులో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఫ్లాట్ నం.బి-411 తో ప్రతిపాదిత ప్లింత్ ఏరియా 798 చ.అ.లు. (కామన్ ఏరియా కాకుండా) గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గుంటూరు సిటీ, నల్లపాడు రోడ్డు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న టొబాకో బోర్డు ఎదురు కేటాయించబడిన ఆ సైట్ లో ఉన్న బేరింగ్ పట్టా నం.1053, డో.నం.4/1 అర్బన్ ల్యాండ్ సీలింగ్స్ ద్వారా తయారు చేయబడిన సబ్ డివిజన్ ప్రకారం అగ్రహారం గ్రామం యొక్క డో.నం.4/1బి రిషి వ్యాలీ హోమ్స్ సైట్ బయట విస్తీర్ణం 3324.4/9 చ.గ.లు., మరియు హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై.

వడ్డీ మరియు ఖర్చు, ఛార్జీలు, ఖర్చులతో పాటు సదరు మొత్తాన్ని ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో చెల్లించవలసిందిగా ఇక్కడ పేర్కొన్న రుణగ్రహీతలను మేము ఇందు మూలంగా పిలుస్తున్నాము. విఫలమైనయెడల రుణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో సహా అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా ఈ చట్టం యొక్క నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకునే స్వేచ్ఛ మాకు ఉంటుంది. దయచేసి **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, కంపెనీ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌లను అమ్మకం, లీజు చేయకుండా మీరందరూ నిషేధించబడ్డారు. మీ ద్వారా ఏదైనా ఉల్లంఘన జరిగితే **SARFAESI** చట్టంలోని పేర్కొన్న సెక్షన్ యొక్క సెక్షన్ 29 మరియు/లేదా దీనికి సంబంధించి ఏదైనా ఇతర చట్టపరమైన నిబంధనల కింద నిర్దేశించిన శిక్షా నిబంధనలను అమలు చేయాల్సి వస్తుంది. దయచేసి సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) ప్రకారం, ఎబిహెచ్ఎఫ్ఎల్ యొక్క బకాయిలు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఎబిహెచ్ఎఫ్ఎల్ ద్వారా అమ్మకానికి లేదా బదిలీకి నిర్ణయించిన తేదికి ముందు ఎప్పుడైనా ఎబిహెచ్ఎఫ్ఎల్ కి టెండర్ చేయబడితే, సెక్యూర్డ్ అసెట్ ఎబిహెచ్ఎఫ్ఎల్ ద్వారా విక్రయించబడదు మరియు ఎబిహెచ్ఎఫ్ఎల్ ద్వారా సెక్యూర్డ్ అసెట్‌ని బదిలీ చేయడం లేదా విక్రయించడం వంటి తదుపరి చర్యలు తీసుకోబడదు.

తేది: 27.04.2024 | సం/- అధీకృత అధికారి
ప్రదేశం: గుంటూరు | (ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

IKF FINANCE

ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: 40-1-144, కార్పొరేట్ సెంటర్, ఎం.జి. రోడ్డు, విజయవాడ-520010.
ఫోన్ నెం. 0866-2474644.

స్వాధీనతా నోటీసు
(స్థిరాస్తి కోసం) రూల్ 8(1)

ఏదైతే, దిగువసంతకందారు అయిన మెసెర్స్ ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఐకెఎఫ్) యొక్క అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(12) క్రింద అధికారాలను వినియోగించుకుంటూ తేది 14.02.2024న **డిమాండ్ నోటీసును** జారీ చేయడమైనది. **లోన్ ఎకౌంట్ నం.లు.129017** క్రింద పిలువబడిన **రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు 1. మెసెర్స్.కీర్తి ఫైనాన్స్, దీని ప్రొప్రైటర్. వై.విజయ చంద్రబాబు ద్వారా ప్రాతినిధ్యం, 2. వై.విజయ చంద్రబాబు, 3. శ్రీమతి.ఎల్లూరి సావిత్రి, 4. శ్రీమతి.గుర్రం ఉమా మహేశ్వరి దేవి,** పేర్కొన్న **నోటీసులో తిరిగి చెల్లించడానికి ఉన్న మొత్తం రూ.1,70,12,513/- (ఒక కోటీ డెభై లక్షల పన్నెండు వేల ఐదు వందల పదమూడు రూపాయలు మాత్రమే)** పేర్కొన్న నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోపు చెల్లించమని కోరడమైనది.

రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమేమనగా దిగువసంతకందారుడు సెక్యూర్డ్ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8 తో చదువుతూ సెక్షన్ 13 (4) ప్రకారం అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ **25 ఏప్రిల్, 2024న** క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.

రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమేమనగా దిగువ ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపరాదని అలా జరిగినచో మీరు ఛార్జీ చేయబడతారని **ఐకెఎఫ్‌కు రూ.1,70,12,513/- (ఒక కోటీ డెభై లక్షల పన్నెండు వేల ఐదు వందల పదమూడు రూపాయలు మాత్రమే) లోన్ ఎకౌంట్ నం.లు. ఎల్ఎన్-129017** కు వ్యతిరేకంగా **14.02.2024** నాటికి బకాయి తో తదుపరి వడ్డీ మరియు దానిపై ఛార్జీలు చెల్లించి జరుపవలెను.

రుణగ్రహీత సెక్యూర్డ్ అసెట్స్‌ని రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై దృష్టి ఆహ్వానిస్తున్నారు, రుణగ్రహీత "ఐకెఎఫ్" బకాయిలను అన్నీ ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి నిర్ణయించిన తేదికి ముందు ఎప్పుడైనా క్లియర్ చేస్తే, అమ్మకం లేదా బదిలీ కొరకు **"ఐకెఎఫ్"** ద్వారా సెక్యూర్డ్ అసెట్స్ విక్రయించబడవు లేదా బదిలీ చేయబడవు మరియు సెక్యూర్డ్ అసెట్స్ బదిలీ లేదా అమ్మకం కొరకు "ఐకెఎఫ్" ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోదు.

అమలు చేయబడిన సెక్యూర్డ్ అసెట్ చిరునామా/ఆస్తి వివరాలు :

కృష్ణాజిల్లా, నందిగామ సబ్ రిజిస్ట్రీ పరిధి, చందర్లపాడు మండలం, గుడిమెట్ల గ్రామం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.179/2 లో ఆస్తి విస్తీర్ణం ఎసి.05.43 సెంట్లు. బయట ఎసి.23.86 సెంట్లు. **ఉన్న హద్దులు : తూర్పు :** డొంక, **దక్షిణం :** సీలం వెంకటేశ్వర్లు ఆస్తి, **పడమర :** ఏలూరి సావిత్రి ఆస్తి, **ఉత్తరం :** డొంక.

తేది: 25.04.2024, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అదికారి, ఐకెఎఫ్, విజయవాడ

Bank of India Relationship beyond banking

బ్యాంక్ ఆఫ్ ఇండియా
అరండల్‌పేట బ్రాంచి, డి.నెం.4-12-40, పి.యస్.కాంప్లెక్స్, కొరిటిపాడు మెయిన్ రోడ్డు, గుంటూరు-522007. ఫోన్: 0863-2271005

అనుబంధం-IV [రూల్-8(1) చూడండి]
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3 క్రింద సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ **బ్యాంక్ ఆఫ్ ఇండియా** అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు సదరు నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోగా దిగువ పేర్కొన్న బకాయి

వ.నెం.	సదుపాయం యొక్క స్వభావము	మంజూరైన పరిమితి	బకాయిసొమ్ము
1	Star Home Loan 567975110000109	రూ.32.00 లక్షలు	రూ.39,53,286.16 + 28.01.2024 తేదీ నుండి జమకూడు వడ్డీ

తిరిగి చెల్లించవలసిందిగా **ఋణగ్రహీత: శ్రీ బందనబోయిన సురేష్, తండ్రి: సాంబయ్య** వారిని కోరుతూ **ది.31.01.2024 తేదీ గల డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **24 ఏప్రియల్ 2024న స్వాధీనం చేసుకున్నారని** ఋణగ్రహీతకు / హామీదారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని, ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా స్టార్ హోమ్ లోన్ క్రింద **రూ.39,53,286.16 + 28.01.2024 తేదీ నుండి జమకూడు వడ్డీ** కోసం **బ్యాంక్ ఆఫ్ ఇండియా, అరండల్‌పేట బ్రాంచి** హక్కుకు లోబడి ఆ విధంగా చేయవచ్చునని ముఖ్యంగా ఋణగ్రహీతను & హామీదారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది. సదరు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతకు విన్నవించటమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు

(ఎ) గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, టౌన్ సర్వే కానటువంటి, ఎటి అగ్రహారం ఎక్స్‌టెన్షన్, నల్లపాడు గ్రామము, మల్లారెడ్డి నగర్, రెడ్డికాలేజీ రోడ్డు, సమీప డోర్ నెం.26-42-43/2, డి.నెం.119 నందు య॥ 0.49 సెంట్లలో 355 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.17 మరియు 7.83 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.16 వెరశి మొత్తము 362.83 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలములో "సాయి శ్రేష్ఠ ప్యారడైజ్" పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్ **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** 30 అ॥ వెడల్పుగల ఉమ్మడి బజారు-46.00 అ॥; **దక్షిణం:** పోలూరి శాంతికి చెందిన స్థలము-70.06 అ॥; **పడమర:** పోలూరి శాంతికి చెందిన స్థలము నుండి కొంతమేరకు మరియు ప్లాట్ నెం.14, 15 స్థలము కొంతమేరకు-46.00 అ॥; **ఉత్తరం:** ప్లాట్ నెం.18 కి చెందిన స్థలము-71.00 అ॥. ఈ పై హద్దుల మధ్యలోని 362.83 చ॥గ॥ లేదా 303.36 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందలి అన్ని సులభతర హక్కులు మరియు అన్ని అనుబంధములతో సహా
(బి) పై షెడ్యూలులోని 362.83 చ॥గ॥ లేదా 303.36 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 36.28 చ॥గ॥ల స్థలము మరియు మొత్తం స్థలములో నిర్మించిన "సాయి శ్రేష్ఠ ప్యారడైజ్" నాలుగవ అంతస్తులో 1097 చ॥అ॥ (ఉమ్మడి మార్గములు, వాటర్, లిఫ్ట్ మరియు ఒక కార్ పార్కింగ్ కలుపుకొని) ప్లింత్ ఏరియాలోని ఫ్లాట్ నెం.401కు సంబంధించిన యావదాస్తి **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** ఉమ్మడి వరండా, లిఫ్ట్ మరియు ఉమ్మడి మెట్లు; **దక్షిణం:** శూన్యాకాశము; **పడమర:** శూన్యాకాశము; **ఉత్తరం:** శూన్యాకాశము. ఈ పై హద్దుల మధ్యలోని ఒక ఫ్లాట్ మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో సాధారణ సౌకర్యాలు మరియు మార్గాలపై హక్కులతో సహా.

తేది : 24-04-2024 | సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : గుంటూరు | బ్యాంక్ ఆఫ్ ఇండియా

सत्यमेव जयते

రికవరి అధికారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
ఆర్థిక సేవల విభాగం, భారత ప్రభుత్వం
31-31-21, నారాయణ భవనము, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530 020.

ఇ-వేలం ద్వారా అమ్మకపు ప్రకటన
(ఆదాయపుపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూల్ రూల్ 52(2) ప్రకారం)

RP/112/2022 లో OA/23/2022

1. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఇ-ఆంధ్రాబ్యాంక్), గుడివాడ బ్రాంచి, కృష్ణాజిల్లా** మరియు **శ్రీమతి చిలుకూరి భాగ్యలక్ష్మి** & ఇతరులు మధ్యనున్న O.A.**23/2020**నకు సంబంధించి బ్యాంక్‌లు మరియు ఫైనాన్షియల్ సంస్థల ఋణ బకాయిల వసూలు చట్టం 1993 యొక్క 19(22) విభాగం పరిధిలో మహారాజశ్రీ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ వారిచే రికవరీ సర్టిఫికేట్ **తేది.29.11.2022** జారీచేయబడినది మరియు దానిని అమలుపరచు నిమిత్తం పంపటమైనది.
2. రికవరీ సర్టిఫికేట్‌లో సూచించిన **రూ.57,78,723/- (అక్షరాలా యాభై ఏడు లక్షల డెబ్భై ఎనిమిది వేల ఏడు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే)** తోపాటు వడ్డీ, ఖర్చులు వగైరాలు ఈ క్రింది ఋణగ్రహీతలు (బకాయిదారులు)నుండి వసూలు చేయుటకు **ఆర్.పి.నెం.112/2022** నందలి తీర్మానములు అమలుపరచుటకు దిగువ సంతకందారు చర్యలు చేపట్టినారు.
(CD)శ్రీమతి చిలుకూరి భాగ్యలక్ష్మి, భర్త: శ్రీ చిలుకూరి యుగంధర్, డి.నెం.8-326-15, శాంతి నగర్, గుడివాడ, కృష్ణాజిల్లా.
3. **రూ.62,91,000/-** (ది.**31.08.2023** వరకు లెక్కించిన వడ్డీ) + భవిష్యత్తువడ్డీ మరియు ఖర్చులు ప్రచురణ మరియు వేలం అమ్మకం చార్జీలు వసూలుకు వేలం అమ్మకం తేదీ వరకు భరించాల్సి ఉంటుంది.
4. సర్టిఫికెట్ డెటార్స్ షెడ్యూల్డ్ ఆస్తులు క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరిచిన వెబ్‌సైట్ http://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించటమైనది. వేలం తేదీ, బిడ్ ఫార్మ్ దాఖలు చేయు ఆఖరు తేదీ, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంచు మొత్తం వేలం సమయం ప్రతి ఐటమ్/షెడ్యూలు దిగువ సూచించటమైనది.

వేలం తేది.30.05.2024
బిడ్లు దాఖలుకు ఆఖరు తేది.28.05.2024 (సా॥4.00 గం॥వరకు)

షెడ్యూల్& ఐటమ్ నెం.	ఆస్థి వివరములు	రిజర్వు ధర	ఇఎమ్‌డి	బిడ్డు పెంపుదల	వేలం సమయం
షెడ్యూల్ బి యొక్క ఐటమ్ నెం.1 & 2	ఎ. 6.30 సెంట్ల భూమి	రూ. 94,50,000/-	రూ. 9,45,000/-	రూ. 50,000/-	ఉదయం 11 గం॥లనుండి 12 గం॥ల వరకు

వేలం యొక్క సమయం : వేలం సమయం ఆటో ఎక్స్‌టెన్షన్ క్లాజు నందు 5 నిముషాలు పొడిగింపుతో సూచించబడినది అనగా వేలం ముగిసే లోగా బిడ్‌వేసినట్లయితే ఇ-వేలం ముగింపు సమయం 5 నిమిషాలు పొడిగించబడును.
5. సర్వీసు ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ http://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. సర్వీసు ప్రొవైడర్ వివరములు : **M/s C1 India Pvt. Ltd.** సంప్రదించవలసిన వ్యక్తి పేరు : **శ్రీ ధరణి కృష్ణ, ఫోన్ నెం. : 9948182222,** ఈ-మెయిల్ ఐడి : andhra@c1india.com
6. ఆసక్తి గల బిడ్డర్లు/పాల్గొనువారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ http://www.bankeauctions.com ద్వారా పరిశీలించవలసినది గాను మరియు బిడ్ ఫారములు దాఖలుచేయుటకు, ఇ-వేలం నందు పాల్గనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది.
7. ఆసక్తి గల బిడ్డర్లు/పాల్గనువారు ఇ.ఎమ్.డి సొమ్మును ఆర్.టి.జి.యస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఇ-ఎబి), గుడివాడ బ్రాంచి, **UMFB, IFSC CODE : UBIN0801461,** ఇ వేలం అకౌంట్ నెం.**014611980050000** కి క్రెడిట్ చేయవలెను మరియు బిడ్ ఫారంలను పైన తెలిపిన టేబుల్ నందు గల ఆఖరుతేదీ లోపల ఆన్‌లైన్‌లో సమర్పించవలెను మరియు పూర్తిచేసిన బిడ్ ఫారమ్స్‌ను పాన్‌కార్డు కాపీ, ఐడి ప్రూఫ్ మరియు ఇ.ఎమ్.డి డిపాజిట్ ప్రూఫ్ మొదలగునవి దిగువ సంతకం దారునకు రిజిస్టర్డ్ పోస్ట్/స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా తేది.**29.05.2024 సా॥4.00 గం॥**లలోపు అందేటట్లు పంపవలెను. పోస్టల్ ఆలస్యమునకు భాద్యత వహించబడదు.
8. వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు వేలం నియమ నిబందనలు, విచారణలు, షెడ్యూలు ఆస్థి తనిఖీ, దస్తావేజులు మరియు ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికేట్స్ పరిశీలించి, షెడ్యూల్ ఆస్థి వివరాలు తెలుసుకొనుటకు శ్రీ సాయని సాంబశివ రావు, చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇ-ఎబి), గుడివాడ బ్రాంచి, మొబైల్ నెం.9491036619) మరియు ఈ-మెయిల్ ఐడి: ubin0801461@unionbankof india.bank & law.machilipatnam@unionbankof india.bank వారిని సంప్రదించవలెను. **బ్యాంకు శాఖ అధికారి ఆస్థి మరియు సంబంధిత టైటిల్ డీడ్ పత్రాలను విజయవంతమైన బిడ్డర్‌కు అందజేస్తారు.**

ఆస్థి వివరములు
షెడ్యూల్-బి

ఐటమ్ నెం.1 : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ యొక్క రిజిస్టర్డ్ టైటిల్ డీడ్ నెం. 4595/1994, తేది.02.12.1994.
కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ పరిధి, కుందరవల్లి గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం.10లో ఉన్న మొత్తము ఎ.7.60 సెంట్లలోని ఎ.1.00 సెంట్లు స్థలమునకు హద్దులు : **తూర్పు :** జి.సత్యనారాయణ గారు మరియు ఇతరుల ఆస్థి, **దక్షిణం:** జి.సత్యనారాయణ గారి ఆస్థి, **పడమర:** రామాపురం డొంక **ఉత్తరం:** చలసాని సుబ్బారావు గారు మరియు ఇతరుల ఆస్థి.
ఐటమ్ నెం.2 : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ యొక్క రిజిస్టర్డ్ టైటిల్ డీడ్ నెం. 435/1995, తేది.09.02.1995.
కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ పరిధి, కుందరవల్లి గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం.10లో ఉన్న మొత్తము ఎ.7.60 సెంట్లలోని ఎ.5.30 సెంట్లు స్థలమునకు హద్దులు : **తూర్పు :** పంట కెనాల్, **దక్షిణం:** డ్రైనేజి బోదె, **పడమర:** డ్రైనేజి బోదె, **ఉత్తరం:** పి బి సరోజిని గారి ఆస్థి.
(నా స్వహస్తంతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద 16 ఏప్రిల్, 2024న జారీచేయబడినది).

(బి.యన్.యస్.వి.యస్.కె.బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్-2
డెట్స్ రికవరీ ట్రిబ్యూనల్, విశాఖపట్నం

శుక్రవారం నాటి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేస్తున్న కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్

త్రిపురలో 170 కి.మీ దూరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్న బ్రూ అనే గిరిజన తెగకు చెందిన మహిళలు

అస్సాంలోని మోరీగావ్ జిల్లాలో ఓటు వేసిన తర్వాత మొదటిసారి ఓటర్లు

ఎన్నికల కమిషనర్‌గా తొలి మహిళ రమాదేవి

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటివరకూ 25 మంది చీఫ్ ఎలక్షన్ కమిషనర్లుగా పనిచేశారు. వీరిలో ఒక్కరే మహిళ కావడం విశేషం. ఆమె పేరు వి.ఎస్.రమాదేవి. ఆమె తెలుగు మహిళ కావడం విశేషం. అయితే రమాదేవి ఎలక్షన్ కమిషనర్‌గా కేవలం 16 రోజులే పనిచేశారు. 1990 నవంబర్ 26వ తేదీన సిఇసిగా బాధ్యతలు చేపట్టారు. 16 రోజుల అనంతరం పదవీవిరమణ చేశారు. అనంంతరం హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక గవర్నర్‌గా చేశారు. కర్ణాటకకు తొలి మహిళా గవర్నర్‌గా కూడా రమాదేవి రికార్డు నెలకొల్పారు. సిఇసి కాకమునుపు కేంద్ర న్యాయశాఖ స్పెషల్ సెక్రటరీగా, లా కమిషన్ మెంబర్ సెక్రటరీగా, రాజ్యసభ సెక్రటరీ జనరల్‌గా పలు హోదాల్లో పనిచేశారు.

గుల్బర్గాలో నువ్వా..నేనా..!

- కాంగ్రెస్ అభ్యర్థిగా ఖర్గే మేనల్లుడు రాధాకృష్ణ
- బిజెపి నుంచి సిట్టింగ్ ఎంపి జాదవ్

కర్ణాటకలోని గుల్బర్గా ఎంపి నియోజకవర్గంలో కాంగ్రెస్, బిజెపిల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు కొనసాగుతోంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గె ఈసారి పోటీలో లేరనే విషయం తెలిసిందే. ఖర్గె స్థానే ఆయన మేనల్లుడు రాధాకృష్ణ దొడ్డమానిని కాంగ్రెస్ బరిలోకి దింపింది. 2019 తప్ప ఓటమి లేని ఖర్గేకి ఈసారి గుల్బర్గా గెలుపు ఎంతో ప్రతిష్టాత్మకం కానుంది. 10 సార్లు అసెంబ్లీ, రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికైన ఖర్గే, రాధాకృష్ణ గెలుపుపై దృష్టి సారించారు. ఇప్పటికే పలుమార్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఖర్గే చిన్న తమ్ముడు దొడ్డమాని రాధాభాయ్, ఖర్గే కుమారుడు ప్రియంక్‌తో పాటు శరణప్రకాష్ పాటిల్ జోరుగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ఐదు గ్యారంటీలు, కల్యాణ కర్ణాటక ఆర్టికల్ 371జె అంశం, బిజెపి వైఫల్యాలను ప్రచారాస్త్రాలుగా చేసుకొని వాటిని ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. దొడ్డమాని సౌమ్యతకు అక్కడి ప్రజలు సానుకూలత చూపుతుండటంతో హస్తం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. మరోవైపు బిజెపి కూడా గుల్బర్గాలో గెలుపును ప్రతిష్టా త్మకంగా తీసు కుంది. సిట్టింగ్ ఎంపి ఉమేష్ జాదవ్‌కు సీటు కేటాయించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే అయిన జాదవ్ 2019లో కాషాయ జెండా కప్పు కున్నారు. కేంద్రంపై వ్యతిరేకత, రాష్ట్రానికి ప్రాజెక్టులను తేలేకపోవడం వంటి ప్రతికూలతలను జాదవ్ ఎదుర్కొంటున్నారు. ఎన్నికల తరుణంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు బిజెపి టెక్స్‌టైల్ పార్క్, బెంగళూరు టు కల్బుర్గి వరకు రెండు రైళ్లు వంటివి కేటాయించింది. ఈ ఎన్నికల్లో జాదవ్‌కు రాధాకృష్ణ గట్టి పోటీ ఇవ్వనున్నారు. గుల్బర్గా నియోజవర్గ పరిధిలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వాటిలో ఆరు కాంగ్రెస్ గెలవగా, మిగిలిన రెండు చోట్ల బిజెపి, జెడిఎస్ గెలిచాయి. ఇక్కడ మే 7న ఎన్నికలు జరుగుతాయి.



రాధాకృష్ణ దొడ్డమానిని



ఉమేష్ జాదవ్

సిపిఎం, వామపక్ష అభ్యర్థుల గెలుపు
దేశానికి అవసరం

- రాజ్యాంగం, లౌకిక, ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థలకు భరోసా
- బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు
- ఎక్కడ ప్రజా సమస్య ఉంటే అక్కడ ఎర్రజెండా

ప్రజాశక్తి- న్యూఢిల్లీ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల్లో సిపిఎం, వామపక్షాల గెలుపు దేశానికి అవసరం. లౌకిక, ప్రజాస్వామ్య వాదులకు అవసరం. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళ, పేద వర్గాలకు అవసరం. బుద్ధి జీవులకు అవసరం. దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలకు అవసరం. సిపిఎం, వామపక్షాలు నిరంతరం ప్రజా, దేశ ప్రయోజనాల కోసమే పోరాడుతున్నాయి. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య వ్యవస్థ పరిరక్షణకు ఉద్యమిస్తున్నాయి. ప్రజలు ఆపదలో ఉన్నారంటే, అన్యాయానికి గురవుతున్నారంటే అక్కడ కనిపించేది ఎర్ర జెండా మాత్రమే. మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీ లేని పోరాటం చేస్తున్నాయి.

పాలస్తీనా అయినా.. కాశ్మీర్ అయినా..

అమెరికా, నాటో దళాల ప్రోద్బలంతో ఇజ్రాయల్ పాలస్తీనాపై దాడులు చేస్తున్న సమయంలో బాధిత పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ర్యాలీలు, మన దేశంలో మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించేందుకు మోడీ సర్కారు తెచ్చిన సిఎఎకి నిరసనగా పోరాటం, ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో సవాల్, గెలుపు... సిపిఎం, వామపక్షాలే ఈ అంశాలను చేపట్టాయి. సిపిఎం, వామపక్షాలు పార్లమెంట్‌లో బలమైన ప్రతిపక్షంగా ఉంటేనే, నిర్ణయాత్మక పాత్ర పోషిస్తేనే, రాజకీయాలపై కార్పొరేట్ల పట్టుకు అడ్డుకట్ట పడుతుంది. ఆర్టికల్ 370ని మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేయడంతో మత కలహాలు చెలరేగిన జమ్మూ కాశ్మీర్, మణిపూర్‌లలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పర్యటించాకనే అక్కడి వాస్తవ పరిస్థితులు లోకానికి విదితమయ్యాయి. మణిపూర్‌లోని సహాయ శిబిరాలను సందర్శించి, బిజెపి 'డబుల్ ఇంజన్ ప్రభుత్వం' విఫలమైందని దేశ ప్రజలకు సిపిఎం బృందం పర్యటించి తెలియజేసింది. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, మతోన్మాద కుట్రలను పార్లమెంటులో వ్యతిరేకించే తమ వైఖరిలో వామపక్షాలు రాజీపడలేదు. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రజాస్వామ్య విధ్వంసాన్ని ఎండగడుతూ ప్రజా సమస్యలపై ఎలుగెత్తడంలో వామపక్ష ఎంపిలు ముందున్నారు. 2019లో మోడీ ప్రభుత్వం యుఎపిఎకు తీసుకొచ్చిన సవరణలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను వామపక్ష ఎంపిలు చట్ట సభల్లో లేవనెత్తారు.

ప్రజా ఉద్యమాలు..పార్లమెంట్‌లో నిలదీతలు... న్యాయపోరాటాలు...

ప్రజా ఆందోళనలు, పార్లమెంటులో జోక్యాలే కాకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు వామపక్షాలు బలమైన న్యాయపోరాటాలు చేశాయి. ఆదివాసీల హక్కులు, దళిత, మైనార్టీలపై దాడులపై సిపిఎం, వామపక్షాలు పోరాడుతున్నాయి. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు రద్దు చేయాలనే ఆందోళనలో రైతులతో కలిసి సిపిఎం అగ్రభాగాన ఉంది. పార్లమెంట్‌లో వామపక్ష ఎంపిలు రైతుల గొంతుకయ్యారు. చారిత్రాత్మక ఉద్యమంతో మోడీ సర్కారు వ్యవసాయ చట్టాల రద్దుకు దిగి రావాల్సి వచ్చింది. ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును సిపిఎం రెండుసార్లు ఆశ్రయించింది. కేసు విచారణ సందర్భంగా.. 'దీని ద్వారా మీకు నిధులు రావడం లేదా' అని కోర్టు ప్రశ్నించగా.. 'దీని ద్వారా మాకు ఒక్క రూపాయి కూడా అక్కర్లేదు' అని సిపిఎం గట్టిగా సమాధానం ఇచ్చింది.ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పు సిపిఎంకు గుర్తింపు తెచ్చింది. బిజెపి నేతల విద్వేషపూరిత ప్రసంగాలపై సిపిఎం నేత ..బందా కరత్ దాఖలు చేసిన పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. పౌరసత్వ సవరణ చట్టాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన తొలి రాష్ట్రం ఎల్‌డిఎఫ్ పాలిత కేరళ. రాష్ట్రాల హక్కులు, అసెంబ్లీ చేసిన బిల్లులను గవర్నర్ నిలుపుదల చేయడంపైనా కేరళ ప్రభుత్వర సుప్రీంలో సవాల్ చేసింది. ఉత్తర భారతదేశంలో గో హత్యలు జరిగిన ప్రాంతాల్లో ఈశాన్య ఢిల్లీలో అల్లర్లకు గురైన ప్రాంతాలలో, క్రైస్తవులపై హింస జరిగిన ఛత్తీస్‌గఢ్‌లో ఆ గాయాలను మాన్పడానికి సిపిఎం, వామపక్షాలు తీవ్రంగా కృషి చేశాయి.

బుల్డోజ్‌రాజ్‌పై ప్రతిఘటన

2023 ఏప్రిల్ 16 ఉదయం 9.30. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ ఢిల్లీ గోల్‌మార్కెట్‌లోని ఎకెజి భవన్‌కు చేరుకుని న్యాయవాదులతో మాట్లాడిన అనంతరం తొలుత జహంగీర్‌పురి వెళ్లారు. అక్రమ భవనాల తొలగింపు పేరిట ముస్లిం దుకాణాలను కూల్చివేస్తున్నారని సమాచారం తెలిసింది. సుప్రీం కోర్టు స్టే విధించినప్పటికీ ఢిల్లీ మున్సిపల్ కమిషనర్, ఢిల్లీ నార్త్ పోలీస్ కమిషనర్ సారథ్యంలో కూల్చివేతలు కొనసాగడం అక్కడ కనిపించింది. బృందా కరత్ బుల్డోజర్ల ముందు నిలబడి చేతులు పైకెత్తి బిగ్గరగా అరిచారు. రోకో..! సుప్రీమ్ కోర్ట్ కా ఆర్డర్ హై...' (ఆపండి... సుప్రీం కోర్టు నుంచి ఆర్డర్ ఉంది) అంటూ బుల్డోజర్‌ను అడ్డగిస్తూ అడ్డం నించున్నారు. ఆ చిత్రం చిత్రం నాడు సోషల్ మీడియాలో, ప్రధాన మీడియాలో వైరల్ అయింది. పార్లమెంటు లోపలా, వెలుపలా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పడంలో సిపిఎం, వామపక్షాలు ఎప్పుడూ ముందుంటాయని ఈ సన్నివేశం స్పష్టం చేసింది.

ఐదోదశ ఎన్నికల నోటిఫికేషన్ జారీ..

సార్వత్రిక ఎన్నికల్లో ఐదోవిడత ఎన్నికల నోటిఫికేషన్‌ను శుక్రవారం కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసింది. ఈ దశలో ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలోని 49 లోక్‌సభ స్థానాలకు మే 20న పోలింగ్ జరుగుతుంది. నోటిఫికేషన్ విడుదలైన ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసుకునేందుకు ఇసి గడువు నిచ్చింది. మే 4న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి తేదీ మే 6. బీహార్‌లో ఐదు స్థానాలు, జార్ఖండ్‌లో మూడు స్థానాలు, మహారాష్ట్రలో 13 స్థానాలు, ఒడిశాలో ఐదు, ఉత్తరప్రదేశ్‌లో 14, పశ్చిమబెంగాల్‌లో ఏడు, జమ్మూకాశ్మీర్‌లో ఒకటి, లడఖ్‌లో ఒక స్థానానికి ఓటింగ్ నిర్వహించనున్నారు.

బెంగాల్‌లో పలు నియోజకవర్గాల్లో ముక్కోణపు పోటీ

జె.జగదీష్

బెంగాల్‌లోని పలు నియోజకవర్గాల్లో బలమైన ముక్కోణపు పోటీ నెలకొంది. ముర్షిదాబాద్‌లో జరిగిన ప్రచారంలో వామపక్ష కూటమి అభ్యర్థి ముహమ్మద్ సలీం స్పష్టమైన ఆధిక్యత సాధించడమే కాకుండా.. బహరంపూర్, డమ్‌డమ్, జాదవ్‌పూర్, శ్రీరాంపూర్, దక్షిణ కలకత్తా, బషీర్‌హట్, కృష్ణానగర్ నియోజకవర్గాలలో వామపక్ష, కాంగ్రెస్ అభ్యర్థుల జోరు టిఎంసి, బిజెపి అభ్యర్థులను వణికిస్తున్నాయి. వారు గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు.

నేతల అరెస్టులతో ఇబ్బందుల్లో టిఎంసి

బషీర్‌హట్ లోక్‌సభ నియోజకవర్గంలో సందేశ్‌ఖాలీ వరుస సంఘటనలు జరిగిన ప్రాంతాన్ని కలిగి ఉంది. ఇక్కడ టిఎంసి విస్తృతంగా భూసేకరణకు, లైంగిక హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. టిఎంసి నేతల అరెస్ట్‌తో వారి పరిస్థితి ఇక్కడ నానాటికీ దిగజారుతోంది. సందేశ్‌ఖాలీలో జరిగిన ఘోర నేరాలను బయటకు తీసుకొచ్చి బాధితుల కోసం పోరాడిన మాజీ ఎమ్మెల్యే నిరపడ సర్కార్ ఈ ఎన్నికల్లో లెఫ్ట్ అభ్యర్థి. వ్యవసాయ కార్మికుల నాయకుడిగా ఉంటూ నియోజకవర్గంలో ఆదరణ పొందారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు జరిపినందుకు తెలిపినందుకు మమత ప్రభుత్వం ఆయనను జైలులో పెట్టింది. బిజెపి అభ్యర్థిగా రేఖ పాత్ర పోటీ చేస్తుండగా, మాజీ ఎంపి హాజీ నూరుల్ ఇస్లాంను టిఎంసి రంగంలోకి దింపింది.



హోరా హోరీ

దక్షిణ కలకత్తాలో సిపిఎం అభ్యర్థి, సినీనటి సైరా హలీమ్ షా సామాజిక కార్యకర్త. ప్రముఖ నటుడు నస్రుద్దీన్ షా మేనకోడలు. మమతా బెనర్జీ నివాసం ఉండే కాళీఘాట్ ప్రాంతంలో సైరా ప్రచారాన్ని టిఎంసి అడ్డుకుంది. గతేడాది జరిగిన బల్లిగంజ్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో సైరా పెద్ద సంఖ్యలో ఓట్లు తెచ్చుకొని టిఎంసికి, బిజెపికి షాకిచ్చారు. బిజెపి దయనీయంగా మూడో స్థానంలో నిలిచింది. బెంగాల్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు ఫౌద్ హలీమ్ భార్య నియోజకవర్గంలోని ప్రతి గడపలో ప్రచారం చేస్తున్నారు. కలకత్తా మేయర్ మాయా రాయ్ (టిఎంసి), దేబాశ్రీ చౌదరి (బిజెపి).ఇక్కడ బరిలో ఉన్నారు. శ్రీరాంపూర్ నియోజకవర్గంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా జాయింట్ సెక్రటరీ దీప్సితా ధర్ పెద్ద ఉద్యమం చేశారు. అహంకారపూరిత ప్రవర్తనతో విమర్శలు ఎదుర్కొంటున్న కళ్యాణ్ బెనర్జీని టిఎంసి మళ్లీ బరిలో దింపింది. బిజెపి అభ్యర్థిగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త కబీర్ శంకర్ బోస్ బరిలోకి దిగారు. జాదవ్‌పూర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీజన్ భట్టా చార్య, టిఎంసికి చెందిన సయానీ ఘోష్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు.

శ్రీజన్ ప్రచార కార్యక్రమాలకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఇక్కడ బిజెపి అభ్యర్థి అనిర్‌బెన్ గంగూలీ.

అధిర్ రంజన్ చౌదరిపై క్రికెటర్ పఠాన్

డమ్‌డమ్ నియోజకవర్గంలో టిఎంసి సిట్టింగ్ ఎంపీ సౌగతా రాయ్‌పై సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు సుజన్ చక్రవర్తి పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గం టిఎంసి పాశవిక దాడులకు వేదికైంది. బిజెపి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా ఉన్న శిల్పా దత్తా ఇక్కడ పోటీ చేస్తున్నారు. బహరంపూర్‌లో కాంగ్రెస్ లోక్‌సభ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి వామపక్ష కూటమి మద్దతుతో పోటీ చేస్తున్నారు. టిఎంసి అభ్యర్థిగా క్రికెటర్ యూసుఫ్ పఠాన్ ను రంగంలోకి దింపింది. బిజెపి నిర్మల్ కుమార్ సాహాను పోటీలో నిలిపింది. అధీర్ రంజన్ ప్రచారంలో వామపక్ష కూటమి కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు.

కలం బాణాలు

మోడీ మాటలపై నడ్డాకు ఈసీ నోటీసు

విద్వేషపు వాక్కులతో
చెలరేగెను మోడీ
నమ్రతగా రాసిన నోటీస్,
నడ్డాజీ చూడండి

ఈసీ నిశ్చయమెంతో
ఇంతటితో తేలిపోయె
నిర్భయంగ వ్యవహరించే
ఆశలన్నీ కూలిపోయె

అవినాశ్ తప్పు చేయలేదని నమ్మి టిక్కెట్ ఇచ్చా : జగన్

అవినాశుడు అమాయకుడు
నోరైనా తెరవలేడు
వేలైనా కొరకలేడు

ఎందుకు కోపం మీకని
జగన్ బాబు ప్రశ్నలు
కుటుంబాలలో తగవులు
కుదుపులలో ప్రజలు

టిడిపిలో ఎంపిలు నిలబడరు : కేశినేని నాని

ఏవమ్మా పోయినేడు
కురిసిన హిమసమూహాలు
పార్లమెంటుకే వెళ్లిన
మన టిడిపి సభ్యులు!

ఆదినుంచి ఇదేమిటో
అచ్చిరాని వ్యవహారం
రాజ్యసభలో చూస్తేనో
మొత్తం పార్టీ మాయం

\- తె.ర

డోన్ బరిలో ఉద్దండులు !

- సర్వత్రా ఉత్కంఠ రేపుతున్న ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం ఎవరి సొంతం అవుతుందోనని సర్వత్రా ఉత్కంఠ వ్యక్తమవుతోంది. వైసిపి, టిడిపి కూటమి, ఇండియా వేదిక నుంచి రాజకీయ ఉద్ధండులు పోటీ పడుతున్నారు...డోన్, బేతంచెర్ల మున్సిపాలిటీలు, ప్యాపిలితో కలిపి మూడు మండలాలున్న ఈ నియోజకవర్గంలో మొత్తం 2,24,111 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,10,457 మంది పురుష ఓటర్లు, 1,1,3,585 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 69 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

గార్ల మద్దిలేటి స్వామి

కోట్ల జయ సూర్యప్రకాష్

ఇమేజ్ తోడవుతుందనే కోట్ల నమ్మకం

తొలుత టిడిపి అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించారు. ఆనక.. కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డిని టిడిపి అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో సుబ్బారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో చంద్రబాబు జోక్యం చేసుకుని సుబ్బారెడ్డికి నచ్చచెప్పారు. కోట్ల 1991, 2004, 2009ల్లో మూడు సార్లు కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. కొద్దికాలం కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా పని చేశారు. తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి పరిచయాలు, డోన్ నుండే సూర్యప్రకాష్‌రెడ్డి సతీమణి సుజాత ఒక పర్యాయం ఎమ్మెల్యేగా గెలవడం, వైసిపి ప్రతికూల విషయాలు తమకు విజయం చేకూరుస్తాయనే ధీమాను టిడిపి వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. .

ఇండియావేదిక, కాంగ్రెస్ మేనిఫెస్టో తోడవుతుందని కాంగ్రెస్ అభ్యర్థి

ఇండియా వేదిక తరపున పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డోన్ మండలం మల్కాపురానికి చెందిన డాక్టర్ గార్ల మద్దిలేటి స్వామి కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నారు. ప్రయివేటు కాలేజీ లెక్చరర్‌గా పని చేశారు. ప్రస్తుతం న్యాయవాదిగా పని చేస్తున్నారు. సామాజిక కార్యక్రమాల్లో కూడా నిరంతరం పని చేస్తున్నారు. వామపక్ష అభిమానులు ఈ నియోజకవర్గంలో చాలా మంది ఉన్నారు. నాపరాయి, సున్నపు బట్టీలు, సిలికాన్ తదితర పరిశ్రమల్లో వామపక్ష కార్మిక సంఘాలు ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఉంది. మద్దిలేటి స్వామికి ఇవి అనుకూలిస్తాయని రాజకీయ విశ్లేషకులు చెపుతున్నారు.

ఈ నేపథ్యంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాట్రిక్ విజయం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. వైసిపి హయాంలో అభివృద్ధి పనులు ఏమీ చేయకపోవడం తన విజయానికి దోహదపడుతుందని కోట్ల భావిస్తున్నారు. సిపిఎం, సిపిఐ, ఇతరుల సహకారం కాంగ్రెస్ పాంచ్‌న్యాయ్, గ్యారంటీలు గెలిపిస్తాయని ఇండియా బ్లాక్ అభ్యర్థి చెపుతున్నారు. వీరిలో ఎవరిని విజయం వరిస్తుందోనని జిల్లా ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి పనులు గెలిపిస్తాయని బుగ్గన ధీమా

వైసిపి తరపున బుగ్గన, టిడిపి తరపున కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ తరపున గార్లపాటి మద్దిలేటి స్వామి బరిలో ఉన్నారు. బుగ్గన బేతంచెర్ల గ్రామ పంచాయతీకి వరుసగా రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. 2014, 2019 శాసనసభా ఎన్నికల్లో వైసిపి తరపున విజయం సాధించారు. పిఎసి ఛైర్మన్‌గా కొద్దికాలం పని చేశారు. బుగ్గన హయాంలో రూ.3వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామని, దీనిని దృష్టిలో పెట్టుకుని మళ్లీ ఆశీర్వదించాలని వైసిపి శ్రేణులు ప్రచారం సాగిస్తున్నాయి.

చింతలపూడి సభలో మాట్లాడుతున్న షర్మిల

బిజెపికి ప్రత్యేక హోదా తాకట్టు

- ధరల స్థిరీకరణ నిధుల్లో ఎంత ఖర్చు చేశారు?
- ఎపి న్యాయ్ యాత్రలో పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - చింతలపూడి, దెందులూరు

ప్రత్యేక హోదాను అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి తాకట్టు పెట్టాయని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ఆమె చేపట్టిన ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లాలో చింతలపూడి, దెందులూరు నియోజకవర్గంలోని గోపన్నపాలెం సెంటర్, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు బోసుబొమ్మ సెంటర్ నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేసి, సబ్సిడీలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సొంతమన్నారు. ధరల స్థిరీకరణకు రూ.మూడు వేల కోట్లు కేటాయిస్తానన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. రైతులకు కనీసం డ్రిప్ సౌకర్యం కల్పించారా? అని నిలదీశారు. ప్రతి సంక్రాంతికి జాబ్ కేలలెండర్ ఇస్తానని చెప్పి జాబులే లేకుండా చేశారని విమర్శించారు. అధికారంలోకి రాగానే 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ

చేస్తానని హామీ ఇచ్చి ఒక పోస్టయినా భర్తీ చేశారా? అని నిలదీశారు. ప్రత్యేక హోదా వస్తే ఒక్కో నియోజకవర్గానికి 50 నుండి 100 వరకు పరిశ్రమలు వస్తాయని, తద్వారా చదువుకున్న యువతకు ఉద్యోగాలు వస్తాయని, ప్రజలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. మద్యపానాన్ని నిషేధిస్తానని చెప్పిన జగన్... మాట తప్పి అధిక ధరలకు నాణ్యతలేని మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో ప్రజల వద్దకు జగన్‌హన్‌రెడ్డి ఎన్నిసార్లు వచ్చారని ప్రశ్నించారు. కనీసం మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు కూడా ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. హంతకులను కాపాడుకునేందుకు సిఎం జగన్ తన అధికారాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా తీసుకొస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మాట తప్పారని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా అంశమే మర్చిపోయారని అన్నారు. మూడు రాజధానులు అని కనీసం ఒక్క రాజధాని కూడా జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్‌మోహన్ రెడ్డిలను ఓడించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ విజయవాడ ఎంపి అభ్యర్థి భార్గవ్, తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి లాం తాంతియాకుమారి, చింతలపూడి, దెందులూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఉన్నమట్ల ఎలిజా, ఆలపాటి నర్సింహమూర్తి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో త్రిముఖ పోరు

- నాలుగోసారి పోటీలో 'చలమలశెట్టి'
- 'ఇండియా' నుంచి కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు
- కూటమి నుంచి బరిలో 'తంగెళ్ల'

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ ఎంపి స్థానానికి త్రిముఖ పోరు దాదాపుగా ఖాయమైంది. ఈ నెల 25తో నామినేషన్ల ప్రక్రియకు తెరపడడంతో వైసిపి, కాంగ్రెస్, జనసేన పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో కాకినాడ లోక్‌సభ నుంచి కాబోయే ఎంపి ఎవరనేదానిపై ఇప్పుడు పార్లమెంటు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

మూడు సార్లు మూడు పార్టీల నుంచి ఇదే స్థానం నుంచి పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ నాలుగోసారి మళ్లీ బరిలో నిలిచారు. మరోసారి కాకినాడ ఎంపి స్థానానికి వైసిపి అభ్యర్థిగా తలపడుతున్నారు. మూడుసార్లు ఓటమి చెందారనే సానుభూతి కూడా సునీల్‌పై ఎక్కువగానే ఉంది. మరోవైపు సునీల్‌కు జిల్లాలో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. గురువారం భారీ ఎత్తున జన సమీకరణ చేపట్టిన సునీల్ అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు.

ఇండియా కూటమి నుంచి కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిల్చొన్నారు. సుదీర్ఘకాలంగా కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంతో ఆయన కుటుంబానికి అవినాభావ సంబంధం ఉంది. ఆయన తాత, తండ్రి కూడా కాకినాడ పార్లమెంటు స్థానానికి ఎంపిలుగా ప్రాతినిధ్యం వహించారు. తాత పల్లంరాజు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. తండ్రి సంజీవరావు ఇందిరా గాంధీ మంత్రివర్గంలో ఎలక్ట్రానిక్స్ మంత్రిగా సేవలందించారు. పల్లంరాజు మూడు సార్లు ఎంపిగా విజయం సాధించారు. రెండు సార్లు కేంద్ర మంత్రిగా పని చేశారు. ఈయనకూ కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బంధువులు, సహచరులు, అనుచరులు, అభిమానులు ఎక్కువగా ఉన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిగా మరోసారి లోక్‌సభలో అడుగు పెడతాననే ధీమాను పల్లంరాజు వ్యక్తం చేస్తున్నారు.



టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా టీ టైం అధినేత ఉదయ్ శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. రాజమండ్రి రూరల్ కడియం ప్రాంతానికి చెందిన ఉదయ్‌ను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా 8 నెలల క్రితం నియమించారు. పిఠాపురం నుంచి ఆయన బరిలో ఉంటారని అందరూ భావించారు. అనంతరం జరిగిన పరిణామాల నడుమ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగారు. దీంతో తనకు అత్యంత సన్నిహితుడుగా ఉన్న ఉదయ్‌ను కాకినాడ ఎంపి అభ్యర్థిగా ప్రకటించారు. అయితే స్థానికేతరుడు అనే అంశంపై వైసిపి నేతలు ఆయనపై వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. పార్లమెంటు పరిధిలో పరిచయాలు తక్కువగా ఉండడం పెద్దగా పేరు తెలియని వ్యక్తి కావడం ప్రతికూల అంశాలు. మరోవైపు అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ఆయన ప్రచారంలో రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్న చందాన సాగుతున్నారు. అంతేకాకుండా సొంత పార్టీ నుంచే గ్రూపుల పోరు ఉదయ్‌ను పట్టిపీడిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ కోసం సొంత సొమ్ములను ఖర్చు చేస్తూ కష్టపడి పని చేస్తున్న వారిని విస్మరిస్తున్నారనే విమర్శలు ఆయనపై ఎక్కువగా ఉన్నాయి. దీంతో సొంత పార్టీ వారే ఉదయ్‌కు సహకరించని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు టిడిపి అభ్యర్థులు పూర్తిస్థాయిలో సహకరించట్లేదు. ఆయా నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు వారి గెలుపు కోసమే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎంపి అభ్యర్థి ప్రస్తావనే ఉండట్లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కాకినాడలో జరిగిన ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా పవన్‌కల్యాణ్ స్వయంగా హాజరై కార్యకర్తల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. అయితే ఇది లోక్‌సభ స్థానంలో ఆయన విజయానికి ఏ విధంగా తోర్పడుతుందనేది ఫలితాల వరకూ వేచి చూడాల్సిందే.

నియోజక వర్గాలకే మంత్రులు పరిమితం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం వైసిపి అభ్యర్థులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గాల్లో ఎవరికి వారే సొంతంగా ప్రచారాన్ని నిర్వహించుకుంటున్నారు. రాష్ట్ర మంత్రులుగా ఉన్నవారూ పక్క నియోజకవర్గ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారానికి రావడం లేదు. పలు నియోజకవర్గాల్లో సీనియర్ మంత్రులూ గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. దీంతో మంత్రులు జిల్లాల పరిధిలోని ఇతర అభ్యర్థులకు మద్దతు గా ప్రచారం చేయడానికి సమయం కేటాయించడం లేదు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముగ్గురు మంత్రులుండగా ఎవరికి వారు తాము పోటీ చేస్తున్న నియోజకవర్గాలకి పరిమితమవుతున్నారు. ఇప్పటికే పలువురు మంత్రులు 2019లో తాము గెలుపొందిన నియోజకవర్గాల నుంచి ఇతర నియోజకవర్గాలకు వెళ్లడం వల్ల వారు అక్కడ తమకు అనుకూల వాతావరణం పెంచుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంత్రి విడదల రజని చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమలో పోటీ చేస్తున్నారు. మంత్రి మేరుగ నాగార్జున వేమూరు నుంచి ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో పోటీ చేస్తున్నారు. మంత్రి జోగి రమేష్ పెడన నుంచి పెనమలూరుకు, ఆదిమూలపు సురేష్ యర్రగొండపాలెం నుంచి కొండపికి మారారు. తానేటి వనిత కొవ్వూరు నుంచి గోపాలపురంలో పోటీలో ఉన్నారు. సీనియర్ మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు తమ జిల్లా నుంచి ఇతర జిల్లాకు రాలేని పరిస్థితి నెలకొంది. జిల్లాల్లో ఇంఛార్జి మంత్రులుగా ఉన్నవారు సైతం ఎన్నికల నిర్వహణ, ప్రచారంపై అయా జిల్లాల్లో పర్యటించడంలేదు. ప్రతిపక్షాలపై తీవ్రంగా విమర్శలు చేసే మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లి నియోజకవర్గం దాటి రాలేక పోతున్నారు.

వైసిపి తరుపున సిఎం జగన్ మోహన్‌రెడ్డి మినహా ఇప్పటి వరకూ స్టార్ కాంపైనర్లు ఎవ్వరూ రంగంలోకి దిగలేదు. ఆయన తొలి విడత చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగిసి రెండో విడత ఎన్నికల ప్రచారానికి ఈనెల 28 నుంచి సిద్ధం అవుతున్నారు. వైసిపి కీలక నేతలు విజయసాయిరెడ్డి నెల్లూరు నుంచి పోటీ చేస్తుండటం వల్ల ఆయన కూడా రాష్ట్ర వ్యాప్త ప్రచారంలో పాల్గొనడం లేదు. సజ్జల రామకష్ణారెడ్డి కష్ణా జిల్లాలో ఒక్కరోజు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రాంతీయ సమన్వయ కర్తలు జిల్లాల్లో అడపాదడపా పర్యటిస్తున్నారు. నామినేషన్ దాఖలు సమయంలోనూ అభ్యర్థులు ఎక్కువగా ఎంపి అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, అందుబాటులో ఉన్న ఎమ్మెల్సీలతో కలసి తమ క్రతువును పూర్తి చేశారు. గతంలో జిల్లా మంత్రులు, ఇంఛార్జి మంత్రులు జిల్లాల్లోని ఇతర నియోజకవర్గాల్లో ప్రచారం చేసి అభ్యర్థులకు చేదోడు వాదోడుగా నిలిచే వారని, ఇప్పుడు ఈ పరిస్థితులు లేవని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. పార్టీ పరంగా కూడా అభ్యర్థుల ప్రచార వ్యవహారం కేవలం 'ఐ ప్యాక్' బృందాలు తప్ప పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి తగిన మద్దతు కొరవడిందని అంటున్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

- వైసిపిని సాగనంపే సమయం ఆసన్నమైంది
- మలికిపురం సభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి-రాజోలు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

రైతులకు మద్దతు ధర ఇప్పించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని, అధికారంలోకి రాగానే సంవత్సరంలోగా రైతుల సమస్యలను పరిష్కరిస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. అరాచక పాలన సాగిస్తున్న వైసిపిని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని మలికిపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ..జగన్‌పై చిన్న రాయి పడితేనే యువకుడిపై కేసు పెట్టారని, దళితుడిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. వైసిపి హయాంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని, ఐదేళ్లల్లో రూ. 70 కోట్లను ట్యాక్స్ రూపంలో చెల్లించానని తెలిపారు. ప్రజల కష్టాలు తీర్చడానికి ప్రజల్లో ఒకడిగా వచ్చానన్నారు. 'నా కోసం పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లను దించారట. అన్నీ తెగించే రాజకీయాల్లోకి వచ్చా...! జగన్.. గుర్తు పెట్టుకో ఇది 2019 కాదు... 2024' అంటూ హెచ్చరించారు. ప్రభుత్వ చర్యల వల్ల కోనసీమలో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చిందన్నారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ ఐదు ఎకరాల్లో ఇళ్లు కట్టుకున్నారు కానీ కోనసీమ రైతుల కన్నీళ్లు తుడవడానికి మాత్రం మనసు రాలేదని విమర్శించారు.

మలికిపురం సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

గోదారిలో నీళ్లు పుష్కలంగా ఉన్నా తాగడానికి నీళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పంట కాలువల్లో పూడిపోయిన డ్రెయినేజీ కారణంగా నీరందక రైతులు నష్టాలను చవిచూస్తున్నారని, ఏటా పంటలను కోల్పోతూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. రాజోలు అసెంబ్లీ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్, పార్లమెంటు అభ్యర్థి బాలయోగి తనయుడు గంటి హరీష్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట కూటమి అభ్యర్థులు, టిడిపి నాయకులు ఉన్నారు.



సభాపతి తమ్మినేనికి అసమ్మతి సెగ

- ప్రచారానికి దూరంగా ముఖ్య నాయకులు
- ఇండిపెండెంట్‌గా వైసిపి రెబల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆమదాలవలస నియోజకవర్గంలో శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల ముఖ్య నాయకులు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. తమ్మినేని తీరుపై నాలుగేళ్లుగా తీవ్ర అసంతృప్తితో వారంతా రగిలిపోతున్నారు. పార్టీలో నెలకొన్న అసంతృప్తి సద్దుమణగలేదు. ఆమదాలవలసలో శాసనసభాపతి తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యుల వైఖరిపై కొంతకాలంగా నియోజకవర్గ నాయకులు తీవ్ర అసమ్మతితో రగిలిపోతున్నారు. తమ్మినేని అవినీతిపై అధిష్టానానికి ఆధారాలతో సైతం కొంతమంది నాయకులు ఫిర్యాదు చేశారు. ఆమదాలవలసలో ఈసారి అభ్యర్థిని మారుస్తారన్న ప్రచారం బలంగా వినిపించింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు 70 స్థానాల్లో పార్టీ అధిష్టానం తీసుకున్న అభ్యర్థుల మార్పు నిర్ణయం బెడిసికొట్టడంతో ఆ తర్వాత అభ్యర్థుల మార్పు జోలికి వెళ్లలేదు. ఆమదాలవలసలో సిట్టింగ్ ఎమ్మెల్యే తమ్మినేని సీతారాంకే పార్టీ టికెట్ ఖరారు చేసింది. సీతారాం అభ్యర్థిత్వాన్ని తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న వారంతా పార్టీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వీరిలో ప్రధానంగా వైసిపి మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ, ఉత్తరాంధ్ర ప్రచార విభాగం బాధ్యులు చింతాడ రవికుమార్, మండల ముఖ్య నాయకుడు కోట గోవిందరావు తదితరులున్నారు. తమ్మినేని ప్రధాన అనుచరులుగా ఉన్న ఆమదాలవలస జెడ్‌పిటిసి బెండి గోవిందరావు ఆర్థిక వ్యవహారాలను దెబ్బతీసేందుకు తమ్మినేని కుటుంబం ప్రయత్నించిందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయన ఏడాదిన్నర పాటు తమ్మినేని కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో తమ్మినేని ఆయన్ను బుజ్జగించినా, అన్యమనస్కంగానే పనిచేస్తున్నారు. ఇటీవల తన సొంత గ్రామం వంజంగి నుంచి సుమారు 50, 60 కుటుంబాలు టిడిపిలోకి వలస వెళ్లినా పట్టించుకోలేదు. టికెట్ కోసం మూడేళ్లుగా ప్రయత్నిస్తున్న చింతాడ రవికుమార్‌ను అధిష్టానం బుజ్జగించి ఇచ్ఛాపురం నియోజకవర్గ బాధ్యులుగా నియమించింది. ఎన్నికల్లో తమ్మినేని గెలుపునకు పనిచేయాలని తన అనుచరులకు రవికుమార్ చెప్పినా, వారు ససేమిరా అంటూ సువ్వారి గాంధీ వైపు చేరిపోయారు. గత ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన కోట గోవిందరావు ఇంటికి తమ్మినేని వెళ్లి ప్రాధేయపడినా ఆయన కూడా ప్రచారానికి దూరంగా ఉన్నారు. తమ్మినేని గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్లినా కొంతమంది నాయకులు ముఖం చాటేస్తున్నారు. మరికొంతమంది అయిష్టంగానే ప్రచారంలో పాల్గొంటున్నారు. తమ్మినేని కుటుంబంపై కేడర్ విసిగివేసారిపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

ఇండిపెండెంటుగా వైసిపి రెబల్

పొందూరుకు చెందిన సువ్వారి గాంధీ గత నెల 16న టికెట్ల ప్రకటన తర్వాత రోజే ఇండిపెండెంటుగా ప్రచారంలోకి దిగారు. తమ్మినేని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారంతా సువ్వారి పక్షం చేరిపోతున్నారు. ఇప్పటికే పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామస్థాయి నాయకులు ఒక్కొక్కరుగా సువ్వారి గూటికి చేరుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత సువ్వారి బరిలో నిలిస్తే, మరికొంతమంది ముఖ్య నాయకులు ఆయనకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సువ్వారి గాంధీ కూడా నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. సువ్వారి గాంధీ ఎంతమేర ఓట్లను రాబట్టగలిగితే, వైసిపికి అంతమేర నష్టం వాటిల్లుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

సంపాదకీయం

ప్రజాస్వామ్యం అపహాస్యం!

గుజరాత్ రాష్ట్రం సూరత్ లోక్‌సభా స్థానంలో బిజెపి అభ్యర్థి ఏకగ్రీవ ఎన్నిక అనేకమందికి ఎన్నో సందేహాలతోపాటు భారత ప్రజాస్వామ్యంపై పలువురికి విశ్వాసం సన్నగిల్లే స్థితికి కారణమవుతుంది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా పేరొందిన దేశానికి ఇది ఒక మచ్చగా మిగిలిపోతుంది. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రతిపాదించినవారి సంతకాలు ఫోర్జరీ చెయ్యబడ్డాయని, అందువల్ల ఆయన నామినేషన్ తిరస్కరిస్తున్నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. డమ్మీ అభ్యర్థిని కూడా అలాంటి కారణాలతోనే తిరస్కరించారు. దాంతో కాంగ్రెస్ తరపున పోటీ లేకుండా పోయింది. ఇక మిగిలిన అర డజను మంది ఇండిపెండెంట్లు కూడా క్యూ కట్టి ఉపసంహరించుకోవడంతో బిజెపి అభ్యర్థి పోటీ లేకుండా గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి, డమ్మీ అభ్యర్థి ఫోన్లు స్విచాఫ్ చేసి ఆచూకీ కూడా లేకుండా పోవడం.. ఇదంతా వింటేనే ఎంత ప్రహసనంగా అనిపిస్తుందో కదా! ఈ తతంగం ఏదో దానంతటదే జరిగిపోయింది అనుకునేంత అమాయకులెవరూ లేరు. ఇదో పెద్ద కుట్ర అనే అభిప్రాయం ఎల్లెడలా వుంది. ఒకప్పుడు లోక్‌సభ, శాసనసభల సాధారణ ఎన్నికల్లో ఏకగ్రీవాలుండేవి కానీ ఇటీవలి దశాబ్దాల్లో అది లేదు. మన రాష్ట్రంలోనూ వివిధ సందర్భాల్లో సర్పంచ్, ఎంపిటిసి స్థానాలు పెద్ద సంఖ్యలోనే ఏకగ్రీవం అవుతుంటాయి కానీ అలా అయ్యే జెడ్‌పిటిసిలు అత్యల్పమే! అలాంటిది అంతకు 20-30 రెట్లు పెద్దదిగా ఉండే లోక్‌సభ స్థానంలో ఏకగ్రీవం ఎలా సాధ్యమైందో! కనుక ఇప్పుడు సూరత్‌లో జరిగింది ప్రజాస్వామ్యం ఖూనీ! ఎన్నికలే జరగకుండా అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించడం వల్ల తమ ప్రజాస్వామిక హక్కును కోల్పోయిన ఆ నియోజకవర్గ ఓటర్లకు 'ఏకగ్రీవం' వెనకనున్న వాస్తవాలు తెలియాలి. తెలుసుకోవడం వారి హక్కు. ఆ స్థానాన్ని పోటీ లేదన్నపేరిట కొల్లగొట్టుకున్న అధికార బిజెపిదే ఆ బాధ్యత. ప్రపంచం నివ్వెరపోయేలా మతమారణ హోమం సాగిన గుజరాత్‌లో ఇలాంటివి చిన్నవేనని కొందరు అనుకోవచ్చు కానీ ప్రజాస్వామిక దేశంలో ఇది చాలా తీవ్రమైన విషయం!

గడచిన పదేళ్లలో ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలవారు మెజార్టీ స్థానాల్లో గెలుపొందినా ప్రలోభాలు, ఒత్తిళ్లతో వారిని ఫిరాయింపజేసి కమలం పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడం తెలిసిందే! గవర్నర్లను వాడుకోవడం, ఇడి, ఐటి, సిబిఐలను ఉసిగొల్పడం మోడీ షా ద్వయానికి మరో తరహా ఆయుధాలు. కర్ణాటక, గోవా, మహారాష్ట్ర.. ఇలా ఎన్నో రాష్ట్రాల్లో ఇదే తంతు. ఇటీవల చండీగఢ్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికలో కమలనాథుల మోసం సాక్షాత్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం ధర్మాసనం ఎదుటే బట్టబయలయ్యింది. దాంతో మేయర్ ఎన్నికను రద్దు చేసి తిరిగి జరపాలని ఆదేశించింది. మరి సూరత్‌లో పరివార్ శక్తులు ఏ ఎత్తుగడలు వేశారు, ఎవరిని ఎలా మేనేజ్ చేశారో అందుకు ఎవరిని ఎలా ఉపయోగించారో! కాంగ్రెస్ అభ్యర్థి, డమ్మీ అభ్యర్థి నామినేషన్లను ఏ విధంగా డిస్క్వాలిఫై చేశారో, అందులో ఉన్నతాధికారుల పాత్ర ఏమిటీ అన్నది వెలికి రావలసివుంది. అసలు ఒక్కరు కూడా మిగలకుండా అందరు ఇండిపెండెంట్లూ ఎందుకు ఉపసంహరించుకున్నారో ఆ చిదంబర రహస్యమూ తెలియాలి. మొత్తమ్మీద సూరత్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం కోల్పోవడం బాధాకరం.

నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చినప్పటినుండీ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, వాటిని పరివార్ శక్తులతో నింపేయడం జరుగుతోంది. రాజ్యాంగ మౌలికాంశాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, సార్వభౌమత్వం, ఫెడరలిజాన్ని ధ్వంసం చేయడానికి బిజెపి- ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరాయంగా ప్రయత్నిస్తోంది. ఒకే దేశం- ఒకే ఎన్నిక, అధ్యక్ష తరహా పాలనను తీసుకురావాలనీ చూస్తున్నారు. ఎన్నికలను ఓ ప్రహసనంగా మార్చడమూ అందులో భాగమే! ఈ కుట్రలను ప్రతిఘటించడం ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం. నేడున్న కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనను అంతమొందించి, లౌకిక ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించడమే మార్గం.

నేడు

'ఆధిపత్యం' అంటే కొన్ని విలువలు, ధోరణులు, నమ్మకాలు, నైతికతలను మొత్తం సమాజం మీద రుద్దడం ద్వారా అధికార సంబంధాల్లో యథాతథ స్థితిని కొనసాగించడం.

- ఆంటోనియో గ్రాంసీ,
గొప్ప మార్క్సిస్టు మేధావి, రచయిత.

జననం : 22.1.1891 మరణం : 27.4.1937

ఆ మంగళసూత్రాల మాటేమిటి మోడీజీ?

విశ్లేషణ



మంగళసూత్రాల గురించి మాట్లాడే నైతికత మోడీ, ఆయన పరివారానికి వున్నదా? తమరు కట్టిన తాళిని గాలికి వదిలేయడం మీ వ్యక్తిగతం అనుకుందాం. మంగళసూత్రానికి మతాన్ని ముడివేసే మీ దుష్ట బుద్ధిని ఏమనుకోవాలి? గుజరాత్‌లో వేలాది నరబలుల తర్వాతే కదా ఢిల్లీ అధికార పీఠంపై తమరు అధిష్టించబడింది. అక్కడ తెగిన వేలాది మంగళసూత్రాల కోసం ఒక్కరోజైనా బొట్టు కన్నీరు కార్చారా? నాడు మతోన్మాద కత్తులకు తెగిపడిన తలలు, విద్వేషాగ్నికి కాలిన కళేబరాలు, సహాయం కోసం ఎలుగెత్తిన గొంతుకలు మీలో కించిత్ మానవత్వాన్ని కూడా మేల్కొల్పలేక పోయాయే! ఆ నిర్భాగ్య జీవులను 'కారుకు అడ్డంగా వచ్చిన కుక్క'లతో పోల్చారు కదా! నిండు గర్భాన్ని శూలంతో చీల్చిన ముష్కరులను ఒక్కసారైనా ఛీత్కరించారా? బిల్కిస్ బానో లాంటి అనేక మంది అబలలపై ముష్కరులు పైశాచికంగా ఘోరాలు చేస్తే వారిని శిక్షించక పోగా, రక్షించి, సత్కరించిన మీ పార్టీ మంగళసూత్రం గురించి, వాటి పవిత్రత గురించి మాట్లాడితే ఎలా?

దేశాన్ని పదేళ్ళుగా పాలిస్తున్న నరేంద్ర మోడీ, 400 పార్లమెంట్ స్థానాలతో మూడోసారి ప్రధాని కావాలని కలలు కంటున్నారు. అవి ఒట్టి కలలే కాదు, నిజమై తీరుతాయని గత నెల క్రితం వరకు ఆయన, ఆయన అనుంగ ప్రచార పంచమాంగ దళం హోరెత్తించాయి. మొదటి విడత పోలింగ్ తర్వాత ప్రజాతత్వం బోధపడింది. మరోసారి అధికారం దక్కదనే భయం ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. మొదటి విడత పోలింగ్ పూర్తయి, రెండవ విడత దగ్గర పడుతున్న కొద్దీ ఈ భయం మరింతగా పెరిగింది. ఇటీవల ఎన్నికల సభల్లో మోడీ మాట్లాడుతున్న తీరు ప్రధాని స్థాయికి ఏ మాత్రం తగదు. మరోసారి మత విద్వేషాన్ని రగిల్చేందుకు సిద్ధమయ్యారు. తాను ఓడిపోతే హిందువుల మంగళ సూత్రాలు వారు లాగేసుకుంటారంటున్నారు. ఆస్తులు ముస్లింలకు పంచేస్తారంటున్నారు. ఇంకా ఏవేవో చెప్పి దేశంలోని అత్యధిక ప్రజలను భయపెట్టి గెలవాలని చూస్తున్నారు. తనను చుట్టుముడుతున్న ఓటమి భయం నుండి బయటపడేందుకు దేశ ప్రజలందరికీ భయాన్ని కల్పించాలనుకుంటున్నారు. ఈ పదేళ్ళలో తాను చేసిన మేలు చెప్పి, ప్రజల మెప్పు పొంది అధికారంలోకి రావడానికి చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలు ఏమీ లేవనే తన డొల్లతనాన్ని తానే పునఃప్రతిష్ఠించుకుంటున్నారు. ప్రధాని స్థాయిని దిగజారుస్తున్నారు.

వి. రాంభూపాల్

మంగళసూత్రాల గురించి మాట్లాడే నైతికత మోడీ, ఆయన పరివారానికి వున్నదా? తమరు కట్టిన తాళిని గాలికి వదిలేయడం మీ వ్యక్తిగతం అనుకుందాం. మంగళసూత్రానికి మతాన్ని ముడివేసే మీ దుష్ట బుద్ధిని ఏమనుకోవాలి? గుజరాత్‌లో వేలాది నరబలుల తర్వాతే కదా ఢిల్లీ అధికార పీఠంపై తమరు అధిష్టించబడింది. అక్కడ తెగిన వేలాది మంగళసూత్రాల కోసం ఒక్కరోజైనా బొట్టు కన్నీరు కార్చారా? నాడు మతోన్మాద కత్తులకు తెగిపడిన తలలు, విద్వేషాగ్నికి కాలిన కళేబరాలు, సహాయం కోసం ఎలుగెత్తిన గొంతుకలు మీలో కించిత్ మానవత్వాన్ని కూడా మేల్కొల్పలేక పోయాయే! ఆ నిర్భాగ్య జీవులను 'కారుకు అడ్డంగా వచ్చిన కుక్క'లతో పోల్చారు కదా! నిండు గర్భాన్ని శూలంతో చీల్చిన ముష్కరులను ఒక్కసారైనా ఛీత్కరించారా? బిల్కిస్ బానో లాంటి అనేకమంది అబలలపై ముష్కరులు పైశాచికంగా ఘోరాలు చేస్తే వారిని శిక్షించక పోగా, రక్షించి, సత్కరించిన మీ పార్టీ మంగళసూత్రం గురించి, వాటి పవిత్రత గురించి మాట్లాడితే ఎలా? 2020 ఢిల్లీ అల్లర్లలో మతోన్మాదుల చేతుల్లో హతులైన 50 మంది మహిళల మంగళసూత్రాల గురించి ఎన్నడైనా మాట్లాడారా? పుల్వామా ఉగ్రదాడుల్లో హతులైన జవాన్ల భార్యల మంగళసూత్రాలు గంగలో కలిసి పోవడానికి కారకులెవరనేది ఇప్పటికీ మిస్టరీయే కదా. ఆదివాసీల హక్కుల కోసం కృషి చేసిన స్టాన్‌స్వామి కట్టిన మంగళసూత్రాన్ని తెంచిందెవరు? అక్రమంగా జైళ్ళ గదుల్లో సంవత్సరాలుగా నిర్బంధించబడిన హక్కుల నేతలు, ప్రజాపక్ష జర్నలిస్టుల మంగళసూత్రాల మాటేమిటి? గత పది సంవత్సరాల్లో మీ విధానాల ఫలితంగా ఆత్మహత్య చేసుకున్న 1,74,000 మంది రైతుల భార్యల మెడల్లో మంగళసూత్రాలు లేకుండా చేసింది ఎవరు? మీ ఏలుబడిలో నాలుగు కోట్ల మంది గ్రామీణ పేదలు పొట్ట చేత పట్టుకుని మాన, ప్రాణాలకు రక్షణ లేని వలస జీవితాల యమ కూపంలోకి నెట్టబడినప్పుడు మంగళసూత్రం

ఇన్ని దారుణాలు, ఇంతటి ఘోరాల్లో తెగిపడిన లక్షలాది మంగళసూత్రాల గురించి స్పందించని మీ కంఠం ఇప్పుడు హఠాత్తుగా వాటి గురించి మాట్లాడుతుందంటే మీ ఓట్ల మంత్రాంగం ఎంత చిత్రాతి చిత్రమైనది! సాటి మనుషులను శత్రువులుగా చూపి, సున్నితమైన విశ్వాసాలను పావులుగా వాడుకుని ఎల్లకాలం అధికారాన్ని చెలాయించడం సాధ్యం కాదు. నిత్యజీవితం నుండే ప్రజలు వాస్తవాన్ని గుర్తిస్తారు. ఈలోపు లొంగి గులాములుగా మారేవారు కొందరు. అడ్డగించకుండా మౌనంగా వుండేవారు మరికొందరు. ఎదురు నిలిచి ప్రశ్నించేవారు కొందరిలో కొందరు. ఆ కొందరే నేడు కోట్ల గొంతుకలు అవుతున్నారు. అందుకే కేంద్ర పాలకులకు భయం పట్టుకుంది. ఆ భయం నిజం కావాలి. దేశానికి మంగళం జరగాలి.

గుర్తుకు రాలేదే! కరోనా సమయంలో కోట్లాది తల్లులు, పసిపిల్లలు అన్నమో రామచంద్రా అంటున్నా కనికరం చూపకుండా లాక్‌డౌన్ పేరుతో మీరు తెంచిన మంగళసూత్రాలు ఎన్ని? నోట్ల రద్దు దెబ్బతో క్యూలో రాలిన మంగళసూత్రాలు ఎన్ని? మీరు తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను నిరసిస్తూ 758 మంది రైతులు చనిపోతే, వారు కట్టిన మంగళసూత్రాల గురించి మీ 'మన్ కీ బాత్'లో ఒక్కసారైనా మాట్లాడలేదే? మీరు అధికారంలోకి రాక ముందు 2011లో మహిళలపై 2,28,650 అఘాయిత్యాలు జరిగితే మీ ఏలుబడిలో ఒక్క 2022 లోనే 4,45,256 జరిగాయని అంటే ప్రతి గంటకు 51 ఎఫ్‌ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయని, అలాగే 31,560 మంది మహిళలు అంటే రోజుకు ఎనిమిది మంది చొప్పున మానభంగాలకు గురయ్యారని కేంద్ర నేర పరిశోధన నివేదికలు చెబుతున్నాయి కదా. ఈ బాధిత మహిళల మంగళసూత్రాల గురించి ఒక్కసారైనా మాట్లాడారా? వీరిలో అత్యధికులు మీరు చెప్పే హిందువులే కదా! మహిళల మాన, ప్రాణాల రక్షణ కోసం స్పందించని మీ హృదయం ఎన్నికల వేళ మంగళసూత్రాల రక్షణ కోసం స్పందించడం వెనుక వున్న మర్మం ఏమిటి దురాత్మా!

19 సంవత్సరాలు నిండని దళిత బాలిక మీద ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో సామూహిక హత్యాచారం చేసి, తల్లిదండ్రులకు చెప్పకుండానే తెల్లవారుజామున 2.30కే ఆమె భౌతికకాయాన్ని కాల్చివేసిన వారు మీ పార్టీ నాయకులే కదా. కాశ్మీర్ లోని కథువాలో ముక్కుపచ్చలారని పసిపిల్లను దేవాలయంలోనే పుజారి మానభంగం చేసి, బండరాయితో తల పగులగొట్టి, అడ్డువచ్చిన తండ్రిని చంపితే ఆ రాష్ట్రంలోని తమరి పార్టీ మంత్రి నిస్సిగ్గుగా ఆ దుర్మార్గుడికి మద్దతుగా ర్యాలీ చేసినప్పుడు మీరు కనీసం చలించలేదే? మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులకు అండగా నిలిచింది ఎవరు? అక్కడ ఒక జాతిని సమూలంగా నిర్మూలించేందుకు వందలాది యువతీయువకుల మాన ప్రాణాలు హరించుకు పోయిన మంగళసూత్రాలు ఈ దేశ ప్రధాని ఓదార్పుకు కూడా నోచుకోలేదే? రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్ష హోదాలో బిజెపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ మహిళా మల్ల యోధులపై చేసిన లైంగిక వేధింపులకు నిరసనగా ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నెలల కొద్ది ఆందోళనలు చేసినా, ప్రపంచమంతా స్పందించినా కనీస ఆందోళన వ్యక్తం చేయని పాషాణ హృదయమెవ్వరిది?

ఢిల్లీ అల్లర్లలో 'గోలి మార్' అంటూ రెచ్చగొట్టి అనేకమంది చావుకు కారణమైన అనురాగ్ ఠాకూర్ మీ పార్టీ ఎంపీనే కదా. 2018లో గుంపుదాడులు చేసి ప్రజల ప్రాణాలను హరించిన ఎనిమిది మంది అల్లరి మూకలను జైలు నుండి బయటకు తెచ్చి వారికి పూలదండలు, స్వీట్లు పంచిన జయంత్ సిన్హా మీ మంత్రివర్గ సహచరుడే కదా. బరితెగించిన ఉన్నావ్ దారుణానికి కారకుడైన కుల్దీప్ సింగ్ సెంగార్ మీ పార్టీ ఎమ్మెల్యేనే కదా. కాశ్మీర్ కథువా రేప్ కేసులో దోషుల పక్షాన నిలిచిన లాల్‌సింగ్ చౌదరి, చంద్ర ప్రకాష్‌లు ఆ రాష్ట్రంలో మీ పార్టీ మంత్రులే కదా. 2021లో జంతర్‌మంతర్ వద్ద పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ముస్లిం మహిళలపై దాడులు, అత్యాచారాలు చేయమని రెచ్చగొట్టిన అశ్వని ఉపాధ్యాయ మీ పార్టీ నేతే కదా. మధ్యప్రదేశ్‌లో ఆదివాసీలపై మూత్ర విసర్జన చేసిన ప్రవేశ్ శుక్లా...మీ పార్టీ ఎమ్మెల్యే కేదరినాథ్ శుక్లా సహచరుడే కదా. ఇలా మీ పరివార్ జాబితా చెబితే చాంతాడే చిన్నబోతుంది.

ఇలాంటి వారిని మీరు మందలించినట్లు వినే భాగ్యం ఒక్కసారైనా ఈ దేశ ప్రజలకు కలిగించలేదే?

దేశంలోని మహిళల్లో 60 శాతం మంది ప్రభుత్వ కనీస ఆరోగ్య సేవలకు దూరంగా వున్నారని, పుట్టిన ప్రతి వెయ్యి మంది శిశువుల్లో 50 మంది ఎస్.సి ల్లో, 49 మంది ఎస్.టి ల్లో, 41 మంది వెనుకబడిన తరగతుల్లో కన్నుతెరవక ముందే కన్నుమూస్తున్న చిన్నారుల గురించి జాతీయ ఆరోగ్య నివేదిక చెబుతున్నది కదా. ఎప్పుడైనా ఆ తల్లుల ఘోష వినేందుకు ప్రయత్నించారా? మీరు అధికారంలోకి రాకముందు 6 నుండి 59 నెలల మధ్య వున్న పిల్లల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారు 59 శాతం మంది వుంటే 2019-21 నాటికి 67 శాతానికి పెరిగారు. అందులో మీరు చెప్పే 'అభివృద్ధి నమూనా రాష్ట్రం' గుజరాత్‌లో ఈ సంఖ్య 80 శాతంగా వుంది. అయినా మీకు ఆందోళన కలిగించలేదే? 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయసు వున్న మహిళల్లో 2015-16లో 53 శాతం మంది రక్తహీనతతో వుంటే 2021 నాటికి 57.2 శాతానికి పెరిగారు. వీరిలో అత్యధికులు మీరు చెప్పే హిందువులే కదా! ఆ పసిపిల్లలకు, తల్లులకు పోషకాహారం అందించాలని వారి భవిష్యత్తును, తల్లుల మాతృత్వాన్ని కాపాడాలని ఆలోచించలేదే?

ఇన్ని దారుణాలు, ఇంతటి ఘోరాల్లో తెగిపడిన లక్షలాది మంగళసూత్రాల గురించి స్పందించని మీ కంఠం ఇప్పుడు హఠాత్తుగా వాటి గురించి మాట్లాడుతుందంటే మీ ఓట్ల మంత్రాంగం ఎంత చిత్రాతి చిత్రమైనది! సాటి మనుషులను శత్రువులుగా చూపి, సున్నితమైన విశ్వాసాలను పావులుగా వాడుకుని ఎల్లకాలం అధికారాన్ని చెలాయించడం సాధ్యం కాదు. నిత్యజీవితం నుండే ప్రజలు వాస్తవాన్ని గుర్తిస్తారు. ఈలోపు లొంగి గులాములుగా మారేవారు కొందరు. అడ్డగించకుండా మౌనంగా వుండేవారు మరికొందరు. ఎదురు నిలిచి ప్రశ్నించేవారు కొందరిలో కొందరు. ఆ కొందరే నేడు కోట్ల గొంతుకలు అవుతున్నారు. అందుకే కేంద్ర పాలకులకు భయం పట్టుకుంది. ఆ భయం నిజం కావాలి. దేశానికి మంగళం జరగాలి. మంగళ సూత్రాలకు నిజమైన రక్షణ కావాలి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

జనవాక్యం

సన్యాసికి రాజకీయాలా?

ముక్కు మూసుకొని అడవులలో తిరుగుతూ, దొరికిన ఆకులను తింటూ ఇహలోక సుఖాలను వదలి జీవితం గడిపేవాడిని సన్యాసి అంటారు. కామక్రోధ మద మత్సరాలను వదిలామంటారు. మరి నేను హిందూపూర్ పార్లమెంటు సభ్యునిగా పోటీ చేస్తానని చెప్పుకొని తిరిగే ఈ పరిపూర్ణానంద సన్యాసి ఎలా అవుతాడు? పైగా ఈయన గారికి ఒక ఛానల్ కుడా ఉంది. ఓట్లు కొనుక్కోవాలి. ఓటుకి సారా పోయాలి. అయితే ఈయనగారు మతం కార్డు వదులుతాడేమో! మతోన్మాదం రెచ్చగొట్టి ఓట్లు పొందాలని చూస్తున్నాడు. నెయ్యితో సూర్య నమస్కారం చేస్తూ ఇంట్లో కూర్చుంటే కరోనా పోతుందని కూడా చెప్పాడీయన. ఇలాంటి మతోన్మాది, అజ్ఞాని రాజకీయాలలోకి వస్తే దేశం భ్రష్టు పట్టి పోతుంది. సన్యాసి అయినవాడు ఆకలేస్తే భిక్షాటన చెయ్యాలి. అది లేకపోతే చెట్టుకాయలు కోసుకు తినాలి. అవీ దొరక్క పోతే నీళ్ళు తాగి పడుకోవాలి. మరి ఈ రోజు సన్యాసులను కుంటున్నవారు ఎలా ఉంటున్నారు? వేల కోట్ల రూపాయలు, వందలాది ఎకరాల భూములు, రాజమందిరాలను తలపించే ఆశ్రమాలూ, ఏసీ కార్లు, విమాన ప్రయాణాలు, ప్రశ్నించిన వారి మీద బూతులూ..వీళ్లు సన్యాసులా! వీరు దొంగ సన్యాసులు. అందునా రాజకీయాలలోకి వస్తారట. వీరికి తగిన బుద్ధి చెప్పాలి. ఇలాంటివారిని సమాజం దూరంగా పెట్టాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,
హేతువాదసంఘం ఎ.పి అధ్యక్షుడు.

బోధనేతర పనులతో నష్టం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనేతర పనులతో ఒత్తిడికి గురౌతున్నారు. వీరు ఆన్‌లైన్ హాజరు, మరుగుదొడ్ల ఫోటోలు తీయడం, మధ్యాహ్న భోజనం, రాగి జావ, చిక్కీలు, కోడిగుడ్ల లెక్కలు, ప్రాథమిక విద్యనభ్యసించే మూడో తరగతి విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు కలపడం, ప్రోగ్రెస్ రిపోర్టులు, ఏకరూప దుస్తులు, నాడు-నేడు, అమ్మ ఒడి, పాఠ్యపుస్తకాల పంపిణీ, తల్లిదండ్రుల సమావేశాలు, మండల, జిల్లా అధికారులతో తరచూ చర్చలు. ఇవన్నీ ఉపాధ్యాయులే చూడాల్సి వస్తున్నది. వీటికి తోడు పోస్టుల ఖాళీలు. దీంతో పదవ తరగతి పరీక్షల్లో ప్రైవేటు పాఠశాలల కంటే ఉత్తీర్ణతలో వెనకబడ్డారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తొలగిస్తే బోధనపై దృష్టి సారించి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణతలో సత్తా చూపగలరు.

- యర్రమోతు ధర్మరాజు

మ్యానిఫెస్టోల్లో 'ఉక్కు'

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేయబోమని, ఇందుకు అంగీకరించమని సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చెబుతున్న జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకులు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు జవాబుదారీగా ప్రకటించాలి. మూడేళ్లుగా ఉక్కు కర్మాగార పరిరక్షణ కమిటీ ఆందోళన వలన నిలిచి వున్నప్పటికీ... ప్రైవేటీకరణలో అంతర్గత కుట్ర కొనసాగుతున్నది. బొగ్గు నిలుపుదల, ముందస్తు ముడిసరుకు లేకుండా మందగించడం అనుమానాలకు తావిస్తున్నది. ప్రత్యేక హోదా లేక రాష్ట్ర ప్రగతి అమావాస్య చందమైన రీతిగా ఉత్తరాంధ్ర శిఖరాన్ని నేలమట్టం చేసుకునే దుస్థితి ఎదురయ్యేలా వుంది. అందుకే ఎన్నికల్లో పాల్గొంటున్న అన్ని పార్టీలూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణను మ్యానిఫెస్టోలో చేర్చాలి.

- దూసర్లపూడి రమణరాజు,
కాకినాడ జిల్లా

ప్రత్యక్ష రాజకీయాల్లో మేధావులు

సామాజిక స్పృహతో, ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చే లక్ష్యంతో, సేవే పరమావధిగా భావించే సాధారణ ప్రజలు, విద్యావంతులు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు వంటి వారు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి. అలాంటి వారిని అన్ని రాజకీయ పార్టీలు కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాలకతీతంగా ప్రోత్సహించాలి. కానీ ఈ రోజు పాలక పార్టీలు బాగా డబ్బున్న వాళ్ళకే టికెట్లు ఇవ్వడం దేశ ప్రజలు ఆలోచించాల్సిన విషయం. మన దేశంలో ఉచిత విద్య, వైద్యం, సమాన ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన...వంటి ఉన్నతమైన లక్ష్యాలు నెరవేరాలన్నా, పేదరికాన్ని ఈ దేశం నుంచి తరిమేయాలన్నా మన రాజకీయాలు మారాలి. యువతరం ఈ దేశ రాజకీయాలను ప్రభావితం చేయాలి.

పి.అరుణ్ కుమార్, నాగర్ కర్నూల్.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

విద్వేష వాక్కుల వీరంగం

తమ పట్ల పెరుగుతున్న ఈ విస్తృత నిరసన మింగుడు పడని ఫలితమే ముస్లింలపై, వారిని బుజ్జగిస్తాయని ఆరోపించే పార్టీలపై ద్వేషం మరింత పెంచిన ప్రధాని స్పందనకు కారణం. ఇది ఆయనకు అలవాటైన పాత విద్యే. రాజస్థాన్ లోని బాన్స్‌వారాలో ఆయన చేసిన ప్రసంగం అందుకే. కొద్ది మాసాల కిందట జరిగిన ఎన్నికలలో బిజెపికి రాజస్థాన్ మంచి విజయాన్నే అందించింది. అలాంటి చోట ఏప్రిల్ 19 తొలి దశ పోలింగ్‌లో పరిస్థితి మారడం ఇందుకు కారణమైంది. దాంతో ప్రధాని కాంగ్రెస్‌పై దురుద్దేశపూరితమైన అసత్య ప్రచారానికి దిగారు.

వ్యాఖ్య

పోలింగ్ ముగిసిన రెండు రోజుల తర్వాత ప్రధాన మంత్రి చేసిన పైత్యప్రకోపిత ప్రసంగం దేశంలోనూ విదేశాల్లోనూ తీవ్ర ఖండనలకు గురైంది. ముస్లింలపై ఆయన వాడిన విద్వేష భాష, అలాగే వారి పట్ల బుజ్జగింపు ధోరణి అనుసరిస్తున్నట్లుగా ఆయన ఆరోపిస్తున్న పార్టీలపై వేసిన నిందలు ఆయన గుజరాత్ రోజులను గుర్తుచేస్తున్నాయి. 2002లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న ఆయన 2002 జాతి హత్యాకాండ తర్వాత ఇదే విధమైన రెచ్చగొట్టుడుకు పాల్పడ్డారు. ఇప్పుడు ఎన్నికల పోరాటం తొలి దశలోనే మళ్ళీ ఆ భాషకు దిగాలని ఆయన ఎందుకు భావించాల్సి వచ్చిందనేది ఇక్కడ కీలకంగా విశ్లేషించవలసిన అంశం.

ఏప్రిల్ 19న 120 సీట్లకు పోలింగ్ జరిగింది. ఇందులో 40 తమిళనాడు, పాండిచ్చేరిలో వున్నాయి. వీటిలో బిజెపికి వచ్చే సీట్లు శూన్యం. మిగిలిన వాటిలో రాజస్థాన్‌లో 12, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, ఉత్తరాఖండ్-మహారాష్ట్ర-అస్సాంలలో ఐదేసి చొప్పున, బీహార్‌లో 4, పశ్చిమ బెంగాల్‌లో 3, ఈశాన్యంలో 6, చత్తీస్‌గఢ్‌లో 1, జమ్ము కాశ్మీర్‌లో 1 వున్నాయి. గతసారి బిజెపి ఈ రాష్ట్రాల్లో విజయం సాధించింది.

కానీ ఈసారి ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో పరిస్థితి అంత సానుకూలంగా వున్నట్టు కనిపించడంలేదు. అదే నిజమైతే మూడో దఫా అధికారంలోకి రావాలనే ఆ పార్టీ కల కలగానే మిగిలిపోతుంది. అది నెరవేరడం అసాధ్యమవుతుంది.

తమ పట్ల పెరుగుతున్న ఈ విస్తృత నిరసన మింగుడు పడని ఫలితమే ముస్లింలపై, వారిని బుజ్జగిస్తాయని ఆరోపించే పార్టీలపై ద్వేషం మరింత పెంచిన ప్రధాని స్పందనకు కారణం. ఇది ఆయనకు అలవాటైన పాత విద్యే. రాజస్థాన్ లోని బాన్స్‌వారాలో ఆయన చేసిన ప్రసంగం అందుకే. కొద్ది మాసాల కిందట జరిగిన ఎన్నికలలో బిజెపికి రాజస్థాన్ మంచి విజయాన్నే అందించింది. అలాంటి చోట ఏప్రిల్ 19 తొలి దశ పోలింగ్‌లో పరిస్థితి మారడం ఇందుకు కారణమైంది. దాంతో ప్రధాని కాంగ్రెస్‌పై దురుద్దేశపూరితమైన అసత్య ప్రచారానికి దిగారు. ముస్లింలు చొరబాటుదారులనీ ఎక్కువగా పిల్లలను కంటారనీ ఆరోపిస్తూ కాంగ్రెసు సంపద కట్టబెట్టేందుకు మొదటి అవకాశం ఇస్తుందని అభాండం వేస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ మేరకు వాగ్దానం చేశారని పచ్చి అవాస్తవం చెప్పేస్తున్నారు. కాంగ్రెస్‌ను గనక ఎన్నుకుంటే హిందూ

PEOPLE'S DEMOCRACY

మహిళల మంగళసూత్రాలను కొల్లగట్టి అందులోని బంగారం అత్యధికంగా ముస్లింలకు ధారాదత్తం చేస్తారని ఆరోపిస్తున్నారు. ఇది హిందూ మహిళలను రెచ్చగొట్టేందుకు చేసిన ప్రయత్నం. ఇక అదే రాజస్థాన్‌లో మరో తప్పుడు ఆరోపణ తెచ్చారు. కాంగ్రెస్ వస్తే దళితులు, గిరిజనుల రిజర్వేషన్లు తీసేసి ముస్లింలకు ఇస్తారని మాట్లాడారు. తన విధానాలను వ్యతిరేకించే పేద వర్గాలలో చీలికలు పెంచే పాచికే ఇది.

బిజెపి అధికారంలోకి రావాలంటే హిందీ రాష్ట్రాలే కీలకం. కనుక ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఇలాంటివే మరిన్ని జరుగుతాయని భావించవచ్చు. ఇప్పటికే యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆ పని మొదలెట్టేశారు కూడా. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే షరాయిత్ చట్టం అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు.

ప్రధాని ప్రసంగాలు బిజెపి నిబద్ధ ఓటర్లలో అత్యుత్సాహ పూర్వకమైన స్పందన తెచ్చాయి. ఇప్పటికిప్పుడు జరిగే ఎన్నికల్లో ప్రయోజనం కోసం తమ మౌలిక భావజాలానికి తిరిగి వెళ్ళడం వారికి నచ్చింది. అంతేగాక తమ విధానాలపై పెరుగుతున్న నిరసనను ఎదుర్కోవడానికి కూడా ఇది ఉపయోగమని వారి ఆలోచన. ఆస్తుల పునఃపంపిణీని, కుబేరులపై అదనపు పన్ను విధింపును కచ్చితంగా వ్యతిరేకిస్తూ ప్రధాని మాట్లాడినదానికీ దేశంలోనూ వెలుపలా కార్పొరేట్ ప్రపంచంలో కొందరు కూడా ఉత్సాహపడిపోయారు. ఆర్థిక అసమానతల తగ్గింపు కోసం ఇలా చేయాలనే యోచనను ప్రధాని పూర్తిగా తోసిపుచ్చడం వారికి నచ్చింది.

ప్రధానమంత్రి మాట్లాడిన తీరుపై సిపిఎం, ఇతర ప్రతిపక్షాలు, దీనిపై ఆందోళన చెందిన పౌరులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రజల్లో వివిధ తరగతుల మధ్య స్పర్థలు సృష్టించే ఈ ప్రసంగం రాజ్యాంగ విరుద్ధమని, ఎన్నికల నియమావళికి వ్యతిరేకమని తెలిపాయి. ఈ ప్రసంగంపై ఎన్నికల సంఘం మొదట ఏమీ స్పందించలేదు. తర్వాత ఫిర్యాదును అధ్యయనం చేస్తున్నట్టు చెప్పింది. ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగ బాధ్యత ఏ మేరకు నిర్వహిస్తుందనే దానిపై లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. అది ఆ విషయంలో విఫలమైతే ప్రజాస్వామ్యానికి అనర్థం. ఈ విషయంలో ఏమి జరుగుతుందనేదాన్ని బట్టి ఎలక్షన్ కమిషన్ ఏ మేరకు మచ్చిక అయిందనేది తెలుసుకోవచ్చు

మోడీ విద్వేష ప్రసంగాలు సన్నగిల్లిపోతున్న ఆ పార్టీ అవకాశాలను ఏ మేరకు మెరుగు పరుస్తాయి? అధిక ధరలు, నిరుద్యోగం, అవినీతి వంటి సమస్యలు ఓటర్లను చాలా ఆందోళన పరుస్తున్నాయని అనేక సర్వేలు చెబుతున్నాయి. నిజంగా అదే నిజమైతే వారిని పక్కదోవ పట్టించే ఇలాంటి తంటాలు వృధానే అవుతాయి. అయినా అవి ఖండనపాత్రమే.

(ఏప్రిల్ 24 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★ ఇందులో సందేహించినట్టే ఎన్నికల కమిషన్ బిజెపి అధ్యక్షుడు జె.పి. నడ్డాకు మాత్రమే...అది కూడా పైపై మాటలతో మొక్కుబడిగా తాఖీదు ఇచ్చి సరిపెట్టింది. ★

ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే... మోడీకి గడ్డు కాలమే!

- ఈసారి మతం కార్డు పనిచేయదు
- ఇసి పనితీరు బాగోలేదు
- 'డెక్కన్ హెరాల్డ్' ఇంటర్వ్యూలో సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే నరేంద్ర మోడీ ప్రభుత్వం గడ్డు పరిస్థితిని ఎదుర్కోక తప్పదని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. ఎన్డీఏ కూటమి 400కు పైగా స్థానాలు గెలుచుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని మరచిపోవాల్సిందేనని ఆయన అన్నారు.. తొలి దశ ఎన్నికల పోలింగ్ సరళిని గమనిస్తే గతంలో ఉన్న స్థానాలను నిలుపుకోవడం కూడా ఆ పార్టీకి కష్టమే. ప్రధాని నరేంద్ర మోడీకి పరిస్థితి అర్థమైంది. అందుకే తన ప్రచార పంథాను మత విద్వేషాలవైపు మళ్లించారని ఆయన అన్నారు. ఇటీవల 'డెక్కన్ హెరాల్డ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏచూరి పలు అంశాలను ప్రస్తావించారు. అవి ఆయన మాటల్లోనే...

ఇసిలో నిష్పాక్షికత ఏది?

ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ చేయాల్సినంత పని చేయడం లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను మీరు చూస్తున్నారు. ఆ విషయంలో కూడా ఇసి నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదు. సాక్షాత్తూ ప్రధానమంత్రి, ఇతర బిజెపి నేతలు ఉల్లంఘనలకు పాల్పడుతుంటే ఇసి పట్టించుకోవడం లేదు. అలాంటప్పుడు స్వేచ్ఛకు, నిష్పాక్షికతకు చోటెక్కడిది? ఓట్లను దండుకోవడానికి భావోద్వేగాలను రెచ్చగొడుతుంటే మీరు అనుమతిస్తున్నారు. ఏదో మాట్లాడారని ప్రతిపక్ష నేతను రెండు రోజుల పాటు ప్రచారం చేయకుండా నిషేధిస్తున్నారు. అదే అధికార పార్టీ సభ్యుడు అంతకంటే దారుణంగా మాట్లాడుతుంటే ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అనుకూల పవనాలేవీ లేవు

తొలి దశ పోలింగ్ తర్వాత ప్రధాని మోడీలో నిరాశా నిస్పృహలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎందుకంటే వారు గతంలో గెలుచుకున్న స్థానాలను సైతం కోల్పోతున్నారు. ఓటింగ్ శాతం తగ్గడం ఎప్పుడూ అధికార పార్టీకి మంచి ఫలితాలు ఇవ్వదు. ఇక రెండో విషయం...ఓటింగ్ శాతం తగ్గడాన్ని బట్టి ఈసారి ఎలాంటి అనుకూల పవనాలు వీయడం లేదని అర్థమవుతోంది. ప్రజలను చైతన్యపరిచే అంశం కూడా ఏదీ లేదు. ఓ గాలి అంటూ లేనప్పుడు మోడీ గెలవడం ఎప్పుడూ కష్టమే. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే బిజెపి ఆశించిన స్థాయిలో దాని పనితీరు కన్పించడంలేదని తేలిపోయింది. ఇప్పుడు వారి వద్ద ఉన్నది ఒకటే అస్త్రం. మతపరమైన సమీకరణ, హిందువులు-ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం.

ప్రజా సమస్యలను విస్మరించి...

అయితే వారు ఆశించిన విధంగా మతం కార్డు పనిచేస్తుందని మేము అనుకోవడం లేదు. ఇప్పటికే ఈ వ్యూహాన్ని అతిగా, గరిష్టంగా వాడేశారు. వారు అల్లర్లను, అలాంటి ఘటనలను ప్రేరేపిస్తే అది వేరే కథ. అయితే ప్రస్తుతం మత సమీకరణ అనేది పనిచేయదు. మీరు హిందువు అయినా, ముస్లిం అయినా...రోజువారీ జీవన గమనం గురించే ఆలోచిస్తారు. ప్రజా సమస్యలపై మోడీ మౌనం వహిస్తున్నారు. ప్రజల మనుగడకు అవసరమైన ఉపాధి, ఆహారం, అత్యవసర ప్రయోజనాల గురించి ఆయన పట్టించుకోరు. వాటికి బదులుగా మాంసం, పుక్కిటి పురాణాల గురించి మాట్లాడుతుంటారు. ముస్లిం జనాభా

పెరిగితే హిందువుల ప్రయోజనాలు దెబ్బతింటాయని చెబుతారు. ముస్లిం జనాభా పెరుగుదలపై ఆయన చెబుతున్న మాటలు అర్థం లేనివి. ఇక్కడ మరో అంశం 'కోటా' కూడా ఉంది. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలను ముస్లింలకు ఇస్తారన్నది మోడీ వాదన. ఇది అసంబద్ధమైనది. ఎందుకంటే మీరు రాజ్యాంగాన్ని మార్చలేరు. హిందువుల సంపదను దోచుకుంటారని, మంగళసూత్రాలను గుంజుకుంటారని అంటారు. మోడీ చేస్తున్న ఇలాంటి ప్రసంగాలు దారుణంగా, ఆగ్రహం కలిగించేలా ఉన్నాయి. ఆయనలోని నిరాశానిస్పృహలను అవి ప్రతిబింబిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయిలోనే సీట్ల సర్దుబాటు

ఇండియా వేదిక పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు రాష్ట్ర స్థాయిలోనే సాధ్యపడుతుందని మేము చెబుతూనే ఉన్నాం. జాతీయ స్థాయిలో దీనిపై కసరత్తు ఏమీ జరగలేదు. మా భాగస్వామ్య పక్షాలకు నచ్చచెప్పేందుకు కొంత సమయం పట్టింది. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో అంతా పురోగతిలోనే ఉంది. సంతృప్తికరంగా సాగుతోంది. మహారాష్ట్ర, బీహార్, తమిళనాడులో కూటములు ఏర్పడ్డాయి. ఇతర రాష్ట్రాలలో ప్రధాన పార్టీలు అవగాహనకు వచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ అవగాహన కుదుర్చుకున్నాయి కదా. రాజస్థాన్‌లో మేము ఒకే ఒక స్థానంలో పోటీ చేస్తున్నాము. అది సానుకూల సంకేతం. లేకుంటే మేము నాలుగైదు స్థానాలలో పోటీ చేసే వారం. రాష్ట్ర స్థాయిలో ఆశించిన విధంగానే ఇండియా బ్లాక్ పార్టీలు ముందుకు సాగుతున్నాయి.

బిజెపి ఓటమి కోసమే...

కొన్ని రాష్ట్రాలలో అవగాహన సాధ్యం కాదని మాకు ముందు నుండే తెలుసు. ఉదాహరణకు కేరళ. బిజెపిని మట్టికరిపించడానికి అక్కడ ఎల్డీఎఫ్, యుడిఎఫ్ కృషి చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో కూడా అంతే. బిజెపిని ఓడించడమే లక్ష్యం. బెంగాల్‌లో ముక్కోణపు పోటీ జరిగితేనే బిజెపిని ఓడించగలం లేదా దానిని పరిమితం చేయగలం. ముక్కోణపు పోటీ జరగకుండా తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, వామపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరితే ప్రభుత్వ వ్యతిరేకతను పూర్తిగా బిజెపి తన ఖాతాలో వేసుకుంటుంది. ఫలితంగా ఆ పార్టీ ఎక్కువ ప్రయోజనం పొందుతుంది. పంజాబ్‌లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఆప్, కాంగ్రెస్ మధ్య అవగాహన కుదిరితే అకాలీదళ్ లబ్ధి పొందుతుంది. అంతిమంగా అది బిజెపికి లాభిస్తుంది. ఇదంతా ఎందుకు జరుగుతోందంటే బిజెపిని ఓడించేందుకు లేదా దాని స్థానాలను తగ్గించేందుకే.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం

గత 20 సంవత్సరాలుగా ఎన్నికల్లో సిపిఎం బలం తగ్గుతున్న మాట వాస్తవమే. గత ఎన్నికల్లో అది కనిష్ట స్థాయికి చేరింది. ఈ ఎన్నికల్లో పూర్వ వైభవం తిరిగి సంతరించుకుంటామని మేము భావిస్తున్నాం.. మెరుగైన ఫలితాలు వస్తాయనే ఆశిస్తున్నాము..

ఇవిఎంలకే సుప్రీం ఓటు !

- వివి ప్యాట్‌లపై పిటిషన్ల తిరస్కృతి
- పేపర్ బ్యాలెట్‌కు కూడా నో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యవస్థలో మార్పు తీసుకొచ్చిన వాటిని గుడ్డిగా వ్యతిరేకించరాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వివి ప్యాట్‌లపై పిటిషన్‌ను శుక్రవారం విచారించిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వివి ప్యాట్‌లపై దాఖలైన అన్ని పిటిషన్లనూ కొట్టేసింది. ఇవిఎం ద్వారా పోలైన ఓట్లను వివి ప్యాట్‌లతో సరిపోల్చాలన్న పిటిషనర్ల వాదనతో కోర్టు ఏకీభవించలేదు. జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

స్వల్ప మార్పులతో న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ఒకే అభిప్రాయంతో రెండు తీర్పులు వెలువరించారు. పేపర్ బ్యాలెట్ రూపంలో ఎన్నికలను నిర్వహించాలన్న పిటిషన్‌ను కూడా సుప్రీం తోసిపుచ్చింది. "ఇవిఎంలతో వివి ప్యాట్ స్లిప్‌లు పోల్చి చూడాల్సిన అవసరం లేదు. స్లిప్‌లను తీసుకుని ఓటరు బాక్స్‌లో వేయాల్సిన అవసరం లేదు. ఇవిఎం సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నాం. సింబల్ లోడింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత యూనిట్‌ను సీల్ చేయాలి. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కనీసం 45 రోజుల పాటు ఇవిఎంలు, వివి ప్యాట్‌లను భద్రపరచాలి. అభ్యర్థులకు అనుమానం వస్తే ఫలితాల ప్రకటన తరువాత ఇంజినీర్ల బృందం ఇవిఎం మెమరీని తనిఖీ చేస్తుంది. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఏడు రోజులలోపు అభ్యర్థులు తమ అభ్యంతరాలను తెలియజేయాలి. అందుకయ్యే ఖర్చులను అభ్యంతరాలు లేవనెత్తిన అభ్యర్థులే భరించాలి. ఒకవేళ ఇవిఎం ట్యాంపరింగ్ జరిగినట్లు తేలితే అభ్యర్థుల ఖర్చులు తిరిగివ్వాలి. ఒక వ్యవస్థను గుడ్డిగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. అది అనవసర అనుమానాలకు దారి తీస్తుంది" అని జస్టిస్ దీపాంకర్ దత్తా తీర్పు సందర్భంగా పేర్కొన్నారు.

కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : ఉత్తరకాశ్మీర్‌లోని బారాముల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. మరో ఇద్దరు భద్రతా సిబ్బంది, సాధారణ పౌరుడు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని సోపోర్‌లో నౌపొరా ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ ఎన్‌కౌంటర్ శుక్రవారం ఉదయం వరకూ కొనసాగినట్లు పోలీసు ఉన్నతాధికారులు మీడియాకు తెలిపారు. పోలీస్, ఆర్మీ, సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో కూడిన సంయుక్త బృందం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు అధికారులు చెప్పారు. ఈ ప్రాంతంలో దాక్కొని ఉన్న ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడినట్లు చెప్పారు. రెండు రోజుల పాటు ఎన్‌కౌంటర్ జరగడంతో ముందు జాగ్రత్త చర్యగా ఈ ప్రాంతంలో ఉన్న అన్ని విద్యాసంస్థలను మూసివేసినట్లు సొపోర్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ షబీర్ అహ్మద్ రైనా తెలిపారు. పరిస్థితిని సమీక్షించినట్లు చెప్పారు. మరణించిన ఉగ్రవాదుల్ని ఇంకా గుర్తించలేదని చెప్పారు. గాయపడ్డ పౌరుడిని 35 ఏళ్ల ఫరూఖ్ అహ్మద్ దార్‌గా గుర్తించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం బండిపొరాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

మా ఓటు కూడా లాక్కోవద్దు

- బిజెపి ఎన్నికల వాయిదా సూచనలపై ఇసికి మెహబూబా ముఫ్తి లేఖ

శ్రీనగర్ : అనంత్‌నాగ్ - రాజౌరి లోక్‌సభ సీటుకు ఎన్నికలను వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్‌ను బిజెపి సహా కొన్ని పార్టీలు కోరడంపై జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి తీవ్రంగా మండిపడ్డారు. "అనంత్‌నాగ్-రాజౌరిలో అవకాశాలు, పరిస్థితులను అంచనా వేయాల్సిందిగా కోరుతూ జమ్ము కాశ్మీర్ పాలనా యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం దిగ్భ్రాంతి కలిగించింది. చాలా కాలం తర్వాత జమ్ము కాశ్మీర్ ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వం మా నుండి అన్నీ లాగేసుకుంది. ఈ బ్యాలెట్‌ను కూడా లాక్కోకండి. కాశ్మీర్‌ను మండిపోయేలా చేసిన, తరతరాలను ప్రభావితం చేసిన 1987ను పునరావృతం చేయొద్దు." అని ముఫ్తి కోరారు. మే 7న ఇక్కడ ఎన్నికలు జరగాల్సి వున్నాయి. బిజెపి, జమ్ము కాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్, జెఅండ్ కె అప్నీ పార్టీ, ఇండిపెండెంట్లు సహా పలువురు ఎన్నికను వాయిదా వేయాలని కోరారు. మంచు విపరీతంగా కురుస్తుండడంతో మొఘల్ రోడ్డును మూసివేశారని, దాంతో రాజౌరి, పూంచ్‌లకు చెందిన అభ్యర్థులు నామినేషన్ పత్రాలు కూడా దాఖలు చేయలేకపోయారని వారు తమ వినతి పత్రాల్లో పేర్కొన్నారు. ఈ సీటు నుండి బిజెపి పోటీ చేయడం లేదనేది ఆసక్తికరమైన అంశం.

మనీష్ శిసోడియా ప్రభృతులకు మే 8 వరకు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ నేత మనీష్ శిసోడియాకు, సహ నిందితుడు విజయ్‌నాయర్, తదితరులకు మే 8 వరకు జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. వారి కస్టడీ గడువు ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ముందు ప్రవేశపెట్టారు. చార్జిషీట్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను డిజిటలైజ్ చేయడానికి ఎంత సమయం పడుతుందో ఒక నివేదికను అందజేయాల్సిందిగా కూడా న్యాయమూర్తి ఇడిని ఆదేశించారు. నిందితులు విచారణా క్రమాన్ని కావాలనే ఆలస్యం చేస్తున్నారని, వేగంగా పూర్తి చేయడానికి సుముఖంగా లేరని ఇడి తరపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నవీన్ కుమార్ మట్టా, సైమన్ బెంజామిన్ ఆరోపించారు. ఇప్పటికే ఈ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బిఆర్ఎస్ నేత కవితలకు మే 7వరకు కస్టడీ పొడిగించారు.

మతం పేరుతో ఓట్లు అడిగిన బిజెపి ఎంపీపై కేసు

బెంగళూరు : మతం పేరుతో ఓట్లు అడిగినందుకు బెంగళూరు సౌత్ బిజెపి అభ్యర్థి, ఎంపి తేజస్వీ సూర్యపై కేసు నమోదైంది. మతం పేరుతో ఓట్లు అడుగుతూ సోషల్ మీడియాలో తేజస్వి సూర్య ఒక వీడియోను పోస్ట్ చేసినట్లు కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. దీంతో, బెంగళూరులోని జయనగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. లోక్‌సభ ఎన్నికల రెండో దశలో భాగంగా బెంగళూరు సౌత్‌కు గురువారం ఎన్నికలు జరిగాయి. బిజెపి నుంచి తేజస్వి సూర్య పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ నుంచి సౌమ్యారెడ్డి పోటీలో ఉన్నారు.

పాలస్తీనియన్లకు విద్యార్థి లోకం మద్దతు

- అమెరికావ్యాప్తంగా వర్శిటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు
- వందలాదిమంది అరెస్టు, పోలీసుల అణచివేతతో ఉద్రిక్తత
- భారత సంతతి విద్యార్థిని అరెస్టు, వర్శిటీ నుంచి బహిష్కరణ

లాస్‌ఏంజెల్స్ : అమెరికాలోని పలు యూనివర్శిటీ కేంపస్‌ల్లో గత కొద్ది రోజులుగా పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు, ఆందోళనలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతను ఖండిస్తూ విద్యార్థి లోకం ఆందోళనలకు దిగింది. దీంతో పలుచోట్ల కేంపస్‌లను మూసివేసి, వందల సంఖ్యలో విద్యార్థులను అరెస్టు చేశారు. వారిపై అణచివేత చర్యలకు దిగారు. ఈ అరెస్టులకు భయపడేది లేదని, ఆందోళనలను విరమించేది లేదని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు. న్యూయార్క్‌లోని కొలంబియా వర్శిటీలో గత వారం మొదలైన పాలస్తీనా అనుకూల ఆందోళనలు క్రమంగా అన్ని వర్శిటీల కేంపస్‌లకు విస్తరించాయి. దారుణమైన యూదు వ్యతిరేకతను కాలేజీ కేంపస్‌ల్లో సహించేది లేదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ హెచ్చరించారు. అయితే కేంపస్‌ల్లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ వుంటుందని వైట్‌హౌస్ తెలిపింది.

నిరసనల్లో పాల్గొన్నందుకు గానూ కాలిఫోర్నియా, టెక్సాస్‌ల్లో రెండు యూనివర్శిటీల్లో వందమందికి పైగా విద్యార్థులను అరెస్టు చేశారు. యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా (యుఎస్‌సి) లాస్‌ఏంజెల్స్ కేంపస్‌లో కూడా నిరసనలు పెద్ద ఎత్తున సాగాయి. నిషేధాజ్ఞలను ధిక్కరించినందుకు 93మందిని అరెస్టు చేశారు. అలాగే ఆస్టిన్‌లోని టెక్సాస్ యూనివర్శిటీలో 34మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అధికారుల స్థాయిలో అదుపు చేయలేని చోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నిరసనకారులపై నిర్బంధం, డజన్ల సంఖ్యలో అరెస్టులు, నిరసన శిబిరాలు బలవంతంగా కూల్చివేయడం వంటి ఘటనలతో పలు యూనివర్శిటీ కేంపస్‌లలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్నామని కొలంబియా యూనివర్శిటీ ప్రకటించింది. నిరసనలను నిలిపివేసి, తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు కేంపస్‌ను మూసివేస్తున్నామని కాలిఫోర్నియా వర్శిటీ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. విద్యార్థులు, ఫ్యాకల్టీ, సిబ్బంది, కేంపస్‌ల్లో వ్యవహారాల కోసం వచ్చే వ్యక్తులు అందరూ కూడా సరైన గుర్తింపు కార్డులతో రావాల్సి వుంటుందని యూనివర్శిటీ ప్రకటించింది. లాస్‌ఏంజెల్స్ కేంపస్‌లో ఆందోళనకారులు అక్కడ నుండి వెళ్ళడానికి తిరస్కరించడంతో పోలీసులను పిలిపించి, బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడా ఎవరూ గాయపడలేదని, ఆ ప్రాంతమంతా గురువారం గస్తీ బృందాల అదుపులో వుందని పోలీసు అధికారులు ప్రకటించారు.

భారత సంతతికి చెందిన విద్యార్థి అరెస్టు

ప్రతిష్టాత్మకమైన ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో చదువుతున్న భారత సంతతికి చెందిన విద్యార్థిని అరెస్టు చేసి, కేంపస్ నుండి బహిష్కరించారు. కేంపస్‌ల్లో పాలస్తీనా అనుకూల ప్రదర్శనల్లో పాల్గొనడమే వారు చేసిన నేరం. కోయంబత్తూరులో పుట్టిన అచింత్యా శివలింగన్ ఇక్కడ చదువుతున్నారు. అమె క్రమశిక్షణా చర్యలను ఎదుర్కోవాల్సి వుంటుందని వర్శిటీ ప్రతినిధి తెలిపారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు విద్యార్థులు నిరసన శిబిరం ఏర్పాటు చేసుకుని ఆందోళనలు చేస్తూ పాలస్తీనాకు మద్దతుగా నినాదాలు చేశారు. మొదటి శిబిరం ఏర్పాటు చేసిన ఆరు నిముషాల వ్యవధిలోనే వర్శిటీ అధికారులు వచ్చి హెచ్చరికలు చేసి, ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేయడంతో మిగిలిన వారందరూ ధర్నా చేశారు.

ఆస్టిన్ ఫ్యాకల్టీ ఖండన

పాలస్తీనియన్లకు మద్దతుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే వారిని అడ్డుకునేందుకు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను కేంపస్‌కు రప్పించడాన్ని యుటి ఆస్టిన్ ఫ్యాకల్టీ తీవ్రంగా ఖండించింది. గుర్రాలు, మోటార్‌సైకిళ్ళపై సాయుధులైన సిబ్బంది, పెప్పర్ స్ప్రే, బాష్పవాయు గోళాలు, తుపాకులతో వచ్చి మొత్తంగా కేంపస్‌లో యుద్ధ వాతావరణం సృష్టించారని, శాంతియుతంగా తమ నిరసన తెలియచేస్తున్న విద్యార్థులపై ఈ రీతిలో అణచివేత చర్యలకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొంది. యుటి ఆస్టిన్ ప్రధాన ఆవరణలో పబ్లిక్ యూనివర్శిటీ ఫర్ గాజా పేరుతో ఒక విద్యా కార్యక్రమాన్ని నిర్వహించాలని పాలస్తీనా సంఘీభావ కమిటీ నిర్ణయించింది. ఇందులో టీచింగ్,, స్టడీ సెషన్లు, ఆర్ట్ వర్క్ షాప్‌లు వున్నాయి.

అంతరిక్షంలో అణ్వాయుధాలపై రగడ

- ఐరాసలో అమెరికా తీర్మానం
- వీటో చేసిన రష్యా, ఓటింగ్‌కు దూరంగా చైనా

న్యూయార్క్: అంతరిక్షంలో అణ్వాయుధాల మోహరింపును నిషేధిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో అమెరికా, బ్రిటన్, జపాన్ బుధవారం రాత్రి ప్రవేశపెట్టిన వివాదాస్పద తీర్మానాన్ని రష్యా వీటో చేసింది. ఓటింగ్‌కు చైనా దూరంగా ఉంది. ఈ తీర్మానానికి అనుకూలంగా భద్రతా మండలిలోని 15 సభ్య దేశాలకు గాను 13 దేశాలు ఓటు వేశాయి. ఒక్క అణ్వాయుధాలనే ఎందుకు, అన్ని రకాల ఆయుధాలపైన నిషేధం ఎందుకు విధించకూడదని రష్యా ప్రశ్నిస్తే అటు నుంచి సమాధానం లేదు. ఇందుకు సంబంధించి రష్యా ప్రతిపాదించిన సవరణను భద్రతా మండలిలో అమెరికాతో సహా ఏడు దేశాలు వ్యతిరేకించాయి. ఒక దేశం గైర్హాజరైంది. దీంతో ఆ సవరణ వీగిపోయింది. మామూలుగా ఏదైనా సవరణ ఆమోదం పొందాలంటే భద్రతా మండలిలో తొమ్మిది దేశాలు ఆమోదం అవసరం. ఈ స్థితిలో రష్యా ఆ తీర్మానాన్ని వీటో చేసింది. అమెరికా, దాని మిత్ర దేశాలు ముందుకు తెచ్చిన ఈ తీర్మానం ' అణ్వాయుధాలు తయారు చేయడం గానీ, అంతరిక్షంలో వాటిని మోహరించడం గానీ ఏ దేశమూ చేయరాదు." అని పేర్కొంటోంది. అమెరికా రాయబారి లిండా థామస్ గ్రీన్ ఫీల్డు ఈ సందర్భంగా 1967 అంతర్జాతీయ ఒప్పందాన్ని గుర్తు చేశారు. ఈ ఒప్పందంలో అమెరికా, రష్యా రెండూ భాగస్వాములుగా ఉన్నాయని అన్నారు. అంతరిక్షంలో అణ్వాయుధాలను మోహరించే ఉద్దేశమేదీ తన ప్రభుత్వానికి లేదని వీటో అనంతరం రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన ప్రకటనను ఆమె ఉదహరిస్తూ, మీరు రూల్స్ పాటించేవారే అయితే ఈ తీర్మానాన్ని ఎందుకు సమర్థించరు? మీరు ఏదో దాస్తున్నారు. అయోమయం సృష్టిస్తున్నారు. ఇది సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. పుతిన్ యాంటీ శాటిలైట్ ఆయుధ సామర్థ్యాన్ని పుతిన్ కలిగి ఉన్నాడని, అయితే అది ఇంతవరకు ఆపరేట్ చేయలేదని ఫిబ్రవరిలో వైట్ హౌస్ పేర్కొన్న విషయాన్ని లిండా థామస్ గుర్తు చేశారు. ఐరాసలో రష్యా రాయబారి వాసిలీ నెంబంజియన్ స్పందిస్తూ అమెరికా తీసుకొచ్చిన తీర్మానం మురికి ఉద్దేశంతోను, రాజకీయంతోనూ కూడినదని విమర్శించారు. అంతరిక్షంలో అన్ని రకాల ఆయుధాలను నిషేధించాలని అమెరికా ఎందుకు కోరడం లేదు అని ఆయన ప్రశ్నించారు.

పబ్లిక్ రైల్వే దిశగా లేబర్ పార్టీ అడుగు

లండన్: రైల్వేలను పునరుద్ధరిస్తామని, ప్రైవేటీకరించబడిన చాలా పరిశ్రమలను ప్రభుత్వ అధీనంలోకి తీసుకొస్తామని బ్రిటన్ లేబర్ పార్టీ వాగ్దానం చేసింది. లేబర్ పార్టీ నాయకుడు, షాడో రవాణా మంత్రి లూయిస్ హై గురువారం నాడిక్కడ మాట్లాడుతూ, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ గెలిస్తే, రైలు ఫ్రాంఛైజీలన్నిటిని ప్రభుత్వ రంగంలోకి తీసుకొస్తామని చెప్పారు. ఆయన ప్రకటనను కార్మిక సంఘాలు, ఉద్యమ కార్యకర్తలు స్వాగతించారు. నీరు, ఇంధన రంగాలను జాతీయం చేసే ప్రణాళికలకు లేబర్ పార్టీలోని మితవాద విభాగం ఇప్పటికీ అడ్డుతగులుతోంది. రైల్వేల ప్రైవేటీకరణ వల్ల ప్రజల పన్నులను, ప్రయాణీకులు చెల్లించే ఛార్జీలు ప్రైవేటు కంపెనీల లాభాలు పెంచడానికి తప్ప రైల్వేల అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడడం లేదని అనుభవంలో గ్రహించారు. ఆర్థిక వ్యవస్థ కూడా తిరోగమనం పట్టింది. దీంతో రైల్వే ప్రైవేటీకరణపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

లోకో పైలట్లు క్రికెట్ చూశారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు

- దర్యాప్తు అధికారులు

చెన్నై : గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో రైలు ప్రమాదం జరిగిన సమయంలో లోకో పైలట్లు క్రికెట్ చూస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. ఈ ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తులో అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చిలో 'లోకో పైలట్, కో-పైలట్ ఇద్దరూ క్రికెట్ చూడ్డం వలన రైలు ప్రమాదం జరిగింది' అని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. లోకోపైలట్ ఎస్ఎంఎస్ రావు, అసిస్టెంట్ లోకో పైలట్ ఎస్ చిరంజీవి (రైలు ప్రమాదంలో ఇద్దరూ మరణించారు) ఉపయోగించిన మొబైల్ ఫోన్లలో డేటా వినియోగంపై పరిశోధన జరిపిన ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపిన రైల్వే సేఫ్టీ కమిషనర్ ప్రంజీవ్ సక్సేనా కూడా తన నివేదికలో లోకో పైలట్లు క్రికెట్ చూస్తున్నారని పేర్కొనలేదు. గత ఏడాది అక్టోబర్ 29న విజయనగరం జిల్లాలో రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 17 మంది మరణించారు. మరో 34 మంది గాయపడ్డారు.

ఈ ఏడాది మార్చి 3న, రైల్వే మంత్రి ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ 'లోకో పైలట్, కో-పైలట్ ఇద్దరూ ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తూ పరధ్యానంలో పడ్డారు. ఇప్పుడు మేము అటువంటి పరధ్యానాన్ని గుర్తించగల వ్యవస్థలను ఇన్‌స్టాల్ చేస్తున్నాము. కాబట్టి ఇప్పుడున్న పైలట్‌లు, అసిస్టెంట్ పైలట్లు రైలును నడపడంపై పూర్తిగా దృష్టి పెట్టాలి' అని అన్నారు.

రైల్వే మంత్రి వ్యాఖ్యలపై వాల్తేరు డివిజన్‌లోని ఒక సీనియర్ అధికారి స్పందిస్తూ 'లోకో పైలట్, అతని సహాయకుడు ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు, డ్యూటీలో ఉన్నప్పుడు క్రికెట్ చూస్తున్నారని ఆరోపిస్తూ రికార్డు చేయడం "తీవ్రమైన" పొరపాటు' అని అన్నారు. 'దీన్ని (రైల్వే మంత్రి ఆరోపణలు) రుజువు చేయడానికి ఇప్పుడు ఎలాంటి ఆధారాలు లేవు. ఇది కేవలం పుకారు మాత్రమే. మేము కారుణ్య ప్రాతిపదికన వారి జీవిత భాగస్వాములకు ఉపాధి కల్పించాము' అని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు.

బిజెపిలోకి తప్పుడు వార్తల యూట్యూబర్

న్యూఢిల్లీ : వివాదాస్పద బీహార్ యూట్యూబర్ త్రిపురారి కుమార్ తివారీ అలియాస్ మనీష్ కశ్యప్ గురువారం బిజెపిలో చేరారు. బిజెపి ఎంపి మనోజ్ తివారీ సమక్షంలో ఆ పార్టీలో చేరిన మనీష్ తరువాత పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను కలుసుకున్నారు. బీహార్‌కు వలస కార్మికులపై తమిళనాడులో దాడులు జరుగుతున్నాయని తప్పుడు వార్తలు యూ ట్యూబ్‌లో పెట్టడంతో కశ్యప్‌ను గత ఏడాది అరెస్టు చేశారు. సుమారు తొమ్మిది నెలల పాటు తమిళనాడు జైల్లో ఉండి, గత ఏడాది డిసెంబరులో బెయిల్‌పై విడుదలయ్యాడు.

తమిళనాడులో బీహార్ వలస కార్మికులపై దాడులు జరుగుతున్నాయని తప్పుడు వార్తలు ప్రసారమవుతున్నప్పుడే.. వాటితో బిజెపికి సంబంధం ఉందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వార్తలను ప్రసారం చేసిన కశ్యప్ ఇప్పుడు బిజెపిలో చేరడంతో ఆ విమర్శలు నిజమేనని స్పష్టమయింది. సోషల్ మీడియా పేరుతో ప్రజల నుంచి అక్రమ వసూళ్లు, పశ్చిమ చంపారన్ జిల్లాలో మహారాణి జానకీ కున్వార్ ఆసుపత్రి ఆవరణలోని కింగ్ ఎడ్వర్డ్ విగ్రహం ధ్వంసం, పోలీసులపై దాడి, పుల్వామా ఉగ్రదాడి తరువాత పాట్నాలోని కాశ్మీరీ దుకాణదారులపై దాడి తదితర కేసులలోనూ పోలీసులు గతంలో కశ్యప్‌ను అరెస్టు చేశారు. బీహార్‌లో 13, తమిళనాడులో తొమ్మిది కేసులు నమోదయ్యాయి. వచ్చే ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కశ్యప్‌ను బిజెపి పోటీలో నిలపనున్నట్లు తెలిసింది.

కుల్గాంలో కిసాన్ మజ్దూర్ మెగా ర్యాలీలో ప్రసంగిస్తున్న తరిగామి

కుల్గాంలో కిసాన్ మజ్దూర్ మెగా ర్యాలీ

కుల్గాం : జమ్ము కాశ్మీర్‌లోని కుల్గాంలో శుక్రవారం కిసాన్ మజ్దూర్ మెగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఎం నాయకులు మహమద్ యూసఫ్ తరిగామి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక మద్దతుతో పోటీ చేస్తున్న ఎన్‌సి అభ్యర్థి మెయిన్ అల్తాఫ్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ ర్యాలీలో డిడిసి కుల్గాం చైర్‌పర్సన్ మహమ్మద్ అఫ్జల్ పారీయ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గులాం నబీ మాలిక్, సిపిఎం జిల్లా కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ రథెర్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు గట్టి దెబ్బ

- ఇవిఎంల కేసులో సుప్రీం తీర్పుపై మోడీ

పాట్నా : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంల) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్‌తోసహా ప్రతిపక్షాలకు గట్టి దెబ్బ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఇవిఎంలపై అవిశ్వాసం సృష్టించేందుకు ప్రయత్నించినందుకు ప్రతిపక్షాలు క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు. శుక్రవారం బీహార్‌లోని అరారియా, ముంగేర్‌ల్లో జరిగిన ఎన్నికల బహిరంగ సభల్లో మోడీ ప్రసంగించారు. కాంగ్రెస్‌తో సహా ఇండియా వేదికలో పార్టీలు ఇవిఎంలపై అవిశ్వాసం సృష్టించేందుకు ప్రయత్నించాయని ఆరోపించారు.

రెండో విడతలో 63 శాతం

(మొదటిపేజీ తరువాయి)

బీటుల్ నియోజకవర్గంలో గురువారమే ఓటింగ్ జరగాల్సి వుంది. అయితే అక్కడ బిఎస్‌పి అభ్యర్థి అశోక్ బలావి మరణించడంతో మే 7న మూడో దశలో పోలింగ్ జరుగుతుంది.

ఓటర్లకు గిఫ్ట్ కూపన్లు

ఈసారి ఎన్నికల్లో పారదర్శకతకు హామీ కల్పించేలా ఇసి చర్యలు తీసుకోలేదని మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి విమర్శించారు. బెంగళూరు రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓటర్లకు క్యూఆర్ కోడ్‌లతో గిఫ్ట్ కూపన్లు పంచారని విమర్శించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న 105ఏళ్ళ వృద్ధురాలు

రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో 105ఏళ్ళ వృద్ధురాలు టిపూ దేవి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఒరిస్సాలో నామినేషన్ల పర్వం ప్రారంభం

మే 20న ఒరిస్సాలో జరగనున్న ఐదు లోక్‌సభ సీట్లకు, 35 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం నామినేషన్ల దాఖలు ప్రారంభమైంది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ మే 3 కాగా, 4న పరిశీలన జరుగుతుంది. 6వ తేదీలోగా నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి వుంటుంది. ఇప్పటివరకు నాలుగు లోక్‌సభా స్థానాలకు 39 నామినేషన్లు దాఖలయ్యాయి. 28 అసెంబ్లీ స్థానాలకు 266 మంది నామినేషన్లు వేశారు.

పార్లమెంట్‌కు తొలిసారిగా ఓటు వేసిన బ్రూ ఓటర్లు

పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా త్రిపురలోని బ్రూ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతేడాది మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఓటు వేశారు. 2020 వరకు ఉత్తర త్రిపుర జిల్లాలోని ఆరు సహాయ శిబిరాల్లో నివసించిన బ్రూ శరణార్థులకు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో శాశ్వత నివాసం కల్పించబడింది.

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థిపై వేటు

సూరత్ లోక్‌సభా స్థానంలో పోటీకి నిలబెట్టిన కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభానిని గుజరాత్ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసింది. ఆరేళ్ళ పాటు ఈ నిషేధం అమల్లో వుంటుంది. ఆయన నామినేషన్ పత్రాలపై తాము సంతకాలు చేయలేదంటూ ముగ్గురు ప్రతిపాదకులు తిరస్కరించడంతో ఆయన నామినేషన్ తిరస్కరించబడింది.

పేదల జీవితాలు ఎందుకు ఇంకా మారలేదు? : మాయావతి

రైతులతో సహా సమాజంలో అణచివేతకు గురైన వారందరికీ మంచి రోజులు తీసుకువస్తామని బిజెపి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బిఎస్‌పి అధ్యక్షురాలు మాయావతి ప్రశ్నించారు. మీకు మంచి రోజులు వస్తాయంటూ పదే పదే ఊరించారని, కానీ ఆ పేదల జీవితాలు ఎందుకు ఇంకా మారలేదని అన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ఐపిఎల్‌లో రికార్డు ఛేదన

262 పరుగుల భారీ లక్ష్యాన్ని ఊదేసిన పంజాబ్ కింగ్స్

- బెయిర్‌స్టో సెంచరీ, ప్రభుసిమ్రన్, శశాంక్ అర్ధసెంచరీలు
- నరైన్, సాల్ట్ విధ్వంసం వృధా
- కోల్‌కతాపై 8వికెట్ల తేడాతో గెలుపు

కోల్‌కతా: ఐపిఎల్‌లో పంజాబ్ జట్టు రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. కోల్‌కతా జట్టు నిర్దేశించిన 262పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ జట్టు మరో 8బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు 261పరుగులు చేసింది. సాల్ట్(75), నరైన్(71) తొలి వికెట్‌కు 10 ఓవర్లలో 138పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ జట్టును ప్రభ్ సిమ్రన్(54), బెయిర్‌స్టో(108నాటౌట్) తొలి వికెట్‌కు 93పరుగులు జతచేశారు. ఆ పరుగులను కేవలం పవర్‌ప్లే(6 ఓవర్లు)లోనే పంజాబ్ జట్టు బ్యాటర్లు సాధించారు. ఆ తర్వాత రూసో(26) విఫలమైనా.. శశాంక్(68నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ దిగిన కోల్‌కతాను ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్(75), సునీల్ నరైన్(71) అర్ధ శతకాలతో చెలరేగి గట్టి పునాది వేశారు. ఈ ఇద్దరూ తమ విశ్వరూపం చూపిస్తూ.. పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. సాల్ట్, నరైన్‌లు ఎడాపెడా బౌండరీలు బాదడంతో 8 ఓవర్లకే స్కోర్ 100 దాటింది. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న నరైన్‌ను.. రాహుల్ చాహర్ వెనక్కి పంపడంతో 138 పరుగుల వద్ద తొలి వికెట్ పడింది. ఆ క్షణం పంజాబ్ జట్టు కాసింత ఊపిరి పీల్చుకుంది. అకాసేపటికే సాల్ట్ వెనుదిరిగినా.. వెంకటేశ్ అయ్యర్(39 నాటౌట్), ఆండ్రూ రస్సెల్(24) మెరుపులతో 16 ఓవర్లకే స్కోర్ 200 మార్క్ దాటింది. అప్పటికే అదిరిపోయిన పంజాబ్ బౌలర్లపై శ్రేయస్ అయ్యర్(28) సునామీలా విరుచుకుపడ్డాడు. సామ్ కరన్ వేసిన 18వ ఓవర్లో వరుసగా 6, 4, 6, 6 బాది కోల్‌కతాకు భారీ స్కోర్ అందించాడు. ఆ తర్వాత రింకూ సింగ్(5), రమన్‌దీప్ సింగ్()లు ధనాధన్ ఆడడంతో కేకేఆర్ రన్స్ కొట్టింది. చివర్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(28) వీరవిహారం చేశాడు. వెంకటేశ్ అయ్యర్(39 నాటౌట్)తో కలిసి ఈడెన్స్‌లో బౌండరీల మోత మోగించాడు. వీళ్లిద్దరూ నాలుగో వికెట్‌కు 43 రన్స్ జోడించారు. దాంతో, పంజాబ్‌కు కోల్‌కతా దాదాపు అసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బెయిర్‌స్టోకు లభించింది.

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా నైట్‌రైడర్స్: సాల్ట్ (బి)సామ్ కర్రన్ 75, నరైన్ (సి)బెయిర్‌స్టో (బి)రాహుల్ చాహర్ 71, వెంకటేశ్ అయ్యర్ (రనౌట్) జితేశ్ శర్మ 39, రస్సెల్ (సి)హర్షల్ పటేల్ (బి)ఆర్ష్‌దీప్ సింగ్ 24, శ్రేయస్ అయ్యర్ (సి)రబడా (బి)ఆర్ష్‌దీప్ 28, రింకు సింగ్ (సి)అషుతోష్ శర్మ (బి)హర్షల్ పటేల్ 5, రమన్‌దీప్ సింగ్ (నాటౌట్) 6, అదనం 13. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 261పరుగులు.

వికెట్ల పతనం: 1/138, 2/163, 3/203, 4/246, 5/253, 6/261

బౌలింగ్: సామ్ కర్రన్ 4-0-60-1, ఆర్ష్‌దీప్ సింగ్ 4-0-45-2, హర్షల్ పటేల్ 3-0-48-1, రబడా 3-0-52-0, రాహుల్ చాహర్ 4-0-33-1, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-21-0

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభుసిమ్రన్ (రనౌట్) నరైన్ 54, బెయిర్‌స్టో (నాటౌట్) 108, రూసో (సి)శ్రేయస్ (బి)నరైన్ 26, శశాంక్ (నాటౌట్) 68, అదనం 6. (20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 262పరుగులు.

వికెట్ల పతనం: 1/93, 2/178

బౌలింగ్: ఛమీర 3-0-48-0, హర్షిత్ రాణా 4-0-61-0, అనుకుల్ రాయ్ 2-0-36-0, నరైన్ 4-0-24-1, చక్రవర్తి 3-0-46-0, రస్సెల్ 2-0-36-0, రమణ్ దీప్ సింగ్ 0.4-0-9-0

ఐపిఎల్‌లో నేడు

ఢిల్లీ × ముంబయి (వేదిక: ఢిల్లీ; మ.3.30గంIIలకు)
లక్నో × రాజస్తాన్ (వేదిక: లక్నో; రా.7.30గంIIలకు)

నేత్రకు పారిస్ ఒలింపిక్ బెర్త్

పారిస్: ఒలింపిక్ క్వాలిఫికేషన్ రెగట్టా పోటీల్లో భారత మహిళా సెయిలర్ నేత్ర కుమ్మనన్ పారిస్ ఒలింపిక్ బెర్త్ దక్కించుకుంది. శుక్రవారం జరిగిన ఎమర్జింగ్ నేషనల్స్ ప్రోగ్రామ్(ఇఎన్‌పి) పోటీల్లో నేత్ర 67నెట్ పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత కోటాలోనూ అత్యుత్మ ప్రదర్శన కనబరిచింది. టోక్యో ఒలింపిక్స్‌లోనూ నేత్ర మహిళల డింగీ(ఐఎల్‌సిఏ-6)లో ప్రాతినిధ్యం వహించింది. దీంతో భారత్‌నుంచి సెయిలింగ్‌కు అర్హత సాధించిన రెండో అథ్లెట్‌గా ఈమె నిలిచింది. ఈ పోటీల్లో ఆరుసార్లు ఒలింపిక్ ఛాంపియన్ టటినా డ్రోజ్గోవ్(59నెట్ పాయింట్లు) వ్యక్తిగత కోటాలో పోటీపడి నాల్గోస్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు ఇవే చివరి రెగట్టా పోటీలు.

కాంపౌండ్ మిక్స్‌డ్ ఫైనల్లో భారత్

దీపికకు పతకం ఖాయం • ఆర్చరీ ప్రపంచకప్

షాంఘై: కాంపౌండ్ ఆర్చరీ మిక్స్‌డ్ ఫైనల్‌కు భారత జట్టు దూసు కెళ్లింది. షాంఘై వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో స్టార్ ఆర్చర్లు అభిషేక్ వర్మ, జ్యోతి సురేఖలతో కూడిన భారత మిక్స్‌డ్ బృందం.. 155-151 పాయింట్ల తేడాతో మెక్సి కో జంటను చిత్తుచేశారు. ప్రపంచ 2వ ర్యాంక్ ఆర్చర్లయిన వీరు కొరియాపై తొలి మూడు గేమ్‌లు ముగిసేసరికి 3పాయింట్ల ఆధిక్యతను సంపాదించారు. నాల్గో గేమ్‌లో 40కి 40పాయింట్లు సాధించడంతో భారత బృందానికి మరో పాయింట్ జత అయ్యింది.

కాంస్యానికి రికర్వ్ మిక్స్‌డ్ జట్టు..

4వ సీడ్‌గా బరిలోకి భారత రికర్వు మిక్స్‌డ్ జట్టు సెమీస్‌లో ఓడి కాంస్య పతకానికి సిద్ధమైంది. శుక్రవారం జరిగిన సెమీస్‌లో అంకిత భకత్, ధీరజ్ బొమ్మదేవర జోడీ 0-6 పాయింట్లతో కొరియా చేతిలో ఓడింది. ఏకపక్షంగా సాగిన ఈ పోటీలో భారత జంట 0-6(38-39, 35-36, 36-38)తో ఓటమిపాలైంది. కాంస్య పతకానికి మెక్సికోతో తలపడనుంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో భారత జంట 5-1తో ఇటలీని చిత్తుచేసి సెమీస్‌కు చేరింది.

సెమీస్‌కు దీపిక కుమారి

మహిళల రికర్వు వ్యక్తిగత విభాగంలో దీపిక కుమారి సెమీస్‌కు చేరి మరో పతకం ఖాయం చేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో దీపిక కుమారి 6-4(27-28, 27-27, 29-28, 29-27, 28-28) తేడాతో కొరియాకు చెందిన జియోన్‌పై విజయం సాధించింది. సెమీస్‌కు చేరడంతో దీపిక కుమారికి పతకం ఖాయమైంది. దీపిక 30వ సీడ్ ఈ టోర్నీకి అర్హత సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన క్వార్టర్స్‌లో దీపిక కుమారి ఓ దశలో 1-3తో వెనుకబడింది. ఆ తర్వాత వరుస గేమ్‌లలో విజయం సాధించి సెమీస్‌కు చేరడం విశేషం.



'సారథి'లో మరిన్ని సదుపాయాలు

అలనాటి సినిమాలు మొదలుకుని, నేటి సినిమాల వరకు ఎన్నెన్నో సినిమాల షూటింగులు నిర్వహించిన శ్రీ సారథీ స్టూడియోస్‌లో తాజాగా అధునాతన డాల్బీ మిక్సింగ్, సౌండ్ డిజైన్ స్టూడియోలను ప్రారంభించారు. శుక్రవారం పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో డాల్బీ మిక్సింగ్ స్టూడియోను ఎం.ఎం.కీరవాణి ప్రారంభించారు. సౌండ్ డిజైన్ స్టూడియోను సినీ సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సారథీ స్టూడియోస్ చైర్మన్ ఎం.ఎస్ ఆర్.వి. ప్రసాద్ మాట్లాడుతూ... 'గతంలో ఈ స్టూడియోను మల్టీప్లెక్స్ థియేటర్స్‌గా మార్చాలన్న ఆలోచన చేసి, ఆ తర్వాత విరమించుకున్నాం. సినీ స్టూడియోస్ గానే కొనసాగించాలని నిర్ణయించుకున్న అనంతరం షూటింగులకు కావలసిన అన్ని రకాల హంగులు, నేటి కాలానికి పోటీపడే విధంగా పోస్ట్ ప్రొడక్షన్స్‌కు కావలసిన అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చాం. మా స్టూడియోలో షూటింగ్ ప్రారంభిస్తే, పోస్ట్ ప్రొడక్షన్స్‌తో సహా సినిమా మొదటి కాపీని సిద్ధం చేసుకునేంతవరకు కావలసిన ఎక్విప్‌మెంట్ అంతా ఉంది.' అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు కె.ఎస్.రామారావు, కె.ఎల్.నారాయణ, రచయిత విజయేంద్రప్రసాద్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దామోదర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే సాగర్ 'ది 100' టీజర్ విడుదల

బుల్లితెర నటుడు ఆర్కే సాగర్ ప్రధాన పాత్రలో 'ది 100' అనే చిత్రం తెరకెక్కుతోంది. మిషా నారంగ్ హీరోయిన్‌గా చేస్తున్నారు. రాఘవ్ ఓంకార్ శశిధర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. క్రియా ఫిల్మ్ కార్ప్, దమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై రమేష్ కరుటూరి, వెంకీ పూశడపు, జె తారక్ రామ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ని చిత్రబృందం విడుదల చేసింది. చిరంజీవి తల్లి కొణిదెల అంజనా దేవి ఈ టీజర్‌ని లాంచ్ చేశారు. ఈ చిత్రంలో ధన్య బాలకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్యామ్ కె నాయుడు కెమెరామెన్ కాగా, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

బయోపిక్‌లో జ్యోతిక

బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'శ్రీకాంత్'. ఇది తెలుగువాడి బయోపిక్. అంధుడైన శ్రీకాంత్ బొల్ల వ్యాపారవేత్తగా ఎలా ఎదిగాడన్నది సినిమాలో చూపించనున్నారు. ఈ మూవీలో శ్రీకాంత్ టీచర్ పాత్రలో నటించేందుకు జ్యోతిక మొదట్లో అస్సలు ఒప్పుకోలేదు. సూర్య నచ్చజెబితే అప్పుడు ఒప్పుకున్నారు. ఈ విషయాన్ని డైరెక్టర్ తుషార్ హీరానందని వెల్లడించాడు.

రావణుడి పాత్రలో యశ్



బాలీవుడ్ డైరెక్టర్ నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న చిత్రం 'రామాయణం'. ఈ చిత్ర షూటింగ్ ఇటీవలే మొదలైంది. ఈ చిత్రంలో రణ్‌బీర్‌కపూర్, సాయి పల్లవి నటిస్తున్నారు. ఈ చిత్రంలో రావణుడి పాత్రలో కేజీఎఫ్ స్టార్ యశ్ కనిపించనున్నారు. ఈ సినిమాలో రావణుడి పాత్ర కోసం యశ్ ఇప్పటికే కసరత్తులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆ పాత్ర కోసం 15 కిలోల బరువు పెరగనున్నట్లు తాజా సమాచారం. ఈ మూవీ తర్వాత కేజీఎఫ్-3లో యశ్ నటించనున్నారు. ప్రస్తుతం 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. ఆ సినిమా పూర్తయ్యాకే 'రామాయణం' సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఈ చిత్రంలో సాయి పల్లవి సీతగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తారని సమాచారం.

'ఆ ఒక్కటీ అడక్కు' సెకండ్ సింగిల్

అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం మే 3న విడుదల కానుంది. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మాణంలో ఈ చిత్రం తెరకెక్కింది. నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'హమ్మమ్మో'ను విడుదల చేశారు, ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు. యశస్వి కొండేపూడి ఆలపించారు. వెన్నెల కిషోర్, జామీ లీవర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ తదితరులు ఈ చిత్రంలో కనిపించనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

డెయిరీ కాలుష్యంతో ప్రజల అవస్థలు

డెయిరీలో మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌లోని బాయిలర్స్

- పలువురు కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులతో సతమతం
- 30 వేల మందిపై తీవ్ర ప్రభావం
- సొంతిళ్లను సైతం వదిలిపోతున్న పరిసర వాసులు
- నోరెత్తని టిడిపి, వైసిపి
- కాలుష్య నియంత్రణకు ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం

విశాఖ డెయిరీ కాలుష్యం గాజువాక నియోజకవర్గ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వందల మంది కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారు. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఆ విషయాన్నే విస్మరించడంతో కాలుష్య సమస్య ప్రజల ప్రాణాలు తీస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీల్లో సిపిఎం మాత్రమే ప్రజల పక్షాన కాలుష్య సమస్యపై పోరాడుతోంది.

ప్రజాశక్తి -గాజువాక

సమీకృత ఆహారం పాలు.. పాలు, పాల పదార్థాలను తింటే ఆరోగ్యానికి మంచిదనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆ పాలను ప్యాకెట్లలో నిల్వ ఉంచేందుకు, వివిధ ఆహార పదార్థాలుగా మార్చేందుకు నిర్వహించే ప్రాసెసింగ్ ప్రక్రియలో వెలువడే నీటి, వాయు కాలుష్యంతో డెయిరీ ప్లాంట్ పరిసర ప్రాంతాల వాసులు నానా అవస్థలకు, అనారోగ్య సమస్యలకు గురవుతూ ఇక్కట్లు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సొంతిళ్లను సైతం వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి అద్దెకు ఉంటున్నారంటే ఇక్కడ ఎంతగా కాలుష్యం వెలువడుతుందో ఇట్టే అర్థమౌతుంది. విశాఖ డెయిరీ కాలుష్యంతో జనం పడుతున్న ఇక్కట్లను దాని యాజమాన్యంగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో జివిఎంసి 68వ వార్డులో దాదాపు 30 ఏళ్ల క్రితం విశాఖ డెయిరీని నెలకొల్పారు. మొదట్లో వేల నుంచి లక్ష లీటర్ల వరకు పాల సేకరణ చేపట్టి, వాటిని ప్రాసెసింగ్ చేసేవారు. అయితే అప్పట్లో అంతగా కాలుష్యం వెలువడేది కాదు. కాలక్రమేణా విశాఖ డెయిరీ ప్లాంట్ విస్తరణ చేపడుతూ నేడు రోజుకు 9 లక్షల లీటర్ల వరకుపాలను సేకరిస్తోంది. ఈ పాల ప్రాసెసింగ్ ప్రక్రియలో భాగంగా 75 డిగ్రీల సెంటిగ్రేట్ వద్ద వీటిని వేడి చేయాలి. దీనికోసం రెండు బొగ్గు బాయిలర్లు, మరో రెండు ఫర్నేస్ ఆయిల్‌తో నడిచే బాయిలర్స్‌ను నెలకొల్పారు.

ఆయిల్ ధర ఎక్కువగా ఉండడంతో సంబంధిత బాయిలర్స్ నిర్వహణా వ్యయం ఎక్కువ కావడంతో ఎక్కువగా బొగ్గు బాయిలర్స్‌పైనే ప్రాసెసింగ్ చేస్తున్నారు. దీనికోసం రోజుకు టన్నున్నర వరకు బొగ్గు అవసరమౌతున్నట్లు సమాచారం. దీంతో నాణ్యమైన బొగ్గు ధర, సేకరణ కొంత భారంతో కూడుకుని ఉండడంతో నాసిరకం బొగ్గును కొనుగోలు చేసి వాడుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఉదయంపూట బొగ్గు బాయిలర్స్‌ను వినియోగించడంతో వెలువడే పొగ, కాలుష్యం వల్ల ఇబ్బందులు పడ్డ పరిసర ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు పెరగడంతో, ఇప్పుడు రాత్రి సమయంలో బొగ్గును వినియోగిస్తున్నారు.

నాసిరకం బొగ్గుతో తీవ్రమైన దుమ్ము, పొగ కాలుష్యం

పాల ప్రాసెసింగ్ చేసే బాయిలర్స్‌లో నాసిరకం బొగ్గును వినియోగించడం వల్ల, విపరీతమైన దుమ్ము చెలరేగి, పరిసర అక్కిరెడ్డిపాలెం, సింగపూర్ కాలనీ, రాంనగర్, పంచవటి కాలనీ, మింది తదితర ప్రాంతాల్లో బొగ్గు ధూళి జనాలను ఇబ్బందుకు గురిచేస్తోంది. మరోవైపు పొగ కాలుష్యంతో వాటిని పీల్చిన జనాలు అనారోగ్యం పాలౌతున్నారు. ఊపిరితిత్తులు కేన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోపాటు కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌తో ఇద్దరు మహిళలు మృతి చెందారని, ఇంకా ఎందరో అస్వస్థతకు గురై అవస్థలు పడుతున్నారని స్థానికులు చెప్పుకొచ్చారు.

వ్యర్థజలాలతో భూగర్భం విషతుల్యం

డెయిరీలో సేకరించిన పాలను వేడి చేయడానికి ఎస్‌ఎస్ పైప్‌లైన్స్ కూడా ఉపయోగిస్తారు. ప్రాసెసింగ్ తర్వాత ఆ పైప్‌లైన్లు శుభ్రం చేయడానికి కాస్టిక్ సోడా, సిట్రిక్ యాసిడ్‌ను వినియోగిస్తుండడంతో తర్వాత వచ్చే వ్యర్థజలాలను డెయిరీ వెనక భాగంలో ఉన్న కాలువలోని చిన్న రంధ్రం ద్వారా దొడ్డిదారిన విడిచిపెడుతున్నారు. ఈ కాలువ అక్కిరెడ్డిపాలెం మీదుగా పంచవటి వరకు ప్రవహిస్తుడడంతో దీని ప్రభావంతో అక్కిరెడ్డిపాలెం, సింగపూర్ కాలనీ, పంచవటి కాలనీ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు తాగడానికి వాడిన ఈ ప్రాంత జలాలను ఇపుడు బట్టలు ఉతుక్కోవడానికి కూడా పనికి రానంతగా కాలుష్యమయం అయ్యాయంటే, ఎంతగా ఇక్కడ భూగర్భం విషతుల్యమైందో అవగతం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తాగడానికి, వంటకు నీటిని కొనుక్కోక తప్పని పరిస్థితులున్నాయి. అంతేకాక ఈ వ్యర్థజలాలు, పొగ కాలుష్యంతో తీవ్రమైన దుర్వాసన వెలువడి రాత్రి వేళల్లో వాటి గాఢత వల్ల నిద్ర కూడా పట్టడం లేదని విశాఖ డెయిరీ పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ముక్కుపుటాలను అదరగొట్టే దుర్వాసన తమను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని ఆవేదన చెందుతున్నారు.

ప్రజల గోడు పట్టని ప్రజాప్రతినిధులు, పాలకులు

విశాఖ డెయిరీ కాలుష్య సమస్యపై నాటి ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి నుండినేటి ఎమ్మెల్యే నాగిరెడ్డి వరకు మొత్తంగా టిడిపి, వైసిపిలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు మారినప్పటికీ, డెయిరీ కాలుష్యంపై వీరెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆయా పార్టీలు అపుడు, ఇపుడు, ఎప్పుడూ డెయిరీ యాజమాన్యానికి వత్తాసు పలికేలా వ్యవహరించాయే తప్ప, ప్రజల పక్షాన ఆలోచించిన పాపాన పోలేదు.

అసెంబ్లీలో ప్రస్తావించిన నాటి సిపిఎం ఎమ్మెల్యే గఫూర్

విశాఖ డెయిరీ కాలుష్యంతో ఇక్కడి ప్రజలు పడుతున్న కష్టాలపై రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సిపిఎం ఎమ్మెల్యే గఫూర్ అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. 2005లో ప్రభుత్వం నియమించిన శాసనసభా కమిటీ విశాఖ డెయిరీని సందర్శించి, కాలుష్యంపై నిర్ధారణకు వచ్చింది.

డెయిరీ వ్యర్థజలాలను నిల్వ ఉంచడం గానీ, బయట కాలువల్లోకి విడిచిపెట్టకుండా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి, నేరుగా సముద్రంలోకి వెళ్లేలా చూడాలని అప్పట్లో శాసన సభ కమిటీ సిఫార్సు చేసింది. అయితే కమిటీ సూచనలను యాజమాన్యం పెడచెవిన పెట్టింది. తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన అనేక ఆందోళనల ఫలితంగా ఉదయం పూట బొగ్గు బాయిలర్ల వాడకం తగ్గించి మభ్యపెట్టేలా డెయిరీ యాజమాన్యం వ్యవహరించిందే తప్ప, అసలు సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆందోళనలు చేపట్టిన సిపిఎం, ప్రజాసంఘాలు

విశాఖ డెయిరీ కాలుష్యంతో సుమారు 30 వేల మంది ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సిపిఎం మాత్రమే పాదయాత్రలు పోరాటాలు, ధర్నాలు, ఇతరత్రా ఆందోళనలు చేపట్టింది. ఈ సందర్భంగా డెయిరీ యాజమాన్యం ప్రోద్బలంతో పోలీసుల ఆందోళన చేసిన సిపిఎం శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రజల పక్షాన సిపిఎం మాత్రమే పోరాటాలు చేసిన విషయాన్ని ఇప్పటికీ ఇక్కడి వారు గుర్తుచేసుకుంటారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

- నామినేషన్ పరిశీలన కేంద్రం వద్ద టిడిపి, వైసిపి కవ్వింపు చర్యలు
- పోలీసుల అప్రమత్తతతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్ దరఖాస్తుల పరిశీలన నేపథ్యంలో వైసిపి, టిడిపి కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు అప్రమత్తమై ఇరుపార్టీల నేతలకు సర్ధి చెప్పి అక్కడి నుంచి పంపివేయడంతో సమస్య సర్ధుమణిగింది. ఎన్నికల నియామవళిలో భాగంగా శుక్రవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం వద్ద నామినేషన్ దరఖాస్తుల పరిశీలనను అధికారులు చేపట్టారు. తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 28 నామినేషన్లు దాఖలు కాగా వాటి పరిశీలన నేపథ్యంలో దరఖాస్తుదారులు కార్యాలయంలోకి వెళ్లారు. వైసిపికి చెందిన పల్లె వినోద్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో పరిశీల కార్యక్రమానికి తనను బలపరుస్తున్న గంగులకుంట కేశవరెడ్డి, అనిల్‌యాదవ్‌తో కలిసి వెళ్లారు. వారితోపాటు ప్రభాకర్ అనే వ్యక్తి లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అనుమతించలేదు. ఆ సమయంలో అక్కడే ఉన్న టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నినాదాలు వ్యతిరేకిస్తూ అక్కడే ఉన్న వైసిపి కార్యకర్తలూ నినాదాలు చేశారు. ఒకరిని ఒకరు కవ్వించుకుంటూ నినాదాలు చేయడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. ఇరు పార్టీల కార్యకర్తలకు సర్ధిచెప్పి అక్కడి నుంచి పంపించారు. దీంతో సమస్య సర్ధుమణిగింది.

కేజీ నిమ్మ రూ.120

ప్రజాశక్తి- డక్కిలి

ధర ఉంటే కాయ ఉండదు... కాయ ఉంటే ధర ఉండదు... ఈ చేదు నిజం రైతు గుండెల్ని పిండిచేస్తోంది. తిరుపతి జిల్లా డక్కిలి మండలంలో సుమారు మూడు వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో నిమ్మ ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో నిమ్మ సాగు చేసే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వెంకటగిరి , గూడూరు నిమ్మ మార్కెట్లలో నిమ్మకాయలు కేజీ ధర నాణ్యతను బట్టి రూ 60 నుంచి రూ 120 వరకు పలికింది. మండలంలో నిమ్మ సాగు చేసే రైతులు తమ దిగుబడులను గూడూరు , వెంకటగిరి నిమ్మ మార్కెట్లకు తరలిస్తుంటారు. సాధారణంగా నిమ్మ ధరలు మార్చి ,ఏప్రిల్ , మే, మాసాల్లో ఆశాజనకంగా ఉంటాయి. అయితే గత నెల చివరి వారంలో హోలీ పండుగ నేపథ్యంలో ధరలు తగ్గి 20 రోజులుగా అంతంత మాత్రంగానే ఉన్నాయి. నాలుగు రోజులుగా ధరలు రోజురోజుకూ పెరిగి శుక్రవారం మంచి నాణ్యత కలిగిన నిమ్మకాయలు కేజీ రూ 120 పలికింది. ఈ ప్రాంతం నుంచి 40 కేజీల బస్తాల చొప్పున గూడూరు, వెంకటగిరి నిమ్మ మార్కెట్లకు తమ దిగుబడులను ఎగుమతి చేస్తుంటారు. ఒక్కొక్క బస్తా రూ ఐదు వేల వరకు రావడంతో రైతులకు పెరిగిన ధరలు ఊరటనిస్తున్నాయి.

రికార్డు స్థాయికి వర్జీనియా ధర

ప్రజాశక్తి - గోపాలపురం (తూర్పు గోదావరి)

మునుపెన్నడూ లేని విధంగా వర్జీనియా పొగాకుకు రికార్డు స్థాయిలో ధర పలికింది. దేవరపల్లి కొనుగోలు కేంద్రంలో కేజీ రూ.307కు అమ్ముడైంది. దీంతో పొగాకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోపాలపురం టొబాకో బోర్డు రైతులు వేలం కేంద్రానికి 1210 బేళ్లు అమ్మకానికి పెట్టుకోగా 1044 బేళ్ల కొనుగోలు జరిగింది. అత్యధిక రేటు రూ.324 కాగా అత్యల్ప ధర రూ.235 పలికింది. సరాసరిన రూ.303.94 గిట్టుబాటు ధర లభించింది. ఈ ఏడాది కొనుగోళ్ల ప్రారంభంలో కేజీ పొగాకు రూ.240 ధర పలికింది. దీంతో రైతులు నిరాశ చెందారు. వేలంకేంద్రంకు బేళ్లను సైతం రైతులు తీసుకొచ్చేందుకు విముఖత వ్యక్తం చేశారు. ఈ ఏడాది తుపాను కారణంగా వర్జీనియా పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో రైతులు దెబ్బతిన్న పంట స్థానంలో రెండోసారి పంటవేయాల్సి వచ్చింది. అంతర్జాతీయంగా పొగాకు పంట ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో స్థానికంగా ఉన్న విదేశీ దేశీయ పొగాకుకు డిమాండ్ పెరిగింది. అందుకు అనుగుణంగా ఎగుమతుల ఆర్డర్లు కూడా రావడంతో వర్జీనియా ధర రికార్డు స్థాయికి చేరింది. దేవరపల్లి వేలం కేంద్రానికి 1033 బేళ్లు అమ్మకానికి రాగా వాటిలో 837 కొనుగోల చేసినట్లు తెలిపారు .అత్యధిక ధర రూ.327 పలకగా అత్యల్ప ధర రూ.238 చొప్పున కొనుగోలు చేశారు. సరాసరి రూ.301.82 ధర పలికింది.15 కంపెనీలు వేలంలో పాల్గొన్నట్లు మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, ఆక్షన్ సూపరింటెండెంట్ అమూల్ డి,శ్యామ్ తెలిపారు. ఐటిసి బైరు, ఆదర్శ్, జిపిఐ, తిరపతి రెడ్డి, పోలిశెట్టి కంపెనీ శ్రీనివాసరావు, ముస్తఫా కంపెనీ కొడమంచిలి శ్రీనివాసరావు, ఎలైట్ సురేంద్ర రాజు, డెక్కన్, నాగరాజు, అలెన్స్ సుబ్బారావు, బొమ్మిడాల రెహమాన్ పాల్గొన్నారు.

నిజం తప్పకుండా బయటకు వస్తుంది

- ప్రత్యర్థులతో చేతులు కలిపితే జగన్ ఎలా మద్దతు ఇస్తారు?
- వివేకా భార్య లేఖకు అవినాష్ తల్లి ప్రతి లేఖ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జగన్ ప్రత్యర్థుల కుట్ర నుంచి ఇప్పటికైనా మీ కుమార్తె సునీత, షర్మిల బయటకు వచ్చి న్యాయపోరాటం చేయాలి, మీరు చేస్తున్న ఆరోపణల వల్ల బాధపడుతున్న వారి వేదనను అర్థం చేసుకోండి... నిజం తప్పకుండా బయటకు వస్తుందని ఎంపి అవినాష్ తల్లి లక్ష్మి అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం వివేకా సతీమణి రాసిన లేఖకు అవినాష్ తల్లి శుక్రవారం ప్రతి లేఖ రాశారు. 2009లో తండ్రిని కోల్పోయినప్పుడు జగన్ ఎంత బాధపడ్డాడో ఇప్పుడు గుర్తొస్తోందా? 2010లో కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను చిన్నచూపు చూసినప్పుడు పెద్దదిక్కుగా నిలవాల్సిన మీరందరూ ఎక్కడున్నారు? మీరందరూ మీ స్వార్థం మీరు చూసుకుని జగన్‌ను ఒంటరివాడిని చేసినప్పుడు అతడి మనోవేదన గుర్తుకురాలేదా? అని నిలదీశారు. 2011లో విజయమ్మపై వివేకాను పోటీ చేయించినప్పుడు జగన్ మనోవేదన గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకున్నది ఎంత వాస్తవమో, 2019 మార్చి 14వ తేదీ రాత్రి అవినాశ్‌రెడ్డిని ఎంపిగా గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో వివేకా పాల్గొనడం కూడా అంతే వాస్తవమని వివరించారు. ఈ విషయం మీ కుమార్తె సునీత కూడా వెల్లడించిందని, కానీ ఇప్పుడు మాట మార్చుతూ ఎంపి టికెట్ కోసమే హత్య జరిగిందని అంటున్నారని మండిపడ్డారు. వైఎస్ఆర్, జగన్ ప్రత్యర్థులతో మీ కుమార్తె చేతులు కలిపి వారి చేతుల్లో పావుగా మారితే జగన్ మీకు ఏ విధంగా మద్దతు ఇస్తారు? ఏ మాత్రమూ సంబంధం లేని వాళ్లను ఈ కేసులో ఇరికించాలని ప్రయత్నిస్తుంటే జగన్ మీకు మద్దతు ఇవ్వాలా? అని ప్రశ్నించారు. హత్యకు కారకులు మీతోనే ఉన్నారు... దొంగే దొంగను పట్టుకోమంటే దొంగ ఎప్పటికి దొరుకుతాడు? కోర్టులో కేసు నడుస్తుంటే, హంతకుడు అంటూ మీరే మాట్లాడతారు అంటూ లేఖలో పేర్కొన్నారు.

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం రోడ్డు - తిరుపతి, కొచ్చువేలి - బరౌని - కొచ్చువేలి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు 07440 తిరుపతి - శ్రీకాకుళం రోడ్ స్పెషల్ మే 5, 12 తేదీల్లో రాత్రి 20.05 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 08.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 07441 శ్రీకాకుళం రోడ్డు -తిరుపతి ప్రత్యేక రైలు మే 06, 13 తేదీలలో మధ్యాహ్నం 15.00 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి సాయంత్రం 18:38 గంటలకు దువ్వాడ చేరుకుని 18.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరుపతి, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా ప్రయాణిస్తాయి.

టొయోటా నుంచి టి గ్లోస్

బెంగళూరు : టొయోటా కొత్తగా కార్ కేర్ బ్రాండ్ 'టి గ్లోస్'ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ బ్రాండ్ క్రింద వాహనం రూపాన్ని లోపల, వెలుపల మెరుగుపరచడానికి క్యూరేటెడ్ సేవలను అందిస్తుందని తెలిపింది. దేశంలోని వినియోగదారులలో అధిక నాణ్యత, విశ్వసనీయమైన కార్ డిటైలింగ్ సేవలకు వేగంగా పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో మే ఒక్కటో తేది నుంచి దీన్ని అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొంది. కస్టమర్లు తమ కారుకు ఇంటీరియర్ ఎన్‌రిచ్‌మెంట్, ఎక్స్‌టీరియర్ బ్యూటిఫికేషన్‌సమగ్ర సేవలను పొందవచ్చని తెలిపింది.

ఒత్తిడి చేస్తే వాట్సాప్ సేవలు బంద్..!

- వినియోగదారుల గోప్యతకు భంగం కలిగించలేం
- 4(2) సెక్షన్ రాజ్యాంగ విరుద్ధం
- ఢిల్లీ హైకోర్టుకు మెటా వెల్లడి

న్యూఢిల్లీ : వినియోగదారుల గోప్యతకు భంగం కలిగించలేమని వాట్సాప్ యాప్ మాతృసంస్థ మెటా స్పష్టం చేసింది. మోడీ సర్కార్ 2021లో తీసుకువచ్చిన ఐటి నిబంధనలను సవాల్ చేస్తూ వాట్సాప్, మెటా కంపెనీలు గతంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఆయా పిటిషన్లపై గురువారం ఢిల్లీ కోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరీపై మెటా ధీటుగా సమాధానం చెప్పింది. మెసేజ్‌ల ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విషయంలో బలవంతం చేస్తే భారత్‌ను వీడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. వినియోగదారుల సమాచారానికి గోప్యత లేకుండా కేంద్ర ఐటి శాఖ ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ పేరిట మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపింది.

కొత్త ఐటి నిబంధనలు-2021లోని 4(2) సెక్షన్ ప్రకారం.. సోషల్ మీడియాలో ఏదైనా మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది.. ఎవరు ఎవరికి పంపారనే వివరాలు ప్రభుత్వం అడిగిన సమయంలో ఇవ్వాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వ వైఖరిని వాట్సాప్ కంపెనీ సవాలు చేస్తోంది. ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ కుదరదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఏ సమాచారం కోరుతుందో ముందుగానే తెలియదని.. కోరిన సమయంలో డీక్రిప్ట్ చేయడానికి కోట్లాది సందేశాలను ఏళ్ల తరబడిగా భద్రపర్చాల్సి ఉంటుందని కోర్టుకు తెలిపింది. "ఈ 4(2) సెక్షన్ నిబంధన వ్యక్తుల గోప్యతకు వ్యతిరేకం. రాజ్యాంగ విరుద్ధం. సామాజిక మాధ్యమ సంస్థలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే దీన్ని ప్రవేశపెట్టారు. దీని వల్ల మేం కోట్లాది మెసేజ్‌లను కొన్నేళ్ల పాటు భద్రపర్చాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధన ప్రపంచంలో ఎక్కడా లేదు" అని వాట్సప్ తరపు న్యాయవాదులు వాధించారు.

ప్రస్తుతం ఇలాంటి చట్టం మరే దేశంలోనైనా అమలులో ఉందా? అన్న ప్రశ్నకు బ్రెజిల్ లాంటి దేశాల్లో సైతం ఈ రూల్స్ లేవని మెటా తరపున న్యాయవాదులు తెలిపారు. ఎన్‌క్రిప్షన్ ఫీచర్ విషయంలో రాజీ పడితే భారత రాజ్యాంగం ప్రకారం వినియోగదారుల గోప్యతా హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుందని వాధించింది. గోప్యత అనేది ప్రాథమిక హక్కు అని వాట్సాప్ నమ్ముతుందని, బలమైన ఎన్‌క్రిప్షన్ స్టాండర్డ్స్‌తో ఆ హక్కులను కాపాడటానికి ప్రయత్నిస్తున్నామని తెలిపింది. వాట్సాప్ ఇతర దేశాలలో కూడా ఇలాంటి డిమాండ్లను ఎదుర్కొంది. కానీ ఎన్క్రిప్షన్ పట్ల కంపెనీ వైఖరిపై స్థిరంగా ఉంది. వినియోగదారుల నమ్మకాన్ని కాపాడుకోవడానికి, అనధికారిక యాక్సెస్ నుంచి సెన్సిటివ్ ఇన్‌ఫర్మేషన్‌ను రక్షించడానికి ఎన్‌క్రిప్షన్ స్టాండర్డ్స్ కీలకమని భావిస్తోంది. వాస్తవానికి వాట్సాప్ బాగా గుర్తింపు పొందడానికి సెక్యూరిటీనే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలోనే తమ వేదికలో మెసేజ్‌లకు ఉన్న ఎన్‌క్రిప్షన్ విధానాన్ని తొలగించాలని చెబితే తాము భారత్ నుంచి తాము వెళ్లిపోతామని.. సేవలను నిలిపివేస్తామని వెల్లడించింది. దీనిపై వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది.

సిపి రవిశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

గాలి జనార్ధన్ రెడ్డి నుంచి ప్రాణహాని

- విశాఖ సిపికి సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ఫిర్యాదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

కర్ణాటక బిజెపి నేత గాలి జనార్ధన్‌రెడ్డి నుంచి తనకు ప్రాణ హాని ఉందని, ఈ నేపథ్యంలో తనకు రక్షణ కల్పించాలని కోరుతూ విశాఖ సిపి డాక్టర్ ఎ.రవిశంకర్‌ను సిబిఐ మాజీ జెడి, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం సిపి కార్యాలయానికి లక్ష్మీనారాయణ వెళ్లి వినతిపత్రం అందజేశారు. గతంలో జనార్ధన్‌రెడ్డిని అక్రమ మైనింగ్ వ్యవహారాల కేసులో అరెస్టు చేసినందుకు విశాఖలో తనను అంతమొందించేందుకు కుట్ర జరుగుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2011లో అక్రమ మైనింగ్ కేసులో బళ్లారిలో గాలి జనార్ధన్‌రెడ్డిని తాను అరెస్టు చేసిన విషయాన్ని అందులో పొందుపరిచారు. విశాఖ ఉత్తరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జై భారత్ నేషనల్ పార్టీ తరఫున తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ప్రచారంలో పాల్గొనే క్రమంలో తనపై కుట్ర జరిగే అవకాశాలున్నాయని సిపికి వివరించారు.

ఉత్తరంలో 'గాలి' అనుచరుడు...?

వివి.లక్ష్మీనారాయణకు ప్రాణ హాని తలపెట్టాలని చూస్తున్న వ్యక్తి వైసిపి విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజుకు అనుచరుడని తెలుస్తోంది. ఇదే విషయాన్ని లక్ష్మీనారాయణ విశాఖ సిపికి ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నట్టు సమాచారం. గాలి జనార్ధన్‌రెడ్డి వద్ద గతంలో పనిచేసిన ఓ వ్యక్తి ఇప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గంలోనే ఉన్నారని, తన బాస్‌ను అరెస్టు చేసిన లక్ష్మీనారాయణపై కక్ష తీర్చుకుని బాస్‌కు బహుమతి ఇస్తానని పలువురితో ఆయన అన్నట్టు శుక్రవారం రాత్రి విశాఖలో ప్రచారం సాగింది. ఈ వ్యవహారమంతటితో లక్ష్మీనారాయణ మరింత ఆందోళనకు గురౌతున్నట్లు సమాచారం.

రూ.750 కోట్ల ఆస్తిపరుడు పేదవాడా?

- పెత్తందారు జగన్‌ను ఓడించండి : బిటెక్ రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

పేదవాడికి పెత్తందారికి మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో పేదవాడికి ఓటు వేయాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారని, తన అఫిడవిట్‌లో రూ.750 కోట్ల ఆస్తులు చూపించారని, పులివెందుల ప్రజలు ఆలోచించి పేదవాడినైన తనకు ఓట్లు వేసి గెలిపించాలని టిడిపి పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బిటెక్ రవి) కోరారు. కడప ద్వారకానగర్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన ఆస్తులు కేవలం రూ.80 లక్షలు మాత్రమేనని తెలిపారు. జగన్ తన నామినేషన్‌కు డబ్బు, మద్యం ఎరచూపి జన సమీకరణ చేయడాన్ని బట్టి చూస్తే ఇది ఓటమికి సంకేతమన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని తాను ఎప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించలేదని చెప్పారు. వివేకానందరెడ్డి రెండో పెళ్లి చేసుకున్నారని సిఎం జగన్ చెప్పడం అవకాశవాద రాజకీయమని విమర్శించారు. వివేకా హత్యలో ఎంపి అవినాష్‌రెడ్డి ప్రమేయం ఉందని సిబిఐ తన దర్యాప్తులో పేర్కొందన్నారు. వైఎస్‌ను విమర్శించిన మీడియాను షర్మిల వెనకేసుకు వస్తోందని సిఎం మాట్లాడుతున్నారని, మరి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని రిలయన్స్ వారు చంపినట్లు ఆరోపిస్తూ వారి ఆస్తులు ఎందుకు ధ్వంసం చేశారని ప్రశ్నించారు. జగన్ సిఎం అవుతానే అంబానీని ఇంటికి పిలిపించి ఆయన బంధువుకు రాజ్యసభ సీటు ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. వైఎస్ ఆశయం రాహుల్‌ను ప్రధాన మంత్రి చేయడానికి షర్మిలా ప్రచారం చేస్తుందని చెప్పారు. సమావేశంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ జనార్ధన్ పాల్గొన్నారు.

చావులోనూ వీడని బంధం

- భార్య మరణం తట్టుకోలేక భర్త మృతి

ప్రజాశక్తి- ఎల్ఎన్‌పేట (శ్రీకాకుళం జిల్లా)

మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఏడడుగులు నడిచారు. సంసార నౌకలో ఆప్యాయంగా పయనించారు. అన్యోన్యంగా జీవించారు. కన్న బిల్లలను కంటిపాపల్లా పెంచి పెద్ద చేశారు. ఇంతలో వృద్ధాప్యం వారిని పలకరించింది. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో, భార్య మృతి చెందింది. గంటల వ్యవధిలోనే భర్త కూడా మరణించాడు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్ పేట మండలం శ్యామలాపురం పునరావాస కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శ్యామలాపురం పునరావాస కాలనీలో ఉంటున్న నెల్లి అమ్ములు (69) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో, భర్త ఏకాశి (77) రాత్రంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. శుక్రవారం ఉదయం ఆమె దహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. అక్కడే రోదిస్తూ ఉన్న ఆమె భర్త ఏకాశి (77) అమ్ములుకు చివరి స్నానం చేయిస్తూ, హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. కొన్ని గంటల వ్యవధిలోనే భార్యాభర్తల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రుణాలు అందుకోవడంలో సవాళ్లు

- 47 శాతం మంది మహిళా పారిశ్రామికవేత్తల వెల్లడి

న్యూఢిల్లీ : తమ కుటుంబమే అతిపెద్ద ప్రేరణ అని 78 శాతం మహిళ పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడినట్లు టైడ్ అధ్యయనంలో తేలింది. భారత్ ఉమెన్ యాస్పిరేషన్ ఇండెక్స్ నివేదిక పేరుతో 18-55 ఏళ్ల వయస్సు గల 1200 మంది యాజమానులను సర్వే చేసింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాల్లోని 80 శాతం మంది మహిళలు వ్యాపారానికి డిజిటల్ అక్షరాస్యత తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. రుణాలను అందుకోవడంలో 47 శాతం మంది సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మహిళ పారిశ్రామికవేత్తలకు మద్దతును ఇవ్వడానికి తాము టైడ్ ఉమెన్ ఇన్ బిజినెస్ ఎంసెంబుల్ (టిడబ్ల్యుఐబిఇ)ని ఏర్పాటు చేశామని టైడ్ గ్లోబల్ సిఇఒ ఆలివర్ ప్రీల్ తెలిపారు. 2027 నాటికి ఏడు లక్షల మంది మహిళ చిన్న వ్యాపార యాజమానులకు మద్దతును ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు.

ఎఐతో బిపిఒ ఉద్యోగాలకు ముప్పు

- 47 టిసిఎస్ సిఇఒ హెచ్చరిక

న్యూఢిల్లీ : కృత్రిమ మేధ (ఎఐ) వల్ల కాల్ సెంటర్ పరిశ్రమలో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) సిఇఒ కృతివాసన్ అన్నారు. ఎఐతో సంప్రదాయ బిపిఒ సెంటర్ల అవసరం భారీగా తగ్గనుందన్నారు. నూతన టెక్నాలజీతో ఆసియా సహా పలు చోట్ల కస్టమర్ సర్వీస్ కార్యకలాపాల్లో పెను మార్పులకు దారి తీయనుందన్నారు. భవిష్యత్‌లో కాల్ సెంటర్స్ కనిపించకపోవచ్చన్నారు.

అపోలో హెల్త్‌కోకు రూ.2,475 కోట్ల నిధులు

హైదరాబాద్ : అపోలో హాస్పిటల్‌కు చెందిన అపోలో హెల్త్‌కో రూ.2,475 కోట్ల నిధులు సమీకరించినట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి పొందినట్లు శుక్రవారం పేర్కొంది. దీంతో అడ్వెంట్ తమ సంస్థలో 12.1 శాతం వాటాను పొందనున్నట్లు వెల్లడించింది.

వెలువడింది

నయవంచన

10 సంవత్సరాల నిరంకుశ పాలన

10 దారుణ మోసాలు

వెల : రూ. 20



చరిత్రలో ఏ కేంద్ర ప్రభుత్వమూ చేయనంత ద్రోహాన్ని మన రాష్ట్రానికి బిజెపి పాలిత కేంద్ర ప్రభుత్వం చేసింది. అయినా మన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన అధికార వైఎస్ఆర్‌సిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలతో సహా అంతటి ద్రోహానికి తలపడ్డ బిజెపితో అంటకాగుతున్నారు. ఈ పుస్తకం ఆ ద్రోహాల్ని శక్తివంతంగా వివరించింది.

ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్ - 9490099057



మీ కోసం

పగిలిన గుడ్లును కొద్దిగా వెనిగర్ కలిపిన నీటితో ఉడికిస్తే లోపలి ద్రవం బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఉన్నతంగా ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడు మనకు మనమే మార్గదర్శకులుగా మారుతాం.

ఏడు గుర్రాల రథం

ప్రశాంతపురం రాజ్యాన్ని పరిపాలించే రఘుపతి తన రాజ్యంలోని ఏడు ప్రధాన నగరాల్లో పాలనాధికారి ఎన్నికలకు తేదీ నిర్ణయించారు. ఒక వర్గం వారు వేపచెట్టు గుర్తు మీద, మరో వర్గం వారు మర్రి చెట్టు గుర్తు మీద నిలబడి తమను గెలిపించామని ప్రచారం చేయసాగారు.

వేపచెట్టు గుర్తుపై నిలబడిన ఏడుగురు అభ్యర్థులూ ఒకరోజు రఘుపతిని కలుసుకొన్నారు. 'మహారాజా, ప్రజలు మమ్మల్ని ఎన్నుకునే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఒకసారి మీరూ వచ్చి, మా తరపున ప్రచారం చేయగలరు' అని కోరారు.

వారి ఆహ్వానాన్ని మన్నించి రఘుపతి ఏడు నగరాల ప్రజలను కలవడానికి అంగీకరించాడు. ఏడుగుర్రాల రథం మీద రాజధాని నగరం నుంచి బయలు దేరాడు. ఏడు నగరాలనూ సందర్శించి వేపచెట్టు గుర్తుకు ఓటు వేయమని ప్రజలను కోరాడు.

ఎన్నికలు ముగిశాయి. వేపచెట్టు గుర్తు మీద నిలిచిన అభ్యర్థులు ఎవరూ గెలవలేదు. ఎందుకిలా జరిగిందో అర్థం కాక మంత్రిని పిలిపించి అడిగాడు రాజు. మంత్రి వేగుల ద్వారా విచారించి అసలు సంగతి తెలుసుకొన్నాడు. 'మహారాజా, మీరు ఎన్నికల ప్రచారం కోసం ఏడు గుర్రాల రథం మీద వెళ్లడం పొరపాటైంది' అన్నాడు మంత్రి.

'అదెలాగా' ఆశ్చర్యంగా అడిగారు రఘుపతి.

'మహారాజా, మీరాక కోసం ప్రజలు అన్ని ఏర్పాట్లు ఘనంగా చేశారు. అయితే మీరు రథం మీద వస్తున్నప్పుడు, ప్రయాణానికి అడ్డంగా ఉన్నాయని రహదారికి ఇరువైపులా వున్న చెట్లను నరికించారు. ఎన్నో సంవత్సరాలుగా నీడనిస్తున్న ఆ చెట్లు నరికించడం ప్రజలకు నచ్చలేదు. అందుకే తమ వ్యతిరేకతను తెలియచెప్పడానికి మర్రి చెట్టు గుర్తు వారిని ఎన్నుకొన్నారు' అని చెప్పాడు మంత్రి.

'రాజ్యాన్ని పరిపాలించే రాజుగా చెట్లకు వున్న విలువలు నేను గుర్తించలేదు. కానీ, ప్రజలు గుర్తించారు, నా పొరపాటును తెలిసేలా చేశారు. ఆ ప్రాంతంలో మళ్లీ చెట్లు నాటుతాను. ప్రజల సుఖసంతోషాలే రాజులకు కావాలి. రాజ్యం సుభిక్షంగా ఉండాలంటే పాలకులు సరైన రీతిలో పాలించాలి' అని రఘుపతి మనసులో గట్టిగా అనుకున్నాడు. మొక్కలు నాటించే పనిని పురమాయించాడు.

- ఓట్ర ప్రకాష్ రావు,
097874 46026.

దారి చూపండి

పిల్లలూ, రఘు కారులో పెట్రోల్ అయిపోయింది. బంకుకు వెళ్లే దారి చూపి సాయం చేయరూ!



నేను గీసిన బొమ్మ

- కె.ఎస్. చాంద్విక,
3వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సెలవులకు ఊరు వెళుతున్నారా?

వేసవి సెలవుల్లో చాలామంది పిల్లలతో సహా ఊర్లకు వెళుతుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కుటుంబాలు 'ఎండాకాలం సెలవుల్లో ఊరు వెళదాం' అని చాలాసార్లు అనుకునే ఉంటారు. మరి ఈ వేసవికాలం అలాంటి ప్లానులు ఏమైనా వేశారా! అయితే ఈ ప్రయాణాల్లో ముఖ్యంగా పిల్లలతో వెళుతుంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

సాధ్యమైనంత వరకు ఎండ తీవ్రత ఎక్కువగా లేని సమయంలో అంటే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణించడానికే మొగ్గు చూపాలి. అనివార్య పరిస్థితుల్లో ఎండలోనే వెళ్లాల్సి వస్తే మాత్రం ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. నిప్పులు చెరుగుతున్నంత వేడిగా ఉంటోంది. ఈ వేడికి చెమట రూపంలో మన శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. దీనివల్ల హైడ్రేట్‌కి గురవుతాం. నోరు ఎండిపోతుంది. జీర్ణక్రియ దెబ్బతింటుంది. ఈ పరిస్థితుల్లో తప్పనిసరిగా మీ వెంట ద్రవపదార్థాలు తీసుకెళ్లాలి. హైడ్రేట్ అయ్యే పరిస్థితులు తెచ్చుకోకుండా ఎప్పటికప్పుడు నీరు తాగుతూ ఉండాలి. మీతో పాటు వాటర్ బాటిల్ కానీ, వాటర్ టిన్ కానీ వెంట తీసుకెళ్లాలి. కొబ్బరినీళ్లు, ముంజెలు, పుచ్చకాయ వంటి వేసవిలో లభించేవి తరచూ తీసుకుంటూ ఉండాలి.

పిల్లలతో ప్రయాణించేటప్పుడు వారికి ఎండ దెబ్బ కొట్టకుండా జాగ్రత్త పడాలి. కళ్లను రక్షించుకునేందుకు కళ్లజోడులు తప్పనిసరిగా వాడాలి. తల మీద నేరుగా ఎండ పడకుండా స్కార్ఫ్‌ని కప్పుకోవాలి.

ఈ కాలంలో జీర్ణ సమస్యలు చాలా సాధారణం. ప్రయాణాలప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువవుతుంది. ఆహారపు అలవాట్లలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి. ఆకలి లేదని చాలామంది కొంచెం కొంచెం తింటుంటారు. ఈ అలవాటు మానుకోవాలి. అపరిశుభ్ర వాతావరణంలో వండిన ఆహారాన్ని అస్సలు తీసుకోకూడదు. లేనిచో గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.

ఈ రోజుల్లో ప్రయాణమంటే బట్టల బ్యాగుతో పాటు మందుల బాక్సు కూడా వెంట తీసుకెళ్తున్నారు. మీ ప్రయాణంలో కూడా వడదెబ్బ తగిలినప్పుడు తక్షణ సహాయం చేసే ఔషధాలను దగ్గర పెట్టుకోవాలి. వృద్ధులతో ప్రయాణించేటప్పుడు కూడా పిల్లలకు తీసుకునే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తరచూ నీటిని తాగడం, పండ్ల రసాలు, పండ్లు తీసుకోవడం, ద్రవపదార్థాలు సేవించడం వంటి సాధారణ క్రియలన్నింటినీ పాటించాలి.

ఈతకొలనులో ఈ జాగ్రత్తలు పాటించండి!

ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చాలామంది స్విమ్మింగ్ చేస్తుంటారు. గ్రామాల్లో అయితే చెరువులు, కాలువలు ఉంటాయి. పట్టణాల్లో వాటి సౌలభ్యం లేదు కాబట్టి, చాలామంది స్విమ్మింగ్ పూల్స్‌కి క్యూ కడతారు. అయితే స్విమ్మింగ్ పూల్‌లో నీళ్లు పాడవ్వకుండా ఉండటానికి, పలు రకాల రసాయనాలు కలుపుతారు. ఇలాంటి నీటిలో ఎక్కువసేపు గడపడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు వస్తాయి. అవి రాకుండా ఉండాలంటే.. ముందు జాగ్రత్తలు పాటించాలి.

మాయిశ్చరైజర్ అప్లై చేయాలి

స్విమ్మింగ్ చేయడం వల్ల శరీరం తేమను కోల్పోతుంది. కాబట్టి స్విమ్మింగ్ చేసే ముందు శరీరానికి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. లేదా, క్లోరిన్ న్యూట్రలైజింగ్ లోషన్‌ను రాసుకోవాలి. వీటి వల్ల చర్మం తేమగా ఉంటుంది. ఇవి అందుబాటులో లేని వారు, కొబ్బరి నూనె లేదా ఆలివ్ ఆయిల్ అయినా రాసుకోవాలి. సన్ స్క్రీన్ రాసుకుంటే, 20 నిమిషాల తర్వాతే స్విమ్మింగ్ చేయాలి. నీటిలో ఎక్కువగా ఉంటే ఓ గంట తర్వాత మళ్లీ రాసుకోవాలి.

స్విమ్మింగ్ చేసిన తర్వాత తడి బట్టలతో ఎక్కువ సేపు ఉండకూడదు. దీని వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గే అవకాశాలు ఉన్నాయి. చర్మంపై ఇన్‌ఫెక్షన్లు కూడా రావొచ్చు.

స్విమ్మింగ్ చేసేవారి పెదవులు సన్ బర్న్, డీ హైడ్రేషన్‌కు గురవుతాయి. కాబట్టి స్విమ్మింగ్‌కు వెళ్లే ముందు లిప్ బామ్‌ను ఉపయోగించాలి. నీటిలో ఎక్కువగా ఉంటే, ఓ గంట తర్వాత మళ్లీ రాసుకోవాలి.

నదుల్లో, చెరువుల్లో జాగ్రత్త!

చెరువులు, నదులు, బావుల్లో ఈతకు వెళ్లే వారు చాలా అప్రమత్తంగా ఉండాలి. వాటి లోతుపాతులు తెలియకుండా దిగకూడదు. పట్టణాల నుంచి ఊళ్ల వెళ్లే పిల్లలు తమ స్నేహితులతో కలిసి తెలియని చోట ఈతకు దిగరాదు. స్విమ్మింగు పూల్‌లో ఈతకు వీలుగా ఏర్పాట్లు ఉంటాయి. నదులూ, చెరువుల్లో అలా కాదు. ఒక్కోచోట ఒక్కో లోతు ఉండొచ్చు. కిందకు వెళితే కూరుకుపోయేలా చేసే బురద, తుప్పలూ ఉండొచ్చు. కాబట్టి, స్థానికులూ, పెద్దల పర్యవేక్షణ లేకుండా ఈతకు లేదా స్నానానికి ఉపక్రమించరాదు. ఈత తెలియని పిల్లలు కూడా ఉత్సాహం కొద్దీ నదుల్లోకి దిగుతుంటారు. సురక్షితం కాని చోట అలా చేయకూడదు.

తమ పిల్లలు ఎక్కడెక్కడ తిరుగుతున్నారో తల్లితండ్రులు తెలుసుకుంటూ ఉండాలి. నదుల్లో, చెరువుల్లోదిగొద్దని హెచ్చరించాలి. పిల్లలు ముచ్చటపడితే తామే నేరుగా తీసుకెళ్లి సురక్షిత ప్రాంతాల్లో ఈత నేర్పించాలి. అప్రమత్తత లోపిస్తే సరదాలు విషాదాంతాలయ్యే ప్రమాదం ఉందని పత్రికల్లో వచ్చే అలాంటి వార్తలు చూపించి, హెచ్చరించాలి.

లక్ష్యాలను చేరుకోని పిఎం-కిసాన్

- ఆరు వేల సాయం ఏ మూలకు?
- కఠిన నిబంధనలతో నానాటికీ తగ్గిపోతున్న లబ్ధిదారులు
- రెట్టింపు కాని అన్నదాత ఆదాయం
- భూమి లేని రైతులకు లభించని బాసట
- పథకానికి అంటిన అవినీతి మకిల



న్యూఢిల్లీ : వ్యవసాయ సంక్షేమమే ధ్యేయంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం-కిసాన్) ఆశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. ముఖ్యంగా రైతన్నల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. భూమి లేని రైతులకు ఈ పథకం ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అంటే 2.4 కోట్ల రైతు కుటుంబాలు ఈ పథకానికి దూరంగా ఉండిపోయాయి. దీనికి తోడు పథకం అమలులో అవినీతి చోటుచేసుకోవడంతో నిధులు వృథా అవుతున్నాయి.

రైతు కుటుంబాలకు ఈ పథకం కింద ఏటా మూడు విడతలుగా మొత్తం ఆరు వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నారు. పథకం ద్వారా దేశంలో తొమ్మిది కోట్ల మంది రైతులు లబ్ధి పొందినప్పటికీ 2022లో జాతీయ సగటు వ్యవసాయ ఆదాయం బిజెపి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యంలో 70 శాతం కంటే తక్కువగానే ఉంది. కేంద్రం ఏటా అందజేస్తున్న ఆరు వేల రూపాయల ఆర్థిక సాయం కూడా రైతులందరికీ చేరడం లేదు. కేవలం భూమి ఉన్న రైతులకే ఈ సాయం లభిస్తోంది. 2018 డిసెంబర్ 1న ప్రారంభమైన ఈ పథకాన్ని తొలుత చిన్నకారు, సన్నకారు రైతుల కోసం ఉద్దేశించారు. ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. 2019 ఫిబ్రవరిలో... అంటే లోక్‌సభ ఎన్నికలకు ముందు దీనిని మధ్యంతర బడ్జెట్‌లో చేర్చారు.

తగ్గిపోతున్న లబ్ధిదారులు

పథకాన్ని ప్రారంభించి ఐదు సంవత్సరాలు గడిచాయి. ఇప్పటి వరకూ లబ్దిదారులకు 16 విడతలుగా ఆర్థిక సాయాన్ని విడుదల చేశారు. 2021-22 నాటికి పథకంలో 11.2 కోట్ల మంది రైతులు (11వ విడత చెల్లింపుల సమయానికి) చేరారు. అయితే ఆ తర్వాత 12, 13 విడతల ఆర్థిక సాయం అందించే నాటికి లబ్దిదారుల సంఖ్య బాగా తగ్గిపోయింది. 14వ విడత చెల్లింపులు జరిపినప్పుడు లబ్దిదారుల సంఖ్య 9.6 కోట్లకు చేరింది. లబ్దిదారుల సంఖ్య ఎందుకు తగ్గుతోందో ప్రభుత్వం వివరణ ఇవ్వడం లేదు. నిబంధనలను కఠినతరం చేయడం, వివిధ రాష్ట్రాలలో అవకతవకలు చోటు చేసుకోవడం దీనికి కారణంగా తెలుస్తోంది. రైతుల పేరుతో కొందరు బయటి వ్యక్తులు ఆర్థిక సాయం పొందారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

గత సంవత్సరం మార్చి నాటికి మూడు కోట్ల మంది మహిళా రైతులు ఈ పథకం ద్వారా లబ్ది పొందారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య రెండు కోట్లకు తగ్గిపోయింది. ఫిబ్రవరి నాటికి ఈ పథకం కింద లబ్ది పొందిన రైతుల సంఖ్య 8.71 కోట్లు. ఆర్థిక సాయం పొందడానికి సవాలక్ష నిబంధనలు విధించడంతో పథకంపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. అనేక రాష్ట్రాలలో పెద్ద ఎత్తున మోసాలు జరుగుతున్నాయి.

భూమి లేని రైతులకు విస్మరించారు

భూమి లేని రైతులను విస్మరించడం ఈ పథకంలో ప్రధాన లోపంగా కన్పిస్తోంది. 2011లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో 5.37 కోట్ల కుటుంబాలకు భూమి లేదు. 2019లో నిర్వహించిన మరో సర్వే ప్రకారం 2.4 కోట్ల రైతు కుటుంబాలు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాయి. 2019లో జరిపిన సర్వేను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ 2.4 కోట్ల కుటుంబాలకు పిఎం-కిసాన్ పథకం ప్రయోజనాలు అందడం లేదు.

ఇదేం సాయం?

ఏటా మూడు విడతలుగా అందజేస్తున్న ఆరు వేల రూపాయల ఆర్థిక సాయం ఏ మూలకూ చాలడం లేదు. రైతన్నల ఆదాయంపై అది ఏ మాత్రం ప్రభావం చూపలేకపోతోంది. రైతు కుటుంబం నెలకు సగటున రూ. 10,218... అంటే ఏడాదికి రూ.1,22,616 ఆదాయం పొందుతోందని 2019లో అంచనా వేశారు. 2022 నాటికి వార్షిక ఆదాయం రూ.1,67,000కు పెరిగి ఉండవచ్చునని అంచనా. మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతు కుటుంబం ఏడాదికి రూ.2,42,998 ఆదాయం పొందాల్సి ఉంది. ఈ వ్యత్యాసాన్ని పూడ్చడానికి ఏటా ఇస్తున్న ఈ ఆరు వేల రూపాయల సాయం ఏ మాత్రం సరిపోదు.

దేశంలోని 76.5 శాతం రైతు కుటుంబాలకు రెండున్నర ఎకరాల కంటే తక్కువ భూమే ఉంది. వీరి సగటు నెలసరి ఆదాయం చాలా తక్కువ. ప్రతి ఏటా పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పోలిస్తే కేంద్రం ఇస్తున్న ఆర్థిక సాయం రైతన్నల ఇబ్బందులను ఏ మాత్రం తొలగించదు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2019లో ఇచ్చిన ఆరు వేల రూపాయల ఆర్థిక సాయం 2023 నాటికి రూ.4,800తో సమానం. అంటే దీనర్థం రైతుల ఆదాయం 2016 నుండి 2024 నాటికి కూడా రెట్టింపయ్యే అవకాశాలు లేవు.

రాష్ట్రాల బాసట

కొన్ని రాష్ట్రాలు పిఎం-కిసాన్‌కు అనుబంధంగా పథకాలు అమలు చేస్తున్నాయి. తెలంగాణలో రైతుబంధు పథకం ఆ కోవకు చెందినదే. ఆంధ్రప్రదేశ్, ఒడిషా, హర్యానా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు భూమి లేని, కౌలు రైతులకు కూడా పథకాలను అమలు చేస్తున్నాయి. జార్ఖండ్, హర్యానా రాష్ట్రాలు నిరుపేద రైతులే లక్ష్యంగా పథకాలు ప్రవేశపెట్టాయి. అనేక రాష్ట్రాలు నేరుగా రైతులకు నగదు బదిలీ చేస్తూ అవినీతికి ఆస్కారం లేకుండా చేస్తున్నాయి.

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం రోడ్డు - తిరుపతి, కొచ్చువేలి - బరౌని - కొచ్చువేలి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు 07440 తిరుపతి - శ్రీకాకుళం రోడ్ స్పెషల్ మే 5, 12 తేదీల్లో రాత్రి 20.05 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 08.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 07441 శ్రీకాకుళం రోడ్డు -తిరుపతి ప్రత్యేక రైలు మే 06, 13 తేదీలలో మధ్యాహ్నం 15.00 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి సాయంత్రం 18:38 గంటలకు దువ్వాడ చేరుకుని 18.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరుపతి, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా ప్రయాణిస్తాయి. 06091 కొచ్చువేలి నుంచి బరౌని సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 04 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం అర్ధరాత్రి 01.30 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 10.50 గంటలకు బయలుదేరి సోమవారం 13.55 గంటలకు బరౌని చేరుకుంటుంది. 06082 బరౌని - కొచ్చువేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బరౌనిలో మే 7 నుండి జూలై 2 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 15.30 గంటలకు బయలుదేరుతుంది. ఇది మరుసటి రోజు ఉదయం 04.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 04.20 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 9:55 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్ పరిధిలో దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా ప్రయాణిస్తాయి.

ఇవి కీలక ఎన్నికలు : రాహుల్

న్యూఢిల్లీ : ఇవి గతంలో జరిగిన ఎన్నికల వంటివి కాదని, భారతదేశ చరిత్రలో మొదటిసారి ఓ పార్టీ, ఓ వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకుంటున్నారని, వారికి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. శుక్రవారం కర్ణాటకలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. కొందరు బిలియనీర్లకు ప్రధాని దోచిపెట్టిన సంపదను దేశంలోని పేద ప్రజలకు పంచి పెడతామని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. భారత్‌లో పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల సహా కొన్ని కీలకాంశాలు ఉన్నాయని, కాంగ్రెస్ మాత్రమే నిరుద్యోగాన్ని నిర్మూలించగలదని, ధరల పెరుగుదలను అదుపు చేయగలదని, ప్రజలకు వారి వాటాను అందించగలదని అన్నారు.

ఖర్చు చేయని ఎంపిలాడ్ నిధులు రెట్టింపు



న్యూఢిల్లీ : 2019లో పార్లమెంటుకు ఎన్నికైన ఎంపిలు స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపిల్యాడ్) కింద వారికి కేటాయించిన నిధులను వినియోగించలేదని వెల్లడైంది. 2014లో ఎన్నికైన ఎంపిలు కూడా ఆ నిధులను వినియోగించలేదని స్పష్టమైంది. ఈ పథకం కింద ఖర్చు చేయని నగదు 2014-19 (8.7 శాతం)తో పోలిస్తే.. ప్రస్తుత పదవీకాలం పూర్తయ్యే నాటికి రెండింతలు పెరిగి 16 శాతంకి చేరాయని పేర్కొంది. ఏప్రిల్ 2024 వరకు స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ మంత్రిత్వ శాఖ (ఎంఒఎస్‌పిఐ) డేటా ప్రకారం మొత్తం రూ.5,185 కోట్లు జిల్లా యంత్రాంగ ఖర్చు చేయాల్సి వుండగా, రూ.842 కోట్లు ఇప్పటికీ ఖర్చు చేయలేదని తేలింది. కరోనా సమయంలో ఈపథకం దాదాపు 18 నెలలు నిలిపివేయబడినప్పటికీ.. మొత్తం నగదులో ఖర్చు చేయని నగదు వాటా మూడు రెట్లు పెరిగింది. 2014-19లో రూ.12,945 కోట్లు విడుదల చేయగా, కరోనా తర్వాత ఈ పథకానికి ప్రభుత్వం విడుదల చేసే నిధులు సగానికి పైగా తగ్గాయి.

15వ లోక్‌సభతో (2004-09) పోలిస్తే.. మొత్తం కేటాయించిన నిధులు (రూ.10,926) కాగా, వాటిలో ఖర్చు చేసింది (రూ.379 కోట్లు) కేవలం 3.4 శాతం మాత్రమేనని తేలింది.

ప్రతిఏడాది ప్రతి ఒక్క పార్లమెంటు సభ్యునికి వారి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రూ. 5కోట్లు కేటాయిస్తుంది. తమ నియోజకవర్గాల్లో నిర్వహించాలనుకుంటున్న అభివృద్ధి పనులను చేపట్టాల్సిందిగా ఎంపిలు జిల్లా యంత్రాంగానికి లేఖ రాస్తారు. 2019ఎన్నికైన ఎంపిలు వారి నియోజకవర్గాల్లో కేవలం 96.3 శాతం నిధులనుమాత్రమే వినియోగించినట్లు నివేదిక స్పష్టం చేసింది. 15వ లోక్‌సభ (102.7) శాతం నిధులు వినియోగించగా, 16వ లోక్‌సభ 99 శాతం నిధులను వినియోగించింది.

హర్యానా కేవలం (74 శాతం) అత్యంత తక్కువ నిధులను వినియోగించగా, జమ్ముకాశ్మీర్ (77.5 శాతం), తెలంగాణ (78శాతం), పశ్చిమబెంగాల్ (80శాతం) నిధులను ఖర్చు చేశాయి. ఎపి 131 శాతం, గుజరాత్ 109 శాతం, కర్ణాటక 107.9 శాతం, హిమాచల్ ప్రదేశ్ 105 శాతం ఖర్చు చేసినట్లు నివేదిక తెలిపింది.

'కూ' ఉద్యోగులకు జీతాలు నిలిపివేత

- భారత మైక్రోబ్లాగింగ్ యాప్ వెల్లడి
- 'ఎక్స్'కు పోటీగా గతంలో ప్రచారం కల్పించిన మోడీ సర్కారు



న్యూఢిల్లీ : ప్రపంచంలో తీవ్రంగా ప్రాచుర్యం పొందిన ట్విట్టర్ (ప్రస్తుతం 'ఎక్స్')కు పోటీగా మోడీ సర్కారు భారతీయ మైక్రోబ్లాగింగ్ యాప్ 'కూ'కు తీవ్ర ప్రచారాన్ని కల్పించింది. అయితే, ఇప్పుడు ఆ కూ తన సంస్థలోని ఉద్యోగులకు జీతం చెల్లించలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ ఉద్యోగులందరికీ జీతాల చెల్లింపును నిలిపివేసింది. ఈ విషయాన్ని కంపెనీ వెల్లడించింది.2020లో, ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో, చాలా మంది కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు 'కూ'కు మారారు. తమ అకౌంట్లను సృష్టించుకున్నారు. దీంతో ఈ యాప్‌నకు అప్పట్లో ప్రభుత్వ పరంగానే విపరీత ప్రచారం కలిగింది. "మేము కూ కోసం వ్యూహాత్మక భాగస్వాములతో చర్చలు జరుపుతున్నాం. ఇది ఊహించిన దాని కంటే ఎక్కువ సమయం తీసుకుంటుంది. భాగస్వామ్యాన్ని పొందడానికి, మేము గత జీతాలను తీర్చడానికి కూడా గణనీయమైన వ్యక్తిగత నిధులను ఖర్చు చేశాం" అని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. 2022, జూన్ నుంచి కంపెనీ తన ఉద్యోగులను 80 శాతం తగ్గించింది. చాలా మంది ఉద్యోగుల జీతాలు 40 శాతం వరకు తగ్గాయని ఒక నివేదిక పేర్కొన్నది. జీతంలో గణనీయమైన కోత తర్వాత ఈ సంవత్సరం ప్రారంభంలో సీనియర్ ఉద్యోగులు కంపెనీని విడిచిపెట్టారు.

డిజిటల్ హక్కుల కార్యకర్త నిఖిల్ పహ్వా 2022లో బిబిసితో మాట్లాడుతూ.. ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా 'కూ'ని స్వదేశీ, జాతీయవాద దృక్పథంతో ప్రోత్సహించడానికి మోడీ ప్రభుత్వం ప్రచారం కల్పించింది. దీంతో మైక్రోబ్లాగింగ్ యాప్‌నకు ఇది సానుకూలంగా మారింది. ఒక స్థాయిలో అప్పటి ట్విట్టర్‌కు తీవ్ర పోటీనే ఇచ్చింది అని తెలిపారు.

నివేదిక ప్రకారం.. కంపెనీ కేవలం రూ. 14 లక్షల నిర్వహణ ఆదాయాన్ని కలిగి ఉన్నది. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.197 కోట్ల నష్టాన్ని చూసింది. కస్టమర్ సముపార్జన ప్రచారాలపై అధికంగా ఆధారపడుతున్నది. 2022, జూన్‌లో ఆన్‌బోర్డ్ కొత్త వినియోగదారులకు చెల్లింపు ప్రచారాలను నిలిపివేసిన తర్వాత.. దాని వినియోగదారులు 72 లక్షల నుంచి 27 లక్షలకు పడిపోయారని నివేదిక పేర్కొన్నది.